మాయమైపోతున్నదమ్మ మన రెవెన్యూ స్టాంపు



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 21 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 256 | పేజీలు:12 | వెల రూ.5


ఫలించిన పాలిటెక్నిక్ పోరాటం




5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

# వారిది గురివింద తీరు

## కాలుష్యాన్ని పెంచేది వారే.. లొల్లి పెట్టేదీ వారే

తమ తప్పిదాలను ఇతర దేశాలపై తోస్తున్న సంపన్న దేశాలు

వాతావరణ మార్పులపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభంలో మోడీ



ఢిల్లీ, సెప్టెంబర్ 20: మన దేశంతో పోల్చి చూసినప్పుడు సంపన్న దేశాలు వెలువరించే తలసరి కర్బన ఉద్గారాలు 6 రెట్లు ఎక్కువని, ప్రపంచ వేదికలపైనా దీనిని గట్టిగా చెబుతున్నామని ప్రధాని మోడీ తెలిపారు. అయినప్పటికీ వాతావరణ మార్పులకు వర్ధమాన ...మిగతా 2లో

## సర్ సిత్రాలు

# జై శంకర్‌కు నోటీసు

## అద్వానీ, మనీష్ సిసోడియాకు కూడా



ఢిల్లీ, సెప్టెంబర్ 20: ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ (సర్) ప్రక్రియ పొలిటికల్ గా తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయన్న కారణంతో ఎన్నికల సంఘం ఏకంగా 33.13 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేసింది. ఈ జాబితాలో మాజీ ఉప ప్రధాని ఎల్ కే అద్వానీ , మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా వంటి ప్రముఖులు కూడా ఉండటం టెన్షన్‌కు దారితీసింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. తాజాగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్తోపాటు ఆయన ...మిగతా 2లో



# ఇందిరమ్మ లబ్ధిదారులకు నేటి నుంచి

# అలాట్‌మెంట్ లెటర్స్

## మొబైల్ ఫోన్లకు వచ్చేస్తయ్ | రాయదుర్గంలో టవర్స్ నిర్మాణానికి మధ్యాహ్నం శంకుస్థాపన



హైదరాబాద్, సెప్టెంబర్ 20: ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఎంపికైన లబ్ధిదారులకు నేటి నుంచి అలాట్ మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు హౌసింగ్ బోర్డు ప్రకటించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సప్, ఎస్సెమ్మెస్ ద్వారా ఈ పత్రాలను పంపనున్నారు. అలాగే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్ సైట్ నుంచి కూడా వీటిని డౌన్లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నేడు శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో సుమారు రూ.750 కోట్లకు పైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మిస్తారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో, మార్కెట్లో దాదాపు రూ.50 లక్షల విలువ చేసే ఒక్కో ఫ్లాట్ను... కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందిస్తోంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్.. ఒక్కో ఫ్లాట్కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని ఇస్తోంది. కాగా, మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని హౌసింగ్ బోర్డు అధికారులు సూచించారు.

## ఆందోళన చెందొద్దు

దళితుల భూములను ప్రభుత్వం తీసుకోదు

వాటికి సర్కారే సంపూర్ణ రక్షణగా నిలుస్తుంది 2

స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి

# బ్యాంకులు.. 5 రోజులు బంద్

## ఖాతాదార్లకు ఎస్‌బీఐ అడ్వైజరీ

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు ప్రకటన




ఢిల్లీ, సెప్టెంబర్ 20: దేశవ్యాప్తంగంగా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ తలపెట్టిన మూడు రోజుల దేశవ్యాప్త బ్యాంకు సమ్మె నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇవాళ ఓ కీలక అడ్వైజరీని జారీ చేసింది. సెప్టెంబర్ 28 నుంచి 30, 2026 వరకు అంటే 3 రోజుల పాటు ఈ సమ్మె జరగనుంది. సమ్మె కాలంలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా, కస్టమర్లు తమ అత్యవసర బ్రాంచ్ సంబంధిత లావాదేవీలను ముందే పూర్తి చేసుకోవాలని సూచించింది. సెప్టెంబర్ 11న నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె తర్వాత, ...మిగతా 2లో

కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్న

# నేను బహుజనుల బాణాన్ని

అధికారానికి దూరంగా ఉన్న బహుజనుల కోసమే వస్తున్న

పాంచజన్య సంకల్ప సభలో కవిత

యువత, బహుజనుల కోసం ఎవరితోనైనా కొట్లాడ్త



హైదరాబాద్, మనం ప్రతినిధి: తాను వాళ్లా వీళ్లా ఎవరో వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ...మిగతా 2లో



# బీసీ హక్కుల కోసం

# ఐక్య పోరాటాలు చేయాలె

50 శాతం రిజర్వేషన్ల పరిమితిపై కేంద్రం పునరాలోచించాలె

జాతీయ ఓబీసీ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (మనం బ్యూరో): 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీల జనాభా ఎంత ఉందో శాస్త్రీయంగా లెక్కించినప్పుడే వారికి జనాభా ప్రాతిపదికన న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. బేగంపేటలోని హరిత ప్లాజాలో ఆదివారం నిర్వహించిన ఓబీసీ జనాభా గణనపై కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలు అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొని ...మిగతా 2లో



3

25న మహాగణపతి

## నిమజ్జనం

# మూడు రోజుల పాటు కుండపోత వానలు!



23-25 తేదీల మధ్య పెరిగే అవకాశం

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో మరోమారు రానున్న మూడు రోజులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే ...మిగతా 2లో

## దానంకు ఉపఎన్నికలు కలిసిరావు?

ఖైరతాబాద్‌లో ఆయన ఓడిపోతడు.. బీజేపీ గెలుస్తది

న్యాయపరమైన ప్రక్రియ

తరువాతే ఉప ఎన్నిక: ఎంపీ రఘునందన్ రావు



హైదరాబాద్, మనం ప్రతినిధి: దానం నాగేందర్ అనర్హత వ్యవహారం నేపథ్యంలో ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే, గత అనుభవాలను పరిశీలిస్తే?.. నాగేందర్‌కు ఉపఎన్నికలు కలిసి రావన్నారు. మరోసారి ఆయన ఓటమి ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ అంచనా వేశారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు.. దానం నాగేందర్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ...మిగతా 2లో

రాష్ట్రంలో ఫామ్‌హౌస్ ఫైల్స్

# నడుస్తున్నయ్

భువన గిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్

సందర్శించిన కాంగ్రెస్ బృందం



హైదరాబాద్, సెప్టెంబర్ 20, (మనం బ్యూరో): రాష్ట్రంలో ఫామ్ హౌస్ ఫైల్స్ కథలు, నడుస్తున్నాయని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను చామల నేతృత్వంలోని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో చాలా బాగోతాలు జరిగాయనీ, ఇక్కడి నుంచే ఎమ్మెల్యేల కొనుగోలు జరిగిందన్నారు. ఇక్కడి నుంచే నలుగురు ఎమ్మెల్యేల జాతి రత్నాలను తీసుకుని కేసీఆర్ మునుగోడు ఉప ఎన్నికల ప్రచారానికి వచ్చారనీ, ఈ ఫామ్ హౌస్‌లో జరిగిన దానికి ఆయన విట్నెస్ అని పేర్కొన్నారు. అసైన్డ్ భూమిలో ఫామ్ హౌస్ కట్టుకునే అధికారం రోహిత్ రెడ్డికి ఎవరిచ్చారనీ, కేటీఆర్ డ్రామాలు ఆడుతూ ఒకరోజు ...మిగతా 2లో

# స్వీయ వికాస ఏఐ

## త్వరలోనే అందుబాటులోకి వస్తోంది

మనిషిలాగే ఆలోచించి పని చేస్తుంది(ట)



న్యూయార్క్, సెప్టెంబర్ 20: కృత్రిమమేధ (ఏఐ) మోడల్స్ స్వీయ శిక్షణతో అంతకంతకూ తమ సామర్థ్యాన్ని తామే మెరుగుపరచుకునే రోజు ఇప్పుడు ఎంతో దూరం లేదనిపిస్తోంది. ఈ స్వీయ వికాస సత్తాను 'రికర్సివ్ సెల్ఫ్-ఇంప్రూవ్‌మెంట్' (ఆర్ఎస్ఐ) అంటారు. ఆర్ఎస్ఐ ద్వారా సైన్స్, వైద్య రంగాల్లో అపార పురోగతి సిద్ధిస్తుందని టెక్ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు చెబుతున్నా, దీనివల్ల మానవుడి అదుపు నుంచి ఏఐ తప్పించుకుంటుందనే భయాలూ ఉన్నాయి. తన శక్తిని తానే పెంచుకోగల ఏఐ చివరకు మానవాళికి ముప్పు తెస్తుందని ఆందోళన కలుగుతుంది. అందుకే గత వారాంతంలో పలువురు ఏఐ దిగ్గజాలు ఈ టెక్నాలజీ వృద్ధి వేగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. ఏఐ మోడల్ క్లాడ్ తనకన్నా తెలివైన తదుపరి వెర్షన్‌ను అభివృద్ధి చేయడంలో ఆంత్రోపిక్ కంపెనీకి తోడ్పడుతోంది. ఇందుకు సంబంధించిన పరిశోధన-అభివృద్ధిలో 26 శాతాన్ని క్లాడ్ నడిపిస్తోంది. అంటే క్లాడ్ మానవ పర్యవేక్షణలో ఉంటూనే, తనకు ఇచ్చిన పనిలో ఎక్కువ భాగాన్ని మొదటి నుంచి చివరి వరకు పూర్తి చేయగలదని కంపెనీ తెలిపింది. ఈ మోడల్స్ ఇప్పటికైతే పూర్తి స్వయంప్రతిపత్తితో ...మిగతా 2లో

# హ్యాకింగ్‌లోనూ మనోళ్లు తోపులే

## ఓపెన్ ఏఐని హ్యాక్ చేసిన భారతీయులు



హైదరాబాద్, సెప్టెంబర్ 20: సంచలనం సృష్టిస్తూ, ఆంత్రోపిక్ కు చెందిన క్లాడ్ ఏఐ టూల్ సహాయంతో ప్రముఖ సంస్థ ఓపెన్‌ఏఐ సిస్టమ్‌ను ముగ్గురు భారతీయుల హ్యాక్ చేశారు. సైబర్ సెక్యూరిటీ స్టార్టప్ హ్యాక్ట్రాన్ ఏఐకి చెందిన పరిశోధకులు ఓపెన్‌ఏఐ అధికారిక బగ్ బౌంటీ ప్రోగ్రామ్ లో భాగంగా ఈ సెక్యూరిటీ టెస్టును విజయవంతంగా పూర్తి చేశారు.

**ఎవరా ముగ్గురు?**

హ్యాక్ట్రాన్ ఏఐ సంస్థలో పనిచేస్తున్న హర్ష్ జైస్వాల్, మోహన్ పెదపాటి, రాహుల్ మైని అనే ముగ్గురు భారతీయ ఒరిజిన్ సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఈ ప్రయోగం వెనుక ఉన్నారు. సాఫ్ట్వేర్ లోపాలను కనుగొనడంలో, సిస్టమ్స్ను టెస్ట్ చేయడంలో వీరికి మంచి అనుభవం ఉంది. ఈ రీసెర్చ్ ను హర్ష్ ...మిగతా 2లో

# ప్రారంభోత్సవాల్లో నయా ట్రెండ్

## పని చేసినోళ్లకే 'రిబ్బన్ కట్టింగ్' అవకాశం




ఎరుమేలి, సెప్టెంబర్ 20: పనులు చేయించింది, నిధులు సాధించింది ఎవరైనప్పటికీ ప్రారంభోత్సవ గౌరవం తాజా ప్రజాప్రతినిధికి దక్కడం సాధారణమే. కానీ కేరళలో దీనికి భిన్నమైన ఘటన జరిగింది. తాను ఇటీవలే ఎమ్మెల్యేనైనా.. ఓ ఊరి వంతెన సాకారం అయ్యేందుకు మునుపటి ఎమ్మెల్యే కారణం కాబట్టి ఆయనే దానిని ప్రారంభించాలని పట్టుబట్టి మరీ అలాగే చేయించారు. పూజార్ నియోజకవర్గం నుంచి ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన సెబాస్టియన్ కులథుంకాల్ను ...మిగతా 2లో

ఇదే అసలైన 'కేరళం స్ఫూర్తి కథ' 2

# మాయమైపోతున్నదమ్మ మన రెవెన్యూ స్టాంపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** నిన్నమొన్నటి దాకా ఏ ఆర్థిక వ్యవహారానికైనా రెవెన్యూ స్టాంపు ఉండాల్సిందే. అది ఉంటేనే ఏ పనైనా ఇట్టే జరిగిపోతుంది. స్టాంపుపై సంతకం చేస్తే అదో జమానత్ లేదా అగ్రిమెంట్ గుర్తుగా ఉండేది. డిజిటలైజేషన్ విప్లవంతో ఈ స్టాంపుల వినియోగం బాగా తగ్గిపోయింది. లోన్ యాప్‌లు, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు, కొన్ని బ్యాంకులు సైతం వ్యక్తుల ఆధార్ కార్డు, సెల్ నంబర్ ఆధారంగానే అప్పులు ఇస్తున్నాయి. ఇక ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు క్రెడిట్ కార్డులు ఆధారంగా మంజూరు చేస్తున్నాయి. దీంతో రెవెన్యూ స్టాంపుల వైపు చూసేవారుండటం లేదు. ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2.95 లక్షల రెవెన్యూ స్టాంపులు ఉన్నాయి. కొనేవారు లేకపోవటంతో ఐదేండ్లుగా అవి అట్లాగే ఉండిపోతున్నాయి. ఎల్లెడలా ఇదే పరిస్థితి ఉంది. డిజిటలైజేషన్ మరింత పెరుగుతున్న ప్రస్తుత క్రమంలో ఈ రెవెన్యూ స్టాంపు కనుమరుగయ్యే క్రమంలో ఉండడం గమనార్హం.

# బీసీ హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్‌లోని ఓబీసీ ఫోరం ఆధ్వర్యంలో బీసీల సమస్యలపై పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ హక్కుల కోసం ఐక్య పోరాటం అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో బీసీల సమస్యలపై కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీల నాయకులను సైతం కలుపుకుని పోరాడుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టామనీ, వివిధ వర్గాల నిపుణులు, మేధావులు, స్టేక్ హోల్డర్ల అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. కేబినెట్‌లో చర్చించిన అనంతరం శాసనసభలో తీర్మానం చేసి అన్ని రాజ్యాంగపరమైన ప్రక్రియలను పూర్తి చేసి గవర్నర్ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి పంపించామని తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్లు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కచ్చితమైన ఎంపిరికల్ డేటా అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికి కులగణన ద్వారా ఎంపైరికల్ డాటాను సేకరించిందని తెలిపారు. బీసీలు ఎంతమంది ఉన్నారో లెక్కించకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలోఎలా నిర్ణయిస్తామని ప్రశ్నించారు. బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించాలనీ, జనాభాకు అనుగుణంగా న్యాయపరమైన ప్రాతినిధ్యం కల్పించాలని 2017 జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# హ్యాకింగ్‌లోనూ మనోళ్లు తోపులే

(మొదటి పేజీ తరువాయి)

జైస్వాల్ లీడ్ చేయగా.. మోహన్ పెదపాటి, రాహుల్ మైని సహకరించారు.

**ఎట్ల హ్యాక్ చేసిండ్రంటే..**

ఓపెన్‌ఏఐ పబ్లిక్ కమ్యూనిటీ ఫోరమ్లో ఇమేజ్ ఫైల్సును హ్యాండిల్ చేసే విధానంలో ఓ భారీ లోపాన్ని ఆ ముగ్గురు టెక్కీల బృందం గుర్తించింది. ఇది ఫోరమ్ సర్వర్ పై కోడ్ రన్ చేసేందుకు అవకాశం కల్పిస్తుంది. ఈ లోపాన్ని మరింత విశ్లేషించడానికి, ఎక్స్ప్లోయిట్ను అభివృద్ధి చేయడానికి ఆంత్రోపిక్కు చెందిన ఏఐ చాట్బాట్ క్లాడ్ సహాయం తీసుకున్నారు. కోడింగ్ రాయడం, డీబగ్గింగ్ చేయడం, ఎక్స్ ప్లాయిట్ ను మార్పులు చేయడంలో క్లాడ్ వారి పనులను మరింతీ ఈజీ చేసింది. ఆ తర్వాత లాగిన్ టోకెన్ల ద్వారా ఓపెన్‌ఏఐ ఉద్యోగుల ఖాతాలను యాక్సెస్ చేసే మరో వీక్ నెస్ ను కనుగొన్నారు. చివరికి ఓ ఉద్యోగి కోడెక్స్ ఖాతా ద్వారా కంపెనీ ప్రైవేట్ గిట్లాబ్ ఎన్విరాన్మెంట్లోకి వారు ఎంటర్ అయ్యారు.

**72 గంటల్లోనే..**

ఫస్ట్ బగ్ ను కనుగొనడం నుండి ఓపెన్‌ఏఐ ప్రైవేట్ రిపాజిటరీని యాక్సెస్ చేయడం వరకు ఈ మొత్తం ప్రయోగం 72 గంటల్లోపు పూర్తయింది. ఈ పరీక్ష కోసం ఏఐ టోకెన్లపై ఈ ముగ్గురు 3 వేల డాలర్ల కంటే తక్కువగానే అంటే భారత కరెన్సీలో సుమారు రూ.2.5 లక్షలు ఖర్చు చేయడం విశేషం. అయితే, భారీ భద్రతా లోపాలను భారత టెక్కీలు వెల్లడించిన వెంటనే ఓపెన్‌ఏఐ వాటిని సరిదిద్దడంతో పాటు, వారి టీమ్ కు 6,500 డాలర్ల అంటే భారత కరెన్సీలో రూ.5.5 లక్షలు) బగ్ బౌంటీని రివార్డ్‌గా బహూకరించింది.

# కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్న నేను బహుజనుల బాణాన్ని

(మొదటి పేజీ తరువాయి)

ఆమె ప్రకటించారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇక,ఈ సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'తనను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు.. కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి వాళ్లు, కొందరు తలకాయ లేనోళ్లు బీజేపీ బాణమని అంటున్నరన్నారు. ఈ కొడంగల్ గడ్డపై నుంచి ఒక్కటే చెబుతున్నా.. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని అని అన్నారు. యువజనుల యుద్ధ నినాదాన్ని, అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా పులే ఆత్మగౌరవ నినాదాన్ని అని కవిత ఉద్ఘాటించారు.

అయితే, ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే ఇక్కడికి వచ్చానని, ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్ఘానిస్తాన్‌తో సమానంగా ఉందన్నారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్ రెడ్డి అప్పుడు ఏం చేశారని నిలదీశారు.

ఇదిలాఉంటే, దేశంలో మహిళలను మహరాణులుగా కీర్తిస్తారని, కానీ, వంటింట్లోని గిన్నెల మీద కూడా మగవాళ్ల పేర్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.



# వారిది గురివింద తీరు

(మొదటి పేజీ తరువాయి)

దేశాలదే బాధ్యతన్నట్లు అభివృద్ధి చెందిన దేశాలు నిందిస్తుండటం సరికాదని అభిప్రాయపడ్డారు. పర్యావరణం, వాతావరణ మార్పులపై రెండ్రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సును శనివారం ఢిల్లీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ప్రపంచంలో తలసరి కర్బన ఉద్గారాల్లో భారత్ వాటా చాలా స్వల్పమనేది చారిత్రక సత్యం. పారిస్ ఒప్పందం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువుకంటే ముందే చేరుకున్న జీ 20 దేశం భారత్ మాత్రమే' అని ప్రధాని వివరించారు.

**మర్రిచెట్టులా నిలుస్తోన్నసుప్రీం కోర్టు..**

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అనేవి కలిసి సామరస్యంగా ఎలా ముందుకు వెళ్లగలవనేదే ఇప్పుడు దేశంలో న్యాయస్థానాల ముందున్న ప్రశ్న అని చెప్పారు. పర్యావరణ న్యాయాన్ని కాపాడేందుకు సుప్రీంకోర్టు మర్రిచెట్టులా నిలుస్తోందన్నారు.

# ప్రారంభోత్సవాల్లో నయా ట్రెండ్

(మొదటి పేజీ తరువాయి)

(ఎల్డీఎఫ్ లో భాగమైన కేరళ కాంగ్రెస్-ఎం నేత) కాంగ్రెస్ అభ్యర్థి ఎం.జె. సెబాస్టియన్ ఓడించారు. ఎరుమేలి-అమకున్ను మధ్య వంతెన నిర్మించేందుకు రూ.80 లక్షల నిధులను నియోజకవర్గ అభివృద్ధి నిధి నుంచి కులథుంకాల్ ఇదివరలో మంజూరు చేశారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లు జరుగుతుండగా సెబాస్టియన్ స్థానిక అధికారుల్ని ఒప్పించి.. మాజీ ఎమ్మెల్యేను శుక్రవారం నాటి కార్యక్రమానికి ఆహ్వానించేలా చూశారు. వంతెన పనికి పూర్తి ఖ్యాతి ఆయనదేనని సభాముఖంగా చెప్పారు. 'నాకు ఇది అవమానమో, అగౌరవమో కాదు. అలాంటి ఆలోచనే నాకు రాదు. నిధులు ఇచ్చినందుకు ఆయన్ని గౌరవించాల్సిందే. రాజకీయమంటే అదే. సమాజాభివృద్ధికే రాజకీయాలు ఉండాలి. అభివృద్ధి పనులపై వాస్తవాలేమిటో ప్రజలకు తెలియాలి' అని సెబాస్టియన్ పేర్కొన్నారు. తర్వాత వంతెనను కులథుంకాల్ లాంఛనంగా ప్రారంభించారు. శిలాఫలకంపై సెబాస్టియన్ పేరు కూడా లిఖించారు.

# దానంకు ఉపఎన్నికలు కలిసిరావు?

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో ఆ నియోజకవర్గంలో ఉపఎన్నిక అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో బీజేపీ నేత, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు దానం నాగేందర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్‌కు ఉపఎన్నికలు కలిసి రావని.. ఖైరతాబాద్‌లో మళ్లీ పోటీ చేస్తే ఓటమి తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు హైదరాబాద్ నాంపల్లి బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ... దానం నాగేందర్ రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. గతంలో కాంగ్రెస్ నుంచి తెలుగుదేశంలోకి, టీడీపీ నుంచి తిరిగి మళ్లీ హస్తంలోకి, తెలంగాణ వచ్చాక.. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి.. ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారారని పేర్కొన్నారు.

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వైపు వెళ్లడం దానం నాగేందర్‌కు రాజకీయ విధానంగా మారిందని విమర్శించారు. గతంలోనూ దానం నాగేందర్ ఉపఎన్నికల్లో ఓడిపోయారని.. ఇప్పుడు ఖైరతాబాద్‌లో మళ్లీ ఎన్నిక జరిగితే అదే పరిస్థితి ఎదురవుతుందని రఘునందన్ రావు అన్నారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి విజయం సాధించారు. అనంతరం 2024 లోక్ సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి.. సికింద్రాబాద్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఇటీవల కీలక తీర్పు ఇచ్చింది.

ఈ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి, దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు.. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. ఆయనపై అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తీర్పులో పేర్కొంది. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్, ఎన్నికల సంఘానికి తీర్పు కాపీలను పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు మార్గం ఏర్పడినప్పటికీ.. ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. మరోవైపు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికపై తదుపరి పరిణామాలు న్యాయపరమైన ప్రక్రియపైనా ఆధారపడి ఉంటాయి.

ఖైరతాబాద్ ఉపఎన్నిక జరిగితే బీజేపీ విజయం సాధిస్తుందని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. దానంకు బైఎలక్షన్లు కలిసి రావన్నారు. ఈ నియోజకవర్గంలో బీజేపీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కూడా రఘునందన్ రావు విమర్శలు గుప్పించారు. రెండు పార్టీలు రాజకీయంగా భిన్నంగా కనిపించినా.. కొన్ని అంశాల్లో ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగకుండా ఇరు పార్టీలు రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలపై కూడా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజాం పాలనకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ.. అసెంబ్లీలో గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యలను రఘునందన్ రావు మీడియా ముందు ప్రదర్శించారు. ఎంఐఎంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపైనా ఆయన విమర్శలు చేశారు.

# ఇదే అసలైన 'కేరళం స్ఫూర్తి కథ'

**ఎరుమేలి, సెప్టెంబర్ 20:** మాజీ ఎమ్మెల్యేతో ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరిపించిన పూజార్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం.జే. సెబాస్టియన్ను కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అభినందించారు. దీనిని 'అసలైన కేరళం స్ఫూర్తి'గా అభివర్ణించిన ఆయన.. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పేందుకు ఈ సంఘటనే ఉదాహరణ అని చెప్పారు. 'స్థానిక ఎమ్మెల్యేగా వంతెనను తానే ప్రారంభించేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. సెబాస్టియన్ స్వచ్ఛందంగా తప్పుకొని.. ప్రాజెక్టు కార్యరూపం దాల్చడానికి కారణమైన మాజీ ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేసేలా అధికారులను ఒప్పించారు. రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కంటే.. అభివృద్ధికే ప్రాధాన్యత ఉందని చెప్పేందుకు ఇదే ఉదాహరణ. ఇదే నిజమైన కేరళం కథ' అని సతీశన్ పేర్కొన్నారు. సెబాస్టియన్కు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ... 'అహం కన్నా అభివృద్ధి ముఖ్యం, రాజకీయాల కన్నా ప్రజలే ముఖ్యం. మేం రాజకీయాల్లో కొత్త ఒరవడి తీసుకొస్తున్నాం. కేరళంలో కొత్త శకం ప్రారంభమైంది' అని ఎక్స్ లో పోస్టు చేశారు.

పూజార్ నియోజకవర్గం నుంచి ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన సెబాస్టియన్ కులథుంకాల్ను కాంగ్రెస్ అభ్యర్థి ఎంజే సెబాస్టియన్ ఓడించారు. అయితే, ఓ వంతెన నిర్మాణానికి రూ.80 లక్షల నిధులను నియోజకవర్గ అభివృద్ధి నిధి నుంచి కులథుంకాల్ ఇది వరకే మంజూరు చేశారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లు జరుగుతుండగా సెబాస్టియన్ స్థానిక అధికారుల్ని ఒప్పించి.. మాజీ ఎమ్మెల్యేను శుక్రవారం నాటి కార్యక్రమానికి ఆహ్వానించేలా చూశారు. వంతెన పనికి పూర్తి ఖ్యాతి ఆయనదేనని సభాముఖంగా చెప్పారు.

# రాష్ట్రంలో ఫామ్‌హౌస్ ఫైల్స్ కథలు నడుస్తున్నయ్

(మొదటి పేజీ తరువాయి)



ఆగర్భ శ్రీమంతులం, ఒకరోజు మా నాయనకు హైదరాబాద్‌లో ఉండటానికి ఇల్లు లేదంటారని ఎద్దేవా చేశారు. డ్రగ్స్ అరికట్టడానికి రేవంత్ రెడ్డి ఈగిల్ టీం పెడితే రోహిత్ రెడ్డి తన ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ చేసుకుంటూ పోలీసులకు దొరికారని గుర్తు చేశారు. కేటీఆర్ సత్యం రామలింగరాజు కంపెనీ భూముల్లో ఫామ్ హౌస్ కట్టుకుని నాకు ఇల్లు లేదు,, నార్సింగిలో ఉంటున్నారని అబద్దాలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఫామ్ హౌస్ దందాలు తెలంగాణ ప్రజలకు తెలవాలనే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చామని ఈ సందర్భంగా ఎంపీ చామల తెలిపారు.

# ఆందోళన చెందొద్దు

- **దళితుల భూములను ప్రభుత్వం తీసుకోదు**
- **వాటికి సర్కారే సంపూర్ణ రక్షణగా నిలుస్తుంది**
- **స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 20 ( మనం బ్యూరో):** దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానం కాదనీ, వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దళితుల భూములకు ప్రభుత్వం సంపూర్ణ రక్షణగా నిలుస్తుందనీ, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటనలో సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి, కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎప్పుడూ ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయని స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రిగా, సీఎం రేవంత్ రెడ్డి పక్షాన మాట ఇస్తున్నా మీ అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు, మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దళితుల భూముల విషయంలో కొంతమంది కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారనీ, తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎవరో ఏదో చెప్పారని భయపడాల్సిన అవసరం లేదు. మీ భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇస్తుంది. వాస్తవాలను తెలుసుకోకుండా ఎలాంటి విష ప్రచారాన్ని నమ్మొద్దని స్పష్టం చేశారు. దళితులకు భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే దళిత, గిరిజనులకు వారి భూములపై హక్కులను కల్పించి మరింత పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# స్వీయ వికాస ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

పని చేయడం లేదు. స్వయంప్రతిపత్తితో కూడిన రికర్సివ్ సెల్ఫ్-ఇంప్రూవ్‌మెంట్ (ఆర్ఎస్ఐ) అంటే, ఏఐ మోడల్ తన తదుపరి వెర్షన్‌ను, ఆ తర్వాత అంతకన్నా మెరుగైన వెర్షన్‌ను... అలా ఒకదాని తర్వాత ఒకటి డిజైన్ చేసుకుంటూ తనను తాను మెరుగుపరుచుకోవడమే. 'ఏఐ స్వీయ మెరుగుదల కార్యక్రమాన్ని ఎంత ఎక్కువగా చేస్తే ఆ పనిలో వేగం అంత ఎక్కువగా పెరిగిపోతుంది' అని 'ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్' అధ్యక్షుడు ఆంథోనీ అగ్యుర్రే తెలిపారు. ''ఏఐ కంపెనీలు సృజనాత్మకంగా పెద్ద ముందంజ వేయడానికి చాలా దగ్గరగా ఉన్నాయి. ఆంత్రోపిక్ పరిశోధనలో ఎక్కువ భాగం ఏఐ ద్వారానే జరుగుతోంది. పూర్తి స్వయంప్రతిపత్తికి చాలా దగ్గరలో ఏఐ ఉంది'' అని వివరించారు. ఆర్ఎస్ఐ ప్రక్రియ వల్ల చివరకు మానవుడి అదుపు తప్పిపోయే సూపర్ ఇంటెలిజెన్స్ ఉద్భవిస్తుందనే భయాలు పెరుగుతున్నాయని కార్నెల్ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ సహాయ ఆచార్యుడు జాన్ థిక్‌స్టన్ చెప్పారు.

**2027లోనే రావచ్చేమో..**

ఓ స్వయంచాలిత పరిశోధన సహాయకుడిని అభివృద్ధి చేసినట్లు చాట్ జీపీటీ తయారీదారు ఓపెన్ ఏఐ ఈ నెలలో ప్రకటించింది. మార్చి 2028 నాటికి స్వయంచాలిత ఏఐ పరిశోధకుడిని సృష్టించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపింది.

స్వయంచాలిత ఏఐ మోడల్ ఈ ఏడాది చివరికే సిద్ధం కావచ్చనీ, 2027 వరకు కూడా ఆగనక్కర్లేదని ఎలాన్ మస్క్ అంటున్నారు. ప్రజాహితం కోసం మానవీయ సూపర్ ఇంటెలిజెన్స్‌ను సృష్టించడమే తమ లక్ష్యమని మైక్రోసాఫ్ట్ ఏఐ విభాగాధిపతి ముస్తఫా సులేమాన్ చెప్పారు. ఈ నేపథ్యంలో ఏఐ మోడల్స్ సామర్థ్యాల మాదిరిగానే వాటిపై భద్రతా చర్యలనూ అభివృద్ధి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిపై ఏఐ కంపెనీలలో భిన్నాభిప్రాయాలున్నాయి. స్వయంసిద్ధ ఏఐ అభివృద్ధిపై నెమ్మదిగా సాగడానికి ఆంథ్రోపిక్ సుముఖంగా ఉంటే, అలా నెమ్మదించడం ఎలాగో తనకు తెలియదని ఓపెన్ ఏఐ అంటోంది.

# బ్యాంకులు 5 రోజులు బంద్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెలలో మరో విడత నిరసన చర్యల్లో భాగంగా ఈ ప్రకటన వెలువడింది. అలాగే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెను ప్రారంభించనున్నట్లుగా కూడా యూనియన్ ఫోరమ్ ప్రకటించింది.

**5 రోజుల పాటు సేవలకు అంతరాయం?**

ప్రతిపాదిత దేశవ్యాప్త బ్యాంకు సమ్మె సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో షెడ్యూల్ చేయబడింది. అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు వరుసగా శనివారం, ఆదివారం కావడంతో.. కస్టమర్లు దాదాపు 5 రోజుల పాటు రెగ్యులర్ బ్రాంచ్ కార్యకలాపాలకు దూరం అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంక్ శాఖలను సందర్శించడం, సిబ్బంది సాయం కోరడం, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇతర ప్రత్యక్ష సేవలు అవసరమయ్యే పనులను సమ్మె ప్రారంభానికి ముందే పూర్తి చేసుకోవాలని ఖిఆఐ స్పష్టం చేసింది.

**ప్రత్యామ్నాయ సేవలు అందుబాటులో..**

సమ్మె సమయంలోనూ నిత్యావసర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లుగా ఎస్‌బీఐ వెల్లడించింది. కస్టమర్లు నగదు విత్ డ్రా, ఇతర అర్హత గల సేవల కోసం ఏటీఎంలు, ఆటోమేటెడ్ డిపాజిట్, విత్డ్రాయల్ మెషీన్లు ఉపయోగించుకోవచ్చు. అదేవిధంగా కస్టమర్లు బ్రాంచికి వెళ్లకుండానే ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ (యూపీఐ) సేవలను ఉపయోగించి నగదు బదిలీ, ఇతర రోజువారీ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశాలు కల్పించినట్టు ఎస్‌బీఐ ఆ అడ్వైజరీలో వివరించింది.

# జై శంకర్‌కు నోటీసు

(మొదటి పేజీ తరువాయి)



భార్య క్యోకో జైశంకర్కు ఈసీ నోటీసులు జారీ చేసింది. 'అన్ మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద ఈ నోటీసులు జారీ అయ్యాయి. వారి ప్రస్తుత వివరాలను ఎస్ఐఆర్-2002 వివరాలతో మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడించింది. జైశంకర్, ఆయన భార్యకు న్యూఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని సుందర్ బాగ్ లో ఓటు హక్కుంది.మరోవైపు సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్ కు కూడా 'సర్' నోటీసులు అందాయి. గత రికార్డులతో షెబా పేరు సరిపోలకపోవడంతో ఆమెకు, ఆనంద్ కు నోటీసులు జారీ అయ్యాయి. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా 'అన్ మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది.

**అద్వానీ కుటుంబానికి నోటీసులు..**

బీజేపీ దిగ్గజం, మాజీ ఉప ప్రధాని ఎల్కే అద్వానీ, ఆయన కుమార్తె ప్రతిభా అద్వానీ, కోడలు గీతికల పేర్లు 2002 నాటి ప్రత్యేక తీవ్ర సవరణ ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాలేదు. దీంతో వారి కుటుంబానికి ఎన్నికల సంఘం ఇవాళ నోటీసులు జారీ చేసింది. అయితే, అద్వానీ కుమారుడు జయంత్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. వీరందరూ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లుగా ఉన్నారు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆయన సతీమణి సీమ, కుమారుడు మీర్ పేర్ల వివరాల్లోనూ వ్యత్యాసాలు ఉన్నట్లుగా గుర్తించిన అధికారులు వారికి కూడా నోటీసులు ఇచ్చారు.

**33 లక్షలకు పైగా ఓటర్లకు నోటీసులు..**

జూన్ 30 నుంచి ఆగస్టు 17 వరకు జరిగిన ఇంటింటి సర్వే సమయంలో ఓటర్లు సమర్పించిన ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించగా ఈ లోపాలు వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితాలోని దాదాపు 97 లక్షల మందిలో 33.13 లక్షల మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లుగా గుర్తించి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటివరకు దాదాపు 31.63 లక్షల మందికి నోటీసులు అందినట్లుగా అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ 30తో ఎస్ఐఆర్ గడువు ముగియనున్న నేపథ్యంలో నోటీసులు అందుకున్న ఓటర్లు తమ అభ్యంతరాలు, తగిన ఆధారాలతో కూడిన పత్రాలను అక్టోబర్ 29 నాటికి తమ సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు సమర్పించాలని సూచించారు.

# మూడు రోజుల పాటు కుండపోత వానలు!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఇక, పలు జిల్లాల్లో సైతం ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది.

**పలు జిల్లాల్లో భారీ వర్షాలు..**

తెలంగాణలో వర్షాలు మళ్లీ జోరందుకున్నాయి. గత అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలైన మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, నారాయణపేటలో కుండపోత వానలు పడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగులో ప్రారంభమైన వానలు.. జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకూ విస్తరించాయి.



పూర్తి వివరాల్లోకి వెళితే, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఉదయం ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఇది సోమవారం (సెప్టెంబర్ 21) నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఇదిలా ఉండగా, దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24 గంటల్లో నాగర్కర్నూల్ జిల్లా కొల్లాపూర్లో అత్యధికంగా 13.9 సెం.మీ., ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# నవశకానికి నాంది పలికిన గాంధీ వైద్యులు



## మృత్యువును జయించిన మాతృత్వం

## 45 ఏళ్ల నిండు గర్భిణిని కాపాడిన క్రిటికల్ కేర్ బృందం

## వైద్య లోకాన్ని విస్మయపరిచిన గాంధీ వైద్యుల ప్రతిభ

**హైదరాబాద్,సెప్టెంబర్ 20(మనం న్యూస్):** వైద్య రంగంలో అసాధ్యమనే పదానికి తావులేదని గాంధీ ఆసుపత్రి వైద్యులు మరోసారి నిరూపించారు. కేవలం సాంప్రదాయ వైద్యానికి పరిమితం కాకుండా,అత్యాధునిక క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్‌తో మృత్యువు అంచుల వరకు వెళ్లిన ఒక నిండు గర్భిణికి పునర్జన్మ ప్రసాదించారు. ఎవరికైనా కంటతడి పెట్టించే ఆ ఉత్కంఠభరిత ప్రయాణం, గాంధీ వైద్య బృందం ప్రదర్శించిన అసాధారణ సమర్థత రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. గత నెల ఇరవై ఏడవ తేదీన ఒక డయాగ్నస్టిక్ సెంటర్‌లో అకస్మాత్తుగా కుప్పకూలిన నలభై ఐదు ఏళ్ల గర్భిణిని అత్యంత విషమ స్థితిలో, ఇంట్యూబేట్ చేసిన రూపంలో గాంధీ హాస్పిటల్ మెడికల్ ఐసీయూకి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె శరీరంలో గెస్టేషనల్ డయాబెటిస్, హైపర్‌టెన్షన్, హైపోథైరాయిడిజం వంటి దీర్ఘకాలిక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. దానికి తోడు వైద్య పరీక్షల్లో ప్రాణాంతకమైన పెరిపార్టమ్ కార్డియోమయోపతి,తీవ్రమైన మెటబాలిక్ ఆసిడోసిస్ నిర్ధారణ అయ్యాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని ఆ క్లిష్ట పరిస్థితుల్లోనూ గాంధీ వైద్యులు ఏమాత్రం తడబడలేదు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా అత్యవసర సిజేరియన్ నిర్వహించి ఆ పసిబిడ్డను సురక్షితంగా కాపాడారు.

**అసలైన పోరాటం:**

అసలైన పోరాటం ఆపరేషన్ అనంతరమే మొదలైంది. తీవ్రమైన గుండె బలహీనతతో ఆ తల్లి ప్రాణాలు సంక్షోభంలో పడగా, రక్తపోటు నిలకడగా ఉంచేందుకు నొరాడ్రినలిన్, డోబుటమైన్ మద్దతు అందించాల్సి వచ్చింది తొలిరోజు ఎకో పరీక్షలో గుండె ఎజెక్షన్ ఫ్రాక్షన్ కేవలం ముప్పై నాలుగు శాతం మాత్రమే ఉండటంతో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. కానీ, గాంధీ ఆసుపత్రి క్రిటికల్ కేర్, కార్డియాలజీ నిపుణులు పట్టువదలకుండా అందించిన అత్యాధునిక వైద్యం అద్భుత ఫలితాలనిచ్చింది. ఆపరేషన్ జరిగిన ఆరవ నాటికి ఆమె వైటల్స్ పూర్తిగా స్థిరపడ్డాయి. ఆగస్టు ముప్పైవ తేదీ నాటి రీపీట్ ఎకో పరీక్ష వైద్య లోకాన్నే ఆశ్చర్యపరిచింది. కేవలం కొన్ని రోజుల్లోనే గుండె పనితీరు ఏకంగా యాభై మూడు శాతానికి దూసుకెళ్లింది. కిడ్నీల పనితీరు కూడా పూర్తిగా పుంజుకోవడంతో క్రియాటినిన్ స్థాయి గణనీయంగా పడిపోయింది.ఈ క్రమంలో మెకానికల్ వెంటిలేషన్ నుంచి క్రమంగా ఇంటర్మిటెంట్ సిపాప్ మీదుగా పూర్తిగా సాధారణ గాలికి ఆమెను మార్చడంలో వైద్యుల వ్యూహం వంద శాతం ఫలించింది.

**కచ్చితమైన ప్రణాళికతో:**

డోబుటమైన్ ఇన్ఫ్యూషన్, ఐవీ లాసిక్లోస్ ఫ్లూయిడ్ ఓవర్‌లోడును అదుపు చేస్తూనే, హార్ట్ ఫెయిల్యూర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్పైరోలాక్టోల్యాక్టోన్, మెట్‌ఎక్స్ఎల్, డపాగ్లిఫ్లోజిన్ వంటి అత్యాధునిక మందులు వాడారు. ఇన్ఫెక్షన్లను మెరోపెనెమ్, మెట్రోజిల్‌తో కట్టడి చేస్తూ, హార్మోన్లు, షుగర్‌ను కచ్చితమైన ప్రణాళికతో నియంత్రించారు. ఒక వారం రోజుల పాటు సాగిన ఈ ఉత్కంఠభరిత పోరాటంలో గాంధీ వైద్యుల గెలుపు స్పష్టమైంది. వెంటిలేషన్ నుంచి పూర్తిగా బయటపడిన ఆ తల్లి,ఇప్పుడు స్వయంగా శ్వాస తీసుకుంటూ, సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోగలిగే అద్భుతమైన స్థితికి చేరుకున్నారు.ఈనెల మూడవ తేదీన ఆమెను ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు మార్చడం గాంధీ ఆసుపత్రి వైద్య చరిత్రలో మరో మైలురాయిగా నిలిచింది. మృత్యువును ఓడించి, ఒక పసిబిడ్డకు అమ్మను బహూకరించిన ఈ చారిత్రాత్మక విజయానికి కారణమైన నూతన సుపరిండెంట్ ఉషారాణి, గైనకాలజీ, క్రిటికల్ కేర్ మెడిసిన్, కార్డియాలజీ, అనెస్తీషియా విభాగాల సమన్వయం, గాంధీ వైద్యుల అసాధారణ ప్రతిభ నేడు ప్రతి ఒక్కరితో నీరాజనాలు అందుకుంటున్నాయి.

# ప్రజా సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం



## గణపతి హోమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, సెప్టెంబర్20(మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ప్రజా సంకల్పంతో ముందుకెళ్తుందని రాష్ట్రఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల.శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం మంథని మున్సిపల్ రావుల చెరువుకట్టలోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద గణపతి హోమంలో రాష్ట్ర ఐటీ,పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని నియోజకవర్గ ప్రజలందరీకి,పెద్దపల్లి,భూపాలపల్లి జిల్లా ప్రజలందరికీ, రాష్ట్ర ప్రజలందరీ ఈ సందర్భంగా ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని,వారు కోరిన కోరికలు విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని,వారు అనుకున్న పనులన్నీ సజావుగా జరిగేలా ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని,అందరూ బాగుండాలి,..అందులో మేముండాలి అని కోరుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన పేర్కొన్నారు.ప్రజా సంకల్పంతో ముందుకెళ్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వంఅనేక సంక్షేమ పథకాలను తీసుకెళ్తూ ముందుకు నడిపిస్తున్నామన్నారు. ఈరోజు సంక్షేమంతో పాటు అభివృద్ధిని ఈ ప్రయత్న భాగంలోనే ఈ మధ్య ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సింగరేణి ప్రాంతంలో ఉన్నటువంటి చాలా సంవత్సరాలుగా సింగరేణి ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న వారందరికీ పట్టాలను ఆ రోజు కాంగ్రెస్ పార్టీ హయాంలో, రాజశేఖర్ రెడ్డి చాలామందికి రేగులరైజేషన్ చేయడం జరిగిందన్నారు.ఈ ప్రాంతానికి సంబంధించి ప్రత్యేకంగా గోదావరిఖని,మంచిర్యాల్, మందమర్రి,అదేవిధంగా కొత్తగూడెం, ఇల్లందు,ఇంకా మిగిలిపోయిన సింగరేణి స్థలాల సంబంధించి ఒక కమిటీ ఏర్పాటు చేసుకొని వెనివెంటనే వారికి పట్టాలు చేయాలని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆదేశించాలన్నారు. వారికి ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సింగరేణి కార్మికులకు ఈరోజు గ్రామీణ ప్రాంతంలో ఉన్నటువంటి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి కార్యక్రమం ఎక్కడ కూడా విఘ్నం కలగకుండా పేదవాడి ఇల్లు పూర్తి స్థాయిలో పూర్తి చేసుకునే విధంగా సొంత ఇంటి కల నెరవేర్చుకునే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అదే విధంగా పేదవారికి సంక్షేమం అనే సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందన్నారు.ఆ గణేశుని ఆశీస్సులు కోరుతూ లోకకల్యాణం గురించి రాష్ట్ర కల్యాణం గురించి ఈ ప్రాంత ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అయన కోరారు.ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహిందర్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుఐలి. ప్రసాద్,సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఆరెల్లి కిరణ్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు,మండల నాయకులు, భక్తులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎల్‌నినో కంటే రేవంత్ ప్రమాదకరం



## అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నరు?

## 24 గంటల కరెంట్ డుమ్మా.. 6-7 గంటలకే పరిమితమైంది?

## మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ

## మీ పిట్ట బెదిరింపులకు భయప(డం)డేదే లేదు?

## 'కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు?

## పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి?

## ప్రభుత్వానికి హరీశ్ రావు హెచ్చరిక

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్‌రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు చేందిన పలువురు కాంగ్రెస్ నాయకులు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడుతూ... రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు.

'అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు? అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు. 'కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని హరీశ్ రావు హితవు పలికారు.

# హైదరాబాద్‌లో లిఫ్ట్ ప్రమాదం



## మూసాపేట లిఫ్ట్ ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన హైడ్రా

## లిఫ్టుకు, గోడకు మధ్య వేలాడుతూ నరకయాతన

## క్షతగాత్రుడి కాలికి ఫ్రాక్చర్.. ఆసుపత్రికి తరలింపు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం ఓ భవనంలో ప్రమాదం జరిగింది. మూసాపేట జరిగిన ఈ ప్రమాదంలో లిఫ్టుకు, గోడకు మధ్య ఇరుక్కుని ప్రాణాపాయ స్థితిలో వేలాడుతున్న ఓ వ్యక్తిని హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందం గంటన్నర పాటు శ్రమించి సురక్షితంగా కాపాడింది. అయితే, ఈ ఘటన మూసాపేట ఆంజనేయ నగర్‌లో ఓ మూడంతస్తుల భవనంలో చోటుచేసుకుంది.

ప్రత్యక్షసాక్షులు, పోలీసులు, బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. పూర్తీ వివరాల్లోకి వెళితే, బాధితుడు మురళి (40), తన భార్యతో కలిసి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తుకు లిఫ్ట్‌లో వెళ్లారు. రెండో అంతస్తు రాగానే ఆయన బయటకు అడుగుపెట్టే ప్రయత్నం చేశారు. అదే సమయంలో మూడో అంతస్తులో ఉన్న ఎవరో లిఫ్ట్ బటన్ నొక్కడంతో అది ఒక్కసారిగా పైకి కదిలింది. దీంతో మురళి ఒక కాలు రెండో అంతస్తులో, మరో కాలు లిఫ్ట్‌లో ఉండగానే ప్రమాదం జరిగింది. ఆయన శరీరం లిఫ్టుకు, గోడకు మధ్య ఇరుక్కుపోగా, కాలు గ్రిల్స్‌లో చిక్కుకుని వేలాడసాగారు. లిఫ్ట్‌లోనే ఉన్న ఆయన భార్య కేకలు వేయడంతో అపార్ట్ మెంట్ వాసులు వచ్చి కాపాడేందుకు విఫలయత్నం చేశారు. అనంతరం ఉదయం 9:15 గంటలకు హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. వెంటనే కూకట్‌పల్లిలోని డీఆర్‌ఎఫ్ బృందం మార్షల్ జేడీవీ ప్రసాద్ నేతృత్వంలో 9:30 గంటలకే ఘటనా స్థలానికి చేరుకుంది. పరిస్థితి తీవ్రతను గమనించి సనత్‌నగర్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు తెచ్చిన హైడ్రాలిక్ కట్టర్ సాయంతో, లిఫ్ట్ పక్కన ఉన్న గోడను బద్దలుకొట్టి సుమారు గంటన్నర పాటు శ్రమించి మురళిని బయటకు తీశారు. ఉదయం 9:15 గంటలకు ప్రమాదం జరుగగా... 10:50 గంటలకు ఈ ఆపరేషన్ పూర్తయింది. భవనంలోని పాత గ్రిల్స్ లిఫ్ట్ సెన్సార్లు సరిగా పనిచేయక పోవడమే ఈ దుర్ఘటనకు కారణంగా తెలుస్తోంది. ఈ ప్రమాదంలో మురళి కాలు లిఫ్టుకు, గోడకు మధ్య నలిగిపోవడంతో ఫ్రాక్చర్ అయిం ది. సిబ్బంది అతడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన హైడ్రా డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

# 25న మహాగణపతి నిమజ్జనం

## ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలు

## శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. అయితే, ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు 'శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి'గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.

అయితే, ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

# గ్రాడ్యుయేట్లకు లక్షన్నర జీతంతో ఉద్యోగాలు

## నోటిఫికేషన్ జారీ చేసిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ

**ఢిల్లీ, సెప్టెంబర్ 20 :** డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ (యుఐఐసీ) మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలను ప్రకటించింది. సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 225 ఖాళీలను ఈ నియామకం ద్వారా భర్తీ చేయనున్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 28, 2026 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.1.56 లక్షల వరకు వేతనం అందుతుంది. వివరాలిలా ఉన్నాయి...

**పోస్టులు**

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ - జనరలిస్ట్: 200 పోస్టులు
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ - హిందీ ఆఫీసర్: 25 పోస్టులు

**అర్హతలు..**

జనరలిస్ట్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా పోస్ట్గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్, కామర్స్, అగ్రికల్చర్, డేటా సైన్స్ తదితర విభాగాల అభ్యర్థులు అర్హులు. జనరల్ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది.

హిందీ ఆఫీసర్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో హిందీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. డిగ్రీలో ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా ఉండాలి. మరోవైపు, ఇంగ్లిష్ మీడియంలో మాస్టర్స్ డిగ్రీ చేసి, హిందీని తప్పనిసరి సబ్జెక్టుగా చదివిన వారు కూడా అర్హులు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 55 శాతం మార్కులు అవసరం.

**82,485 నుంచి వేతన స్కేలు..**

ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.82,485 నుంచి రూ.1,56,745 వరకు వేతనం లభిస్తుంది. బేసిక్ పేతో పాటు ఎన్పీఎస్, గ్రాట్యుటీ, ఎల్టీఎస్, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, వైద్య సదుపాయాలు వంటి ప్రయోజనాలు ఉంటాయి.

**వయోపరిమితి**

2026 జూన్ 30 నాటికి అభ్యర్థుల వయసు 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే 1996 జూన్ 30 నుంచి 2005 జూన్ 30 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఓబీసీ అభ్యర్థులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయోసడలింపు ఉంటుంది. అభ్యర్థుల ఎంపిక ఆన్లైన్ పరీక్షలు, డిస్క్రిప్టివ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుంది. మొదట ప్రిలిమ్స్ నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించిన వారిని మెయిన్స్కు ఎంపిక చేస్తారు. మెయిన్స్లో అర్హత సాధించిన అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఒక సంవత్సరం పాటు ప్రొబేషన్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

**దరఖాస్తు ఫీజు.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు: రూ.250**

**ఇతర అభ్యర్థులు: రూ.1,000**

**ఎట్ల అప్లై చేయాలె?**

యూఐఐసీ అధికారిక వెబ్సైట్లోకి వెళ్లి సంబంధిత రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ను ఓపెన్ చేయాలి. అందులో ఇచ్చిన సూచనల ప్రకారం ముందుగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి. అనంతరం అవసరమైన వివరాలు నమోదు చేసి, సంబంధిత పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి. చివరగా నిర్ణయించిన ఫీజును ఆన్లైన్లో చెల్లించాలి. ఆన్లైన్‌లో సెప్టెంబర్ 28 వరకు అప్లై చేసుకోవాలి.

# ఆమెను రమ్మన్నదేవరు? మీకు వాళ్లకు తేడానే లేదు?



- ట్రాన్స్‌జెండర్లకు, కాంగ్రెసొళ్లకు తేడా లేదన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- మహిళను రమ్మన్న వ్యక్తి ఎవరు?..?
- ఆ గెస్ట్ హౌస్ ఎక్కడ ఉందో కనిపెట్టాలి? : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 ఎంపీ సీట్లు ఇస్తే?.. ప్రజల పక్షాన ఉండాల్సిన కాంగ్రెస్ ఎంపీలు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులపై దాడులు చేస్తున్నారని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హరీష్ రావు ప్రైవేటు ప్రాపర్టీపై దాడి చేయడానికి వెళ్లారన్నారు. కాంగ్రెసొళ్లు చెప్పి మరీ వెళ్తుంటే డీజీపీ ఏం చేస్తున్నారు? అని ఆయన ప్రశ్నించారు. ఎంపీలు చేయాల్సిన పని ఇదేనా? అని నిలదీశారు. ఈ మేరకు ఆదివారంనాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. అరికెపూడి గాంధీ అనే ఎమ్మెల్యే పోలీసుల సహాయంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని చంపడానికి వెళ్లారన్నారు. పోలీసు బందోబస్తుతో హరీశ్ రావు పొలాలకు కాంగ్రెస్ వాళ్లను పంపించారని, ఇదే సీఎం రేవంత్ ప్రైవేటు ఆస్తుల వద్దకు వెళ్తే ఊరుకుంటారా..? ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలు మిమ్మల్ని అధికార పీఠం మీద కూర్చోబెట్టింది ఇందుకేనా..? అని నిలదీశారు. తెలంగాణలో భూ దందా నడుస్తోందని, తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి భారీ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆయన దుయ్యబట్టారు.

నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పార్లమెంట్ నియోజకవర్గం గద్వాలలో కులాంతర వివాహం చేసుకున్నందుకు దళిత కుటుంబంపై దాడి జరిగిందన్నారు. ట్రాన్స్ జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి తేడా లేదన్నారు. ట్రాన్స్‌జెండర్లు కనీసం పోలీసులు చెప్పింది పాటిస్తున్నారు?.. ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందని, ఒక్కో ఎంపీకి 8 లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, ప్రతి సంవత్సరం రూ.5 కోట్లు ఎంపీ ల్యాడ్స్ కింద నిధులు ఇస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో మల్లు రవి,చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణలో శాంతి భద్రతలు దారుణంగా దెబ్బతిన్నాయని ఈ సందర్భంగా ప్రవీణ్ పేర్కొన్నారు.

**మహిళను రమ్మన్న వ్యక్తి ఎవరు?.కనిపెట్టండి?: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

అడ్వర్టైజింగ్ రంగంలో కాంట్రాక్ట్ కోసం తాను న్యాయబద్ధంగా అవకాశం ఇవ్వమని అడిగితే, సీఎంకు సన్నిహితుడైన ఒక వ్యక్తి గెస్ట్ హౌస్‌కు రావాలని పిలిచాడంటూ కె.శోభ రెడ్డి అనే మహిళా వ్యాపారవేత్త ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాను ఎవరి పేర్లు చెప్పలేను? కానీ, ఇలాంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను అంటూ ట్వీట్‌లో పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్రాన్ని ఎల్ కాంగో పట్టి పీడిస్తోంది. ఎల్ కాంగో 2023లో వచ్చిందని ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ తెచ్చిన యోధుల ఇంటి ముందు కాంగ్రెస్ ఎంపీలు డ్రామాలు చేస్తున్నారు. ఒక మహిళా వ్యాపారవేత్త యాడ్స్ పని నిమిత్తం సీఎంను కలవాలని సీఎం సన్నిహితుడి వద్దకు వెళ్తే గెస్ట్ హౌస్‌కు రమ్మన్నారు? అని ఆరోపించారు. అయితే, ఈ విషయాన్ని ఆ మహిళనే స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిందన్నారు. తెలంగాణ ఇప్పటికే ఫోక్సో కేసులకు అడ్డాగా మారింది. మహిళను రమ్మన్న వ్యక్తి ఎవరో గెస్ట్ హౌస్ ఎక్కడ ఉందో? చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి కనిపెట్టాలన్నారు. ఎవరు ఆ ముఖ్యమంత్రి సన్నిహితుడో కనిపెట్టాలని?.. ఆ మహిళతో మాట్లాడి ఆమె కన్నీళ్లు తుడవాలన్నారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద మృతి



## ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నా మౌనిక, రమాకాంత్

## ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో గమనించిన పనిమనిషి

## మేడ్చల్ జిల్లా పోచారం గెలాక్సీ టవర్స్‌లో ఘటన

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** మేడ్చల్ జిల్లా పోచారం గెలాక్సీ టవర్స్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మౌనిక సంతోషి (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లో ఆమె ఉరివేసుకుని ఉన్నట్లు గుర్తించిన పనిమనిషి పోలీసులకు సమాచారం అందించింది. మౌనిక యాక్సిస్ బ్యాంక్ ఐటీ విభాగంలో పనిచేస్తుండగా.. ఆమె భర్త రమాకాంత్ ఇన్ఫోసిస్‌లో హెచ్ఆర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. మౌనిక, రమాకాంత్ ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారని.. వీరికి రెండున్నరేళ్ల వయసున్న కవల మగపిల్లలు ఉన్నారని బంధువులు తెలిపారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని పనిమనిషి గమనించడంతో ఘటన వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

మౌనిక మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భర్త వేధింపుల కారణంగానే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే మృతికి అసలు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి వివరాలు సేకరిస్తూ ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాత మౌనిక మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# నవయుగ వైతాళికుడు గురజాడ



నవీన యుగపు వైతాళికుడు, మహాకవి, తెలుగు జాతికి భాష, సాహిత్య రంగంలో అత్యాధునిక, అభ్యుదయ మార్గాన్ని చూపించిన మహా మనీషి గురజాడ అప్పారావు. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్...అన్న అద్భుత గీతం దేశభక్తిని పెంచినా, 'కన్యాశుల్కం'నాటకం ద్వారా సమాజంలో చిన్నతనపు చేష్టలను ప్రజల ముందుంచినా అది గురజాడకే చెల్లింది. ఆయన అత్యంత ఆధునికునిగా, రచనలు అన్నింటిలో పాత బూజును దులిపి, కొత్తదనం అందించే యత్నమే జరిగింది. గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీ కారులలో ఒకరు, హేతువాది. 19 వ శతాబ్దంలోను, 20 వ శతాబ్ది మొదటి దశకం లోనూ ప్రజలందరికీ అర్థమయ్యే జీవ భాషలో చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందు తున్నాయి. తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు. గురజాడ అప్పారావు విశాఖ జిల్లా, రాయ వరం (ఎలమంచిలి)లో 1862 సెప్టెంబరు 21న జన్మించారు. గురజాడ అప్పారావు కుటుం బం వారి తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ గ్రామం నుండి విశాఖ మండలానికి వలస వచ్చింది. అప్పా రావు తండ్రి విజయ నగరం సంస్థానంలో పనిచేసారు. తన పదవ ఏట వరకు అప్పారావు చీపురుపల్లిలో చదువు కున్నారు.

తండ్రి మరణించడంతో, విజయ నగరానికి వెళ్ళారు. ఇక్కడ చాల పేదరికంలో వారాలు చేసుకుంటూ చదువు కొనసాగించారు. ఈ సమయంలో అప్పటి ఎమ్.ఆర్.కాలేజి ప్రిన్సిపాల్ చంద్రశేఖర శాస్త్రి చేరదీసి ఉండడానికి చోటిచ్చారు. 1882లో మెట్రిక్యులేషను పూర్తిచేసి, తర్వాత 1884లో ఎఫ్. ఎ చేసారు. ఇదే సంవత్సరంలో ఏం.ఆర్.హైస్కూలులో టీచరుగా చేరారు. విజయ నగరంలో బి.ఏ చదువు తున్నపుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి ఆయ నకు సహాధ్యాయి. విజయనగర సంస్థాన పూస పాటి గజపతి రాజులతో మంచి సంబంధాలు ఉండేవి. 1887లో విజయనగరం కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అతను మొదట ప్రసంగించారు.

ఇదే సమయంలో సాంఘిక సేవకై విశాఖ వాలంటరీ సర్వీసులో చేరారు.

1889లో ఆనంద గజపతి డిబేటింగ్ క్లబ్బుకు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో తమ్ముడు శ్యామలరావుతో కలిసి ఆంగ్లంలో పద్యాలు రాసారు. వీరు రాసిన ఆంగ్ల పద్యం సారంగధర, ఇండియన్ లీషర్ అవర్లో చదివినప్పుడు అందరూ మెచ్చుకున్నారు. అప్పుడే కలకత్తాలో ఉన్న రీస్ అండ్ రోయిట్ ప్రచురణకర్త శ్రీ శంభుచంద్ర ముఖర్జీ విని, అప్పారావును తెలుగులో రచన చేయడానికి ప్రోత్సహించారు. ఆంగ్లంలో యెంత గొప్పగా రాసినా అది పర భాషే నని, తన మాతృభాషలో ఇంకా గొప్పగా వ్రాయ గలరని ప్రోత్సహించాడు. ఇండియన్ లీషర్ అవర్ ఎడిటరు గుండుకుర్తి వెంకట రమణయ్య కూడా ప్రోత్సహించాడు. 1897లో మహారాజా ఆనంద గజపతి మృతి చెందాక, మహారాణి అప్పల కొండమాంబకు వ్యక్తిగత కార్యదర్శిగా, 1884లో మహారాజా కాలేజి వారి పాఠశాలలో ఉపాధ్యా యుడిగా, 1887లో కళాశాలలో అధ్యాపకునిగా, 1886లో రాజావారి ఆస్థానంలో విధులు నిర్వర్తించారు. గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యా శుల్కము నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుక భాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యాశుల్కము, వేశ్యావృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. 1892లో నాటకపు తొలి ప్రదర్శన జరిగింది. 1897లో కన్యాశుల్కము తొలి కూర్పును మహారాజా ఆనంద గజపతికి అంకిత మిచ్చారు. రెండవ కూర్పును 1909లో రచిం చారు. 1892లో గురజాడ కన్యాశుల్కము నాట కాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనకే ఎంతో పేరు వచ్చింది. దీనితో సాహి త్యంలో వాడుక భాష ప్రయోగానికి ఒక రకంగా నాంది పలికింది.

20వ శతాబ్ది తొలి నాళ్ళలో జరిగిన వ్యవహారిక భాషో ద్యమంలో గురజాడ అప్పారావు గిడుగు రామ మూర్తి పంతులుతో కలిసి పోరాటం సలిపారు. వారిద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వ విద్యాలయంలో గ్రాంథిక భాషా వాదులతో తలపడ్డారు. గిడుగు వాదనా బలానికి, గురజాడ రచనాశక్తి వ్యావహారిక భాషోద్యమానికి వినియోగ పడ్డాయి. వాడుక భాష ప్రయోగానికి వ్యతిరేకి అయిన కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి కూడా ఈ నాటకం సాహితీ విలువలను ప్రశంసించారు. 1897లో కన్యాశుల్కాన్ని వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారు ప్రచురించారు. 1909లో కన్యాశుల్కం తిరగ రాసారు. 1910లో రాసిన 'దేశమును ప్రేమించుమన్నా' అనే దేశభక్తి గీతం ఎంతో ప్రసిద్ధి పొందింది. 1911లో మద్రాసు విశ్వ విద్యాలయం బోర్డు అఫ్ స్టడీస్‌లో నియమించ బడ్డారు. అదే సంవత్స రంలో, స్నేహితులతో కలిసి ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రారంభించారు. 1913లో అప్పారావు పదవీ విరమణ చేసారు. మద్రాస్ విశ్వ విద్యాలయం 'ఫెలో'తో గౌరవించారు. చివరికి, 53 సంవత్సరాల వయసులో 1915 నవంబర్ 30 న గురజాడ మరణించారు. ఆయన రచించిన కన్యాశుల్కం వీధి వీధినా మారు మ్రోగిపోయింది. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా, స్త్రీలస్థితిపై సహానుభూతిని చూపటం గురజాడకు సహజమైన పరిణామం. 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' గేయం మనుషుల మెదళ్లలో దూరి ఆలోచనలు రేకెత్తించింది. 'మంచి అన్నది మాల అయితే ఆ మాల నేనవుతా' అని అంటరాని తనంపై కత్తిదూసిన మానవతా మూర్తి గురజాడ! ఆయన రచనల్లోని పాత్రలు ఒక్కొక్కటి ఒక్కో సంచలనం. తెలుగు నాట సాహితీ విప్లవ ప్రకం పనలు సృష్టించిన శ్రీశ్రీ 'నా అడుగు జాడ గుర జాడ' అన్నారు.

'గురజాడ 1915 లో చనిపోలేదు. అప్పుడే ఆయన జీవించడం ప్రారంభించారు'

**- దేవులపల్లికృష్ణశాస్త్రి**

'నాదృష్టిలో కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ!'

**- శ్రీశ్రీ**

ప్రాచీన భారతీయ సాహిత్యం నుంచి, పాశ్చాత్య సాహిత్యంతోపాటు ఫ్రెంచ్ విప్లవాన్నీ, సాహిత్యాన్నీ గురించిన అవగాహన, ఇతర దేశాల్లో జరుగుతున్న ప్రజాస్వామిక రాజకీయోద్యమాల గురించి తెలుసుకోవటమూ ఆయన దృష్టిని విశాలం చేశాయి.

**సెప్టెంబర్ 21.. మహాకవి జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**

9440595494

# ఆధునిక సాహిత్యజాడ... గురజాడ

తెలుగు సాహిత్య ఆధునిక యుగ కర్తలలో గురజాడ అప్పారావు (1862-1915) ఒకరు. సాహిత్య పరమార్థాన్ని సంఘం సంస్కరణ కోసం కాలం కంటే ముందు నడిచిన దార్శనికుడు గురజాడ ఆధునిక తెలుగు సాహిత్యానికి అడుగు జాడ. సాహిత్యం సామాజిక అనుభ వాలను మార్పులను సజీవతను రికార్డు చేస్తుంది. సమాజానికి దర్పణంగా నిలుస్తుంది. అటు వంటి తరుణంలో, తన రచనలను జనాంకితం చేసిన ద్రష్ట. ఏ ప్రక్రి యైనా జనావళిని ఆలోచింపజేసే విధంగా రచనా ధృక్పథాన్ని ఏర్ప రుచుకున్న యుగకర్త.



'వెనుక జూచిన కార్యమే మో యి.. మంచి గతమున కొంచమే నోయి/ మందగించక ముందుక డుగేయి.. వెనుక బడితే వెనుకే నోయి' అంటూ తన కాలపు సాంఘీక పరిస్థితులను ఆకళింపు చేసుకుని అభ్యుదయం వైపు అడుగులు వేసిన వైతాళికుడు. సంకల్పం సదాశయం సామాజికత ప్రతి రచనలోఅంతసూత్రంగా వ్యక్తం చేసిన యుగకర్తగా గుర జాడను తెలుగు సాహిత్యలోకం గుర్తించింది. శ్రీ శ్రీ లాంటి అభ్యు దయ కవిని ప్రభావితం చేసిన మహాకవి గురజాడ. ఏ కాలపు కవైనా నైతికత, నిజాయితీలను కలిగి ఉండాలనే భావనను తరువాతి తరాలకు అంతర్లీనంగా చెప్పిన కవి. అక్షరం శక్తివంతమైనదని గుర్తించిన కవి కూడా గురజాడే.

ఆనాటి సమాజంలో మూఢనమ్మకాలు, అశాస్త్రీయ జీవన విధానాలు కలిగి ఉన్న సమ యంలో వాటిని చేధించుకుని రాయడం అంత తేలికైన అంశం కాదు. స్త్రీల పక్షాన నిలబడి రచనలు చేయడం కూడా సాహసమే. స్థలకాలాలు గుర్తెరిగిన జాడలు మనకు ఆయన రచనల్లో కనిపించడం ఒక ప్రత్యేకత. దేశభక్తిని ప్రభోదించ డమే కాకుండా జాతి ఔన్నత్యాన్ని పరిపుష్టం చేసిన కవి గురజాడే.

దిద్దుబాటుకథ, కన్యాశుల్కం నాటకం, పూర్ణమ్మ గేయం, ముత్యాల సరాలు తదితర రచనల్లో వస్తువైవిధ్యం, ప్రక్రియా విభిన్న తను నిలిపిన కవిగా గురజాడకు ప్రత్యేకత ఉన్నది. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుష లోయ్' అనడం సాధారణంగా అనిపించినా, అసాధారణమైన మానవ సంబంధాల గురించి వ్యాఖ్యానించడాన్ని విస్మరించలేం.

మతము లన్నియు మాసిపోవును.. జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును అనడం ఒక్క గురజాడకే సాధ్యం. ఇప్పటికీ ప్రాసంగికత ఉన్నమాట. గ్లోబలీ క్రృత ప్రపంచాన్ని కలగన్న దార్శనికుడు. భావా నికి,భాషకి సరికొత్త లంగరెసిన కవి, ఆధునికతను నిర్వహించడానికి అడుగు జాడ గురజాడే.

ఒక కవి రచనల్ని చదడవటమంటే ఆ కవి జీవించిన కాలపు చారిత్రక సామాజిక రాజకీయ, భాషా సాంస్కృతికాంశాల విశిష్టతను అధ్యయనం చేయడమే. గురజాడ భాషా వాచకాలను ఈతరం చదవడం వలన ఆలోచనా ధృక్పథాన్ని విశాలం చేసుకోవచ్చు. కవులకు సామాజిక సంక్షోభాలను ఎలా అర్థం చేసుకోవాలి. అనేకాంశాలపై అవగాహన చైతన్యాన్ని పొందవచ్చు. సామాన్య పాఠకులకు సాహిత్యం అంటే ఏమిటో అవగతం అవుతుంది. అందుకు తెలుగు సాహిత్య జాడగా .. గురజాడ నిలిచారు. కాలికస్పృహను శక్తివంతంగా అందించిన కవి.. మన గురజాడ ఒక సాహిత్య అసమ్మతి పత్రం.

**- డా. ఎం.వి.రమణ**

9989000265

# లక్ష్యాన్ని స్థిరపరచిన కపిలవస్తు






మా ప్రయాణం నేపాల్ నుంచి శ్రావస్తి నగరానికి. సుమారు నూటా యాభై కిలోమీటర్ల దూరం.. బార్డర్‌లో ఇమ్మి గ్రేషన్ ముగించుకున్నాం. ఆ దేశం నుంచి బయటకు వెళ్ళిపోతున్నప్పుడు తప్పకుండా లగేజీని కూడా చెక్ చేస్తారు. మార్గ మధ్యంలో కపిలవస్తు, జేతవనం, అంగులి మాలుని గుహలు, శ్రావస్తి మా పర్యటన ప్రణాళిక లో ఉన్నాయి. లుంబినీ నుంచి కపిలవస్తు ఇరవై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది.

ప్రసవం కోసం పుట్టింటికి బయలుదేరిన మాయాదేవి మార్గమధ్యలో నేపాల్ లుంబినీ వనంలో బుద్ధుడిని ప్రసవించింది. అది తెలిసిన శుద్ధోధన మహారాజు బిడ్డతో పాటు తిరిగి రాజ్యా నికి రమ్మని కబురు పంపాడు. రాజాజ్ఞమేరకు ఆమె దేవదహకు వెళ్ళకుండా తిరిగి కపిలవస్తుకు చేరుకుంది. ఆమె పుట్టింటికి వెళ్లకపోవడానికి రెండు కారణాలను ఊహించవచ్చు. ఒకటి వంశోద్ధారకుడు జన్మించాడని తెలిసిన మహారాజు తిరిగి రాజ్యానికే రమ్మని ఆజ్ఞాపించడం. రెండోది అప్పుడే పచ్చిబాలింత చంటి బిడ్డతో అంతదూరం ప్రయాణం చేయడం కఠినతరం. పైగా ఆమె వెళ్ళిన పని మార్గమధ్యలోనే జరిగిపోయింది. కాబట్టి ఇంక అక్కడికి వెళ్ళవలసిన అవసరం తీరి పోయింది. బుద్ధుడు జన్మించిన వారం రోజులకే తల్లి మాయాదేవి మరణించింది. చిన్నమ్మ గౌతమి సంరక్షణలో ఆయన పెరిగాడు. బుద్ధుడి అసలు పేరు సిద్ధార్థుడు. గౌతమి పెంపకంలో పెర గడం వల్ల తర్వాత గౌతమబుద్ధుడు అయ్యాడు. అప్పుడప్పుడు మినహా బుద్ధుడి బాల్యం, యవ్వన దశలు రెండూ కపిలవస్తులోనే గడిచాయి.

అప్పటికింకా సామ్రాజ్యాలు ఏర్పడలేదు. గణ రాజ్యాలే ఉన్న కాలం. అప్పట్లో పదహారు మహా జనపదాలు ఉండేవట. కపిలవస్తు కూడా వాటిలో ఒకటి. కోసల రాజ్యం కింద వున్న ఒక చిన్న గణరాజ్యం. దానికి కపిలవస్తు రాజధాని. రాముడు కోసల రాజ్యానికి చెందిన ఇక్ష్వాకు వంశస్థుడని అందరికీ తెలిసిందే. రాజ్య పాలన రాజు ఒక్కడే చేసేవాడు కాదు. శాక్య ప్రముఖులతో కూడిన 'సంథాగారం' అనేసభ ఉండేది. అందులో చర్చించిన తర్వాతనే నిర్ణయాలు తీసుకునే వారట. ఇది ఒకరకమైన ప్రజాస్వామ్య విధానమని చెప్ప వచ్చు. శాక్యులు ఇక్ష్వాకువంశానికి చెందిన క్షత్రియులు.

ఇకపోతే ఈ కపిలవస్తు ఎక్కడ ఉంది? అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నేపాల్ ప్రభుత్వం తిలౌరాకోట్ అనే ప్రదేశాన్ని కపిల వస్తుగా చెపుతోంది. ఇది బుద్ధుడు జన్మించిన లుంబినీ వనానికి ఇరవైయేడు కిలోమీటర్ల దూరంలో ఉంది. మన పురావస్తు శాస్త్ర వేత్తలు చెప్పిన దానికి ఆధారాలు ఉన్నాయి. భారత దేశంలోని ఉత్తర ప్రదేశ్ జిల్లాలోని పిప్రహ్వా అనే ప్రదేశంలో జరిగిన తవ్వకాలలో శాక్యులకు చెందిన స్తూపం, ధాతువులు. ' ఇది శాక్యముని బుద్ధునిది' అని రాసి ఉన్న ఒక కుండ బయట పడ్డాయి కాబట్టి భారత పురావస్తుశాఖ దీనినే అసలు కపిలవస్తుగా తేల్చి చెప్పింది. మేం వెళ్ళింది కూడా ఇక్కడికే..

బుద్ధుడు పుట్టినప్పుడు అసితుడు అనే రుషి ' ఈ బాలుడు పెరిగి గొప్ప చక్రవర్తి అవుతాడు లేదా గొప్ప సన్యాసి అవుతాడు' అని జోస్యం చెప్పా డట. అది దృష్టిలో పెట్టుకొని తండ్రి శుద్ధోధనుడు అతణ్ణి అన్ని ప్రాపంచిక దుఃఖాలకు దూరంగా ఉంచాలని నిర్ణయించాడు. అంతే కాదు.. సకల భోగాలతో పెంచాడు. చలి, వేసవి, వర్షాకాలాలలో నివసించడానికి మూడు భవనాలను తన తండ్రి నిర్మించాడని స్వయంగా బుద్ధుడు చెప్పినట్లు త్రిపిటకాలలోని అంగుత్తర నికాయ అనే పాళీ భాషలో రాసిన గ్రంథంలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే .. బుద్ధుడు స్వయంగా ఏ గ్రంథం రాయలేదు. తర్వాతనే ఆయన బోధన లను గ్రంథస్థం చేసారు. యవ్వన, ఆరోగ్య, సంపదల మదం ఎంత ప్రమాదకరమో తన శిష్యులకు చెప్పడానికి బుద్ధుడు తన జీవిత ఘట్టాలను ఉదాహరణగా చెప్పేవాడు. అప్పు డప్పుడు మినహా బుద్ధుడి బాల్యం, యవ్వన దశలు రెండూ కపిలవస్తులోనే గడిచాయి. కోలియ రాజ్యపు యువరాణి యశోధరతో వివాహం జరిగింది. కొడుకు రాహులుడు జన్మించాడు. బుద్ధుడు ఇరవై తొమ్మిదియేళ్ళు కపిలవస్తులోనే గడిపాడు. అయితే అతి విలాసవంతమైన అతని జీవితం బుద్ధుడికి సంతృప్తినివ్వలేదు.

బుద్ధుడి మహాభినిష్క్రమణకు హేతవులైన వృద్ధుడు, రోగి, శవం, సన్యాసి అనే నాలుగు సంకేతాలను 'చతుర్నిమిత్తాలు'గా బౌద్ధ గ్రంథాలు చెపుతున్నాయి. అయితే ఇక్కడ మనం అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే.. ఈ నాలుగు దృశ్యాలు బుద్ధునికి ఒక రోజులో ఎదురు కాలేదు. సిద్ధార్థుడు తన ఇరవై తొమ్మిదేళ్ళలో క్రమంగా తెలుసుకున్న జీవిత సత్యాలకు ఇవి ప్రతీకలు. అందుకే ఆయనకు అప్పటివరకూ తాను అనుభవిస్తున్న జీవితం సంతృప్తినివ్వలేదు. అంత రంగంలో ఏదోఅసంతృప్తి.. అన్వేషణ కొరకు ప్రయత్నం, ప్రయాణం, ఫలితంగా జ్ఞానోదయం కలిగింది.

బుద్ధుని జ్ఞానోదయానికి హేతువులైన చతుర్నిమిత్తాల గురించి ఇక్కడ వివరిస్తాను. సిద్ధార్థుడు తన రథసారథి ఛన్నుడితో కలిసి విహా రానికి వెళ్తుండగా..వంగిన నడుము, నెరిసిన జుట్టు, బోసి నోటితో, చేతిలో కర్రతో వణుకుతూ నడిచివెళ్తున్న ఒక ముసలివాడు కనిపించాడు. అలాంటి వ్యక్తిని అదివరకెన్నడూ చూడని సిద్ధార్థుడు అతడెవరని అడుగుతాడు. దానికి 'ప్రభూ! ఇతడు వృద్ధుడు. వృద్ధాప్యం అందరికీ వసుంది. మీకు, నాకు, రాజుగారికి కూడా...' అని చెప్తాడు ఛన్నుడు. అంతే...సిద్ధార్థుడిలో యవ్వనం ఎంత అశాశ్వతమైందో కదా? అనే ఆలోచన మొదలైంది. శరీరమంతా పుండ్లతో చీము కారుతూ ఊపిరి తీసుకోవడం కూడా కష్టమై ఇబ్బంది పడుతున్న ఒక రోగి ఇంకోరోజు వాళ్ళకు దారిలో కనిపిస్తాడు. అతడి గురించి తెలుసుకున్న సిద్ధార్థుడికి ..అనారోగ్యానికి ఎవరైనా ఎప్పుడైనా గురికావచ్చు. ఆరోగ్యవంతుడునని గర్వపడే మనిషి ఎంత అజ్ఞాని కదా? అనే ఆలోచన మొదలైంది.

మరోరోజు విహారానికి వెళ్ళిన సందర్భం లోనే.. నలుగురు మోస్తున్న పాడెపై తెల్లటిబట్ట కప్పిన శవం వెనక ఏడుస్తున్న బంధువులు కనిపిం చారు. ఇది ఏమిటీ? అని అడిగిన సిద్ధార్థుడి ప్రశ్నకు..'ప్రభూ... ఇది మరణం. పుట్టిన ప్రతి ప్రాణికి మరణం ఉంటుంది' అని బదులు చెప్పాడు. అంటే పుట్టుక ఉంటే వృద్ధాప్యం, రోగం, మరణం తప్పవా? అనే అంతర్మథనం అతడిలో కలిగింది. ఇంకొక రోజు.. కాషాయ వస్త్రాలు ధరించి, ప్రశాంతమైన వదనంతో, చేతిలో భిక్షా పాత్రతో నడుస్తున్న సన్యాసి కనిపించాడు. అతని కళ్ళలో భయం లేదు, ప్రశాంతత ఉంది. అతడే శ్రమణుడు. శ్రమణుడు అంటే శ్రమ చేసేవాడని అర్థం. వేదాలను ప్రశ్నించేవాడు. ఇల్లు, ఆస్తి, కులం, కుటుంబం అన్నీ వదిలేసి అడవుల్లో తిరుగుతూ సత్యాన్ని స్వయంగా వెతికే వాడు. శరీరాన్ని,మనసును శ్రమ పెట్టి (ఉపవాసం, ధ్యానం, తపస్సు) ముక్తి కోసం ప్రయత్నించే వాడు. కులంతో సంబంధం లేకుండా ఎవరైనా శ్రమణుడు కావచ్చు. బుద్ధుడి కాలంలో దాదాపు అరవై మూడు శ్రమణ తెగలుండేవని బౌద్ధ గ్రంథాలు చెపు తున్నాయి.) ' ఇతడు ఇల్లు వదిలి సత్యాన్ని వెతికే సన్యాసి. అతడు ముసలితనం, రోగం, మరణాలకు అతీతమైన మార్గాన్ని వెతుకు తున్నాడు' అని ఛన్నుడు చెప్పాడు. నాలుగవ మార్గం సిద్ధార్థునికి ఆశాకిరణంలా కనిపించింది. ఉంటే ఆ మార్గంలోనే ఉండాలని నిశ్చయించు కున్నాడు.

అంతే! ఒకరోజు రాత్రి ఛన్నుడు, తన గుర్రం కంథకుడితో కలిసి అనోమా నది దాటి, రాజ వస్త్రాలు వదిలి సన్యాసిగా మారాడు. అయితే సన్యాసిగా మారినప్పుడు కొడుకు రాహులుడి వయసు ఏడాది అని, వారం రోజులు అని, పుట్టిన రోజు రాత్రే సన్యాసిగా మారాడనే భిన్నాభిప్రాయా లు ఉన్నాయి. ఎప్పుడు మారినా సన్యాసిగా మారడం మాత్రం వాస్తవం. సిద్ధార్థుడు సన్యాసిగా మారిన తర్వాత యశోధర చంటిపిల్లవాడి తల్లిగా ఆ సంఘ టనను ఎలా ఎదుర్కొని ఉంటుందో స్త్రీ కోణం నుంచి ఊహించి ప్రఖ్యాత రచయిత్రి ఓల్గా రాసిన 'యశోధర' నవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

**- గిరిజ పైడిమర్రి**

9949443414

## 'పూటకూళ్ళవ్వ' ఆవిష్కరణ

దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రచురించిన మాదారపు వాణిశ్రీ రచన 'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ సభ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్‌స్కూల్, వీధి. 13, హిమాయత్ నగర్, హైదరాబాద్‌లో 22 మంగళ వారం2.00 గం.లకు నిర్వహించ బడుతుంది. ఆవిష్కర్త: కే.ఆనందచారి, డా. ఎస్. రఘు, ఎం. వేదకుమార్, డా. కొండపల్లి నిహారిణి, డా. ఇడికోజు శ్రీనివాసా చారి తదితరులు పాల్గొంటారు.

**ఎం.వేద కుమార్**

చైర్మన్, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్

## ఉదారి నాగదాసు స్మారక పురస్కారం 27న ప్రదానం

ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కారం 2026వ సంవత్సరానికి గాను ప్రముఖ కవి, రచయిత మునిమడుగుల రాజారావు గారు ఎన్నికయ్యారు. ఈ అవార్డును సెప్టెంబర్ 27వ తేదీ 2026న ఆదిలాబాద్ లో ఉదారి నాగదాసు వర్ధంతి సభలో ప్రదానం. ఈ అవార్డు కింద ఐదు వేల రూపాయలు(5000) నగదు ప్రశంసా పత్రం అందజేయబడును.

నిర్వాహకులు

**డాక్టర్ ఉదారి నారాయణ**

**నాగదాసు కుటుంబ సభ్యులు**

9441413666

## పెన్నా సాహిత్య పురస్కారం 2026

పెన్నా సాహిత్య పురస్కారం 2026 కు గాను 'బిల్లమహేందర్' గారి కవితా సంపుటి 'నేను మరణిస్తూనే ఉన్నాను' ఎన్నిక అయింది. త్వరలో నిర్వహించబోయే పెన్నా రచయితల సంఘం 17వ వార్షికోత్సవంలో బిల్ల మహేందర్ గారికి నగదు పురస్కారం మరియు సన్మానం జరుగుతుంది అని తెలియ చేస్తున్నాం.

అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

**అవ్వారు శ్రీధర్ బాబు**

**గోవిందరాజు సుభద్ర దేవి**

పెన్నా రచయితల సంఘం

## అక్షరాల పండుగ బీసీ కవుల ఆలాయ్-బలాయ్!

కాలానికి
కార్తె పండుగ ఉన్నట్లే,
పుస్తకానికి పండుగ ఉంటది,
అక్షరానికి పండుగ ఉంటది,
రజతోత్సవ పండుగ ఉంటది!
గింజకు పండుగ ఉన్నట్లే,

మనిషికి పండుగ ఉన్నట్లే,
ఊరికి పండుగ ఉన్నట్లే,
నినాదానికి పండుగ ఉంటది,
కులాల హక్కుల సాధనకు
పండుగ ఉంటది!

పార్టీకి
ప్రమిదకు పండుగ ఉన్నట్లే,
నదికి
నాగలికి పండుగ ఉన్నట్లే,
వెంటాడే కలలకు,
వెనుకబడిన కులాల
సామాజిక హక్కులకు పండుగ
ఉంటది!

వెంటాడే కలలకు,
వెనుకబడిన కులాల
సామాజిక హక్కుల స్వరాలకు
ఒక పండుగ ఉంటది!

అక్షరం అక్షరంగా
అస్తిత్వాన్ని పలకడానికి,
కలం కలంగా
కులాల కథలను రాయడానికి,
గొంతు గొంతుగా
హక్కుల మాటలు
వినిపించడానికి
రండి మిత్రులారా!

వెంటాడే కలలు -
వెనుకబడిన కులాల
అస్తిత్వ స్వరాల పండుగకు
రండి!
కలుద్దాం!
అక్షరాలు కవిత్వమై కదిలే
బీసీ కవిత్వ పండుగకు రండి!
ఆ పండుగే-
బీసీ కవుల ఆలాయ్-బలాయ్!
చలో హైదరాబాద్!

**- వనపట్ల సుబ్బయ్య**

9492765358

## తప్పిపోయిన ఋతువు

రోడ్లపై ఆకులు రాలిపడుతున్నవి
చెట్లు రంగుల దుస్తులు
మార్చుకుని తనను తానే
చూసుకుంటుంది
చినుకుల బుడగల్లో ఎన్ని చెట్లో
చిక్కటి చలి రాత్రుల్లో
బిగుసుకుని గాఢ నిద్రలోకి
ఒదిగిపోతున్నాయి
శిశిరం లోకి వెళ్ళడానికి
శోకాన్ని దిగమింగి దారిని విశాలం చేస్తున్నాయి
హృదయం వింత సవ్వడిలో
కాలం తీగలా పాకుతుంది
అంతమైన ఋతువు లో
ఎటో వెళ్ళిపోయిన
ఆకులు
గాలిలో కలిసిన పరిమళాలు
చేతికి అందవు

**- డా.సుంకర రమేశ్**

9492180764

## శ్వాసదీపం

కవిత్వం
నాకు దారిభత్యం!!
అది నా అణువణువున ప్రవహించే
ఆత్మీయ చైతన్యం

నా సంతోషానికి రెక్కలు తొడిగి
నిండుజీవితానికి హామీ ఇస్తూ-
నా దేహపు లోతులను తడిమే అమృతం!

నా చూపుకు వెలుగైత
నా ఆలోచనలకు ఊపిరై
నేను ఈ మట్టిలో
కలిసిపోయేంతవరకు
నన్ను వీడని నీడ కవిత్వం
నా శ్వాస దీపం వెలిగి ఉన్నంతవరకు
నా లోపల కవిత్వమే విరబూస్తుంది-
ఒక విశాలమైన గులాబీవనమై!

**-విల్సన్ రావు కొమ్మవరపు**

89 854 35 515

## నవరస కళాపోషకులు

నాయకులు నవరస కళాపోషకులు
బూతు మాటలనే భుజకీర్తులుగా భావిస్తూ
తొడలు గొడుతూ తొండాటాడుకుంటూ
రంగులు పులుముకోకుండానే రక్తికట్టిస్తున్నరు

నడిరోడ్డునే నట వేదికను చేసి
వీరాంగమేస్తూ వీరరసాన్ని సృజిస్తున్నరు
రౌద్రం పండక భీభత్సం సృష్టిస్తూ
పసలేని వాదనలతో హాస్యగాళ్ళవుతున్నరు

భయానకంలో బిక్క చూపులు చూస్తూ
కెమెరా కన్ను పడగానే
కరుణరసం ప్రదర్శిస్తున్నరు
సత్యాలను తేల్చమంటే
శాంతం శాంతమంటూ
ఎత్తిపోతల కార్యంలో
కష్టాలను ఏకరువు పెడుతూ
జనజాతర తగ్గగానే
జావళీలందుకుంటున్నరు

ప్రజా సమస్యలు అటకెక్కించి
నట కౌశలానికి మెరుగులు దిద్దుకుంటూ
అద్భుత రసాన్ని అద్భుతంగా

మత్తులో గమ్మత్తుగా అభినయిస్తున్న
మన నాయకులు! నవరసకల పోషకులు.

**- డా.ఎడ్ల కల్లేశ్**

9866765126

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం: https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్**



# సిరిసిల్లలో సీఎం వర్సెస్ మాజీ మంత్రి మాటల యుద్ధం



### అసెంబ్లీ సాక్షిగా సీఎం నోట, బిఆర్ఎస్ నాయకుల పేర్లు
### 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం
### గత ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ నాయకులే ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం

**సిరిసిల్ల సెప్టెంబర్ 19 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల తొమ్మిది నెలల అవుతుంది. సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసిఆర్ కుటుంబ సభ్యులు , బిఆర్ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ అండదండలతో తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూమిని బిఆర్ఎస్ కుటుంబం, నాయకులు అందరూ కలిసి తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేశారంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మళ్లీ చేశారు. గత ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 8 వేల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం చేసిన వారి పేర్లు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రస్తావించారు. రాజన్న సిరిసిల్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు , తోట ఆగయ్య , సీనియర్ నాయకుడు కొండూరి రవీందర్ రావు , బుల్లి రామ్మోహన్, ఇతర నాయకుల పేర్లను ప్రస్తావించారు.

సీఎం రేవంత్ రెడ్డి, ఈనెల ఆఖరిలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జెండా ఎగరేస్తా...

గత ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ సిరిసిల్ల కాంసెన్సీ గెలిచి జిల్లా కేంద్రం నుండి మంత్రిగా ప్రాతినిధ్యం వహించాడు. సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ నాయకులు సుమారు 8000 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యిందని సీఎం రేవంత్ రెడ్డి నోట ఈ మాట రావడం రాజకీయ వర్గాలలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి, ఒక సభలో ఈనెల ఆఖరిలో సిరిసిల్ల పర్యటన ఉంది. సిరిసిల్ల వస్తున్న కాంగ్రెస్ జెండా ఎగరేస్తా నా సత్తా చూపిస్తా అంటూ సభలో ప్రస్తావించాడు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూమి గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతం చేసిన కొంతమంది బిఆర్ఎస్ పేర్లను కూడా చదివి వినిపించారు. సీఎం రేవంత్ రెడ్డి, సిరిసిల్ల పర్యట ఉండంతో ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసిన బిఆర్ఎస్ నాయకుల్లో టెన్షన్ టెన్షన్ గా ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మాటకు ప్రతి మాట...

సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా గత ప్రభుత్వ హయాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యింది. అని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్, హైదరాబాదులో బిఆర్ఎస్ భవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. కేటీఆర్ మాట్లాడారు. గత బిఆర్ఎస్ పార్టీ హయాంలో ప్రభుత్వ భూమి అన్యకాంతం అయ్యిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించాడు. మా కుటుంబంపై అనేక ఆరోపణలు చేశారు. ఆరోపణలపై నిజంగా ఈ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ప్రజలకు నిజం చెప్పాలని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా బిఆర్ఎస్ నాయకుల పేర్లు ప్రస్తావించిన వారివి 2007 లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వారు పట్టాలు పొందినట్లు ఆయన వివరించారు. నిజంగా సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ భూమి ఎనిమిది వేల ఎకరాలు అన్యాక్రాంతం చేస్తే ప్రజలకు నిజం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం, సభ్యులు తెలంగాణ రాష్ట్రంలో ఎంత భూములను కబ్జా చేశారో , వివరాలు కూడా మా దగ్గరికి వచ్చాయని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు, మా ప్రభుత్వ ఆయాంలో, ఈ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం భూములు ఎన్ని అన్యాక్రాంతం జరిగిందో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి నిజం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు అని ఆయన మండిపడ్డారు . సీఎం రేవంత్ రెడ్డి ఈనెల ఆఖరి లో సిరిసిల్ల పర్యటన ఉంది అని చెబుతున్నాడు. కాబట్టి సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతానికి గురైందో సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పాలని, కేటీఆర్ సవాలు చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి, కేటిఆర్ దోస్తులు

### సిరిసిల్లలో 8 ఎకరాలు కబ్జా ఆధారాలు ఎక్కడ?
### సీఎం రేవంత్ రెడ్డి తలుచుకుంటే మూడు గంటల పని
### గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవాలకు నీళ్లు లేవు
### కాలువలు, చెరువులు ఎండిపోయాయి
### ఎస్సారెస్పీ పరిధిలో కాలువల్లో నీళ్లు లేవు
### కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్



**సిరిసిల్ల సెప్టెంబర్ 19 (మనం ప్రతినిధి):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం పర్యటించారు. కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో గణేష్ విగ్రహాల నిమజ్జన ఉత్సవాలకు నీళ్లు లేవు, చెరువులు కాలువలు ఎండిపోయాయి, ఎస్సారెస్ పరిధిలో నీళ్లు లేవు, అని కేంద్ర హోం సహాయం మంత్రి బండి సంజయ్ సిరిసిల్ల పర్యటనలో ఆరోపణలు చేశారు. వినాయక నిమగ్న విషయంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.సీఎం వెంటనే జోక్యం చేసుకోవాలి అని కోరారు. తక్షణమే కాలువలకు నీళ్లు వదలాలి అని ఆయన సూచించారు.హిందు పండుగలను చులకనగా చూస్తే ఊరుకునేది లేదు అని మండిపడ్డారు.కాలువలకు నీళ్లు వదలకపోతే వినాయక విగ్రహాలను రోడ్లపై ఉంచాల్సి వస్తుంది, అని ఆయన తెలిపారు. శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. అని ఆయన వెల్లడించారు.

పరిస్థితి చేయి దాటక ముందే నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా రివ్యూలు చెయ్యాలని ఆయన పేర్కొన్నారు.ప్రైవేట్ భూముల్లోకి వెళ్లే అధికారం ఎవరికీ లేదు అని ఆయన తెలిపారు. అధికార కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నారనే సోయి రానట్లుంది. అని ఆయన ఎద్దేవా చేశారు.ప్రభుత్వం వద్ద అన్ని ఆధారాలున్నప్పుడు చర్యలు తీసుకునే దమ్ము లేదా?. అని ఆయన ప్రశ్నించారు.బిఆర్ఎస్ లక్ష కోట్ల భూదోపిడీ చేసిందని తేల్చడానికి మూడేళ్లు పట్టిందా? అని ఆయన మండిపడ్డారు.సీఎం స్థాయి వ్యక్తి తలుచుకుంటే 3 గంటల్లో అన్ని ఆధారాలు బయటపెట్టవచ్చు ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారని తేల్చి చెప్పారు.రేవంత్ రెడ్డి, కేటీఆర్ దోస్తులు, అని జోష్యం చెప్పారు.అందుకే భూదోపిడీ టైం పాస్ పొలిటిక్స్ చేస్తున్నారు, అని విమర్శించారు.ఏఐసీసికి ఈఎంఐ కట్టడానికి సీఎం భూదోపిడీని అడ్డుపెట్టుకుని బేరసారాలు అడుతున్నారు. అని ఆయన అన్నారు.

సిరిసిల్లో 8 వేల ఎకరాలను బీఆర్ఎస్ కబ్జా చేసిందనడానికి ఆధారాలేవి, అని ప్రశ్నించారు. ఆధారాలు చూపితే మేమే ఆ భూములను రక్షిస్తాం. అని ఆయన హామీ ఇచ్చారు.పేదలకు ఆ భూములను పంచుదాం, అని ఆయన వెల్లడించారు. ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు చేస్తున్నాయి, అని ఆయన ఆరోపించారు.దమ్ముంటే బీఆర్ఎస్ నేతల రూ.లక్ష కోట్ల భూదోపిడీకి సంబంధించి పూర్తి డాక్యుమెంట్లన్నీ బయటపెట్టాలి. అని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో తప్పు చేశామని క్షమాపణ చెప్పాలి. అని ఆయన పేర్కొన్నారు.6 గ్యారంటీలు, తెలంగాణ అభివృద్ధిపై చర్చ లేకుండా అసెంబ్లీలో రాజకీయ డ్రామాలాడుతున్నారు, అని ఆయన మండిపడ్డారు. సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ ఉందా?, కాంగ్రెస్ పార్టీపట్ల ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చింది.కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి చేయి దాటిపోయింది, అని ఆయన తెలిపారు .గణేశ్ నిమజ్జన ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం.మహారాష్ట్ర తరువాత అత్యంత అంగరంగ వైభవంగా నిమజ్జన ఉత్సవాలు జరిగేది తెలంగాణలోనే, అని ఆయన అన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తియుత వాతావరణం లో నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొనాలి, కోరారు. తప్పుడు ప్రచారం నమ్మకుండా అధికారులకు సహకరిస్తూ ఉత్సవాల్లో పాల్గొనాలి, అని ఆయన ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం నిమజ్జన ఉత్సవాలు విజయవంతం జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయండి. నిమజ్జన ఉత్సవాలపై సీఎం స్థాయిలో సమీక్ష జరపాలి.శాంతి భద్రతలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కేంద్రం అంటే బండి సంజయ్ పేర్కొన్నారు.



## డబ్ల్యూఎఫ్‌పీ ఈడీగా లిండ్‌బర్గ్

**రోమ్,సెప్టెంబర్ 20 :** అమెరికాకు చెందిన వ్యవసాయ అధికారి లూక్ లిండ్‌బర్గ్‌ను ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) కార్యనిర్వాహక డైరెక్టర్‌గా (ఈడీ) నియమిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అంతర్జాతీయ సంక్షోభ సమయాల్లో ప్రజల ఆకలి బాధను తీర్చడంలో డబ్ల్యూఎప్‌పీ కీలక పాత్ర పోషిస్తోంది. అమెరికా ఎగువసభ అయిన సెనెట్‌లో మెజారిటీ నాయకుడు జాన్ థూన్ అల్లుడైన లిండ్‌బర్గ్ ప్రస్తుతం అమెరికా వ్యవసాయశాఖ ఉప కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇటలీలోని రోమ్ కేంద్రంగా పని చేస్తున్న డబ్ల్యూఎప్‌పీ కార్యనిర్వాహక డైరెక్టర్‌గా ఆయన సిండీ మెక్కెయిన్ స్థానంలో నియమితులయ్యారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు..
# తమ పౌరులకు యూఎస్ అలర్ట్

**వాషింగ్టన్,సెప్టెంబర్ 20 :** ఇరాన్ మద్దతుగల హూతీలు సౌదీ అరేబియాపై దాడులు చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా దేశాంగ శాఖ తమ పౌరులకు సెక్యూరిటీ అలర్ట్ జారీ చేసింది. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విమానాల రద్దు, గగనతల మూసివేతలు, ఇతర ప్రయాణ అంతరాయాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించింది.

'సౌదీపై హూతీల దాడి అనంతరం పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశముంది. అక్కడి దేశాలకు ప్రయాణించాల్సి ఉన్న ప్రయాణికులు పునరాలోచించుకోవాలి. విమాన షెడ్యూళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండండి. ఇప్పటికే ఆయా దేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి. ఎందుకంటే ఇరాన్ సహా దానికి మద్దతిచ్చే దళాలు గల్ఫ్ దేశాలలోని అమెరికా కార్యాలయాలు, ఆస్తులను లక్ష్యం చేసుకునే అవకాశం ఉంది' అని తమ పౌరులను హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది.



యూకేలోని ఆర్ఏఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ నుంచి బీ 1బీ బాంబర్ బయలుదేరినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. అయితే దానిని ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మార్చిలో అగ్రరాజ్యం ఇరాన్‌పై భారీ దాడులు చేసిన సమయంలో కూడా ఆర్ఏఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ ప్రధాన స్థావరంగా పని చేసింది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం సుమారు 12 బీ 1బీ బాంబర్లు మోహరించి ఉన్నాయి.

## టెక్సాస్‌లో సరిహద్దు గోడ నిర్మాణం ప్రారంభం



**కామ్ స్టాక్, సెప్టెంబర్ 20 :** అమెరికా-మెక్సికో సరిహద్దులో పశ్చిమ టెక్సాస్‌లోని బిగ్ బెండ్ ప్రాంతం మీదుగా సరిహద్దు గోడ నిర్మాణాన్ని డొనాల్డ్ ట్రంప్ సర్కారు ప్రారంభించింది. మెక్సికో, దక్షిణ అమెరికాలోని ఇతర దేశాల నుంచి అక్రమ వలసలను నిరోధించడానికి గోడ నిర్మిస్తామనీ, ఇంకా బారికేడ్లు, రోడ్లు, సాంకేతిక పరిజ్ఞానంతో సరిహద్దును సురక్షితంగా ఉంచుతామనీ ట్రంప్ వాగ్దానం చేశారు. 4,600 కోట్ల డాలర్లతో చేపట్టిన ప్రణాళికలో ఈ బిగ్ బెండ్ గోడ ఒక మైలురాయి. పశ్చిమ టెక్సాస్‌లోని హడ్స్ పెత్ జిల్లా పరిధిలోని 47 మైళ్ల బిగ్ బెండ్- 1 ప్రాంతంలో సరిహద్దు గోడ ఉక్కు ప్యానెళ్ల బిగింపు జరుగుతోందని కస్టమ్స్, సరిహద్దు భద్రతా విభాగం (సీబీపీ) తెలిపింది. ఎల్ పాసో దక్షిణాన ఉన్న హడ్స్‌పెత్ జిల్లా నుంచి అమిస్టాడ్ సరస్సు వరకు సుమారు 500 మైళ్ల బిగ్ బెండ్ ప్రాంతంలో మొత్తం ఐదు ఉక్కు గోడ ప్రాజెక్టులు చేపడుతున్నారు.

సెప్టెంబరు 15న మొదటి ప్యానెళ్లను అమర్చినట్లు సీబీపీ తెలిపింది. 2,000 మైళ్ల మెక్సికో సరిహద్దు వెంబడి వారానికి సగటున 12 మైళ్ల బారికేడ్లను నిర్మిస్తున్నట్లు వివరించింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 200 మైళ్ల బారికేడ్ల నిర్మాణం పూర్తయింది. ఈ మారుమూల సరిహద్దు ప్రాంతమైన బిగ్ బెండ్‌లో చొరబాట్లుకానీ, అక్రమ వలసలు కానీ జరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. గోడ వల్ల వరద ముప్పు ఉందని ఒక సరిహద్దు పట్టణం ఆందోళన చెందుతోంది. తమ పవిత్ర ప్రదేశాలకు భంగం కలుగుతోందని స్థానిక గిరిజనులు, తమ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని భూ యజమానులు ఈ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. స్థానికులతో పర్యావరణ బృందాలు గొంతు కలుపుతున్నాయి. గోడ నిర్మాణాన్ని నిరసించే వారితో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం బిగ్ బెండ్ నేషనల్ పార్క్‌లో నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసింది.

### ఫలించిన పాలిటెక్నిక్
## పోరాటం

**హైదరాబాద్, సెప్టెంబర్ 20 :** పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకుల పోరాటం ఫలించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయాలన్న ప్రతిపాదనపై తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. విలీన నిర్ణయంపై యూటర్న్ తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్పష్టతనిచ్చింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను యథాతథంగా సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని నిర్ణయించారు. సాంకేతిక విద్యాశాఖతో పాటు సాంకేతిక విద్యామండలిని కూడా ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగించనున్నారు. ఈ శాఖలో ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియకు ప్రభుత్వం బ్రేక్ పడింది. డిప్లొమా కోర్సుల నిర్వహణలో కూడా ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టత లభించింది. అదేవిధంగా పాలిటెక్నిక్ విద్యకు సంబంధించి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిబంధనలు, పరీక్షల విధానం అన్నీ పాత పద్ధతిలోనే కొనసాగనున్నాయి. విలీన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ గత 35 రోజులుగా విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఆందోళనలు చేపట్టారు. అధ్యాపకులు సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టడంతో ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి పాత పద్ధతిలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగిస్తామని ప్రకటించింది.

# యూపీఐ బాదుడు బారం

### అక్టోబర్ 15 నుంచి యూపీఐ భాదుడే భాదుడు
### యూపీఐ తెచ్చేన్ భారీ గందరగోళం
### చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగుతొన్న వ్యాపారులు..
### రూ.2000 లోపు నో.. దాటితే చార్జీలే..
### రూ.2 వేలు దాటితే యూపీఐ చెల్లింపులు తీసుకోం
### నగదు తీసుకుంటాం.. వ్యాపారులు, పెట్రోల్ డీలర్లు
### నిరసనగా యూపీఐ చెల్లింపులు నిలిపివేస్తామంటున్న వ్యాపారులు
### అక్టోబర్ 15 నుంచి నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళన
### ఈ ఛార్జీ వ్యాపారులకే తప్ప, వినియోగదారులకు కాదంటున్న కేంద్రం

హైదరాబాద్, మనం ప్రతినిధి : దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి కారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ)పై కొత్తగా ఛార్జీలు విధించాలన్న ప్రతిపాదన వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. హైదరాబాద్ మినహా దేశంలోని పలు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు ఎవరూ కూడా ఈ అదనపు భారాన్ని మోయడానికి సిద్ధంగా లేరు. ఈ ఛార్జీలను ప్రభుత్వం వ్యాపారుల నుంచే వసూలు చేస్తుందని చెప్పినప్పటికీ, ఇది పరోక్షంగా వినియోగదారులపైనే ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొనుగోళ్లకు నగదు తీసుకురావాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ కొత్త ఛార్జీల భారాన్ని తాము భరించలేమని, అందుకే పెద్ద మొత్తంలో చెల్లింపులకు నగదు అడగాల్సి వస్తుందని వారు చెబుతున్నారు.

**అక్టోబర్ 15 నుంచి ఏం మారుతుంది?**

కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి వినియోగదారుడి నుంచి వ్యాపారికి (పర్సన్-టు-మర్చంట్) చేసే రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని కస్టమర్ కాకుండా, సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. లావాదేవీ విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఈ ఛార్జీ గరిష్టంగా రూ.300గా పరిమితం చేశారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు, అలాగే రూ.2,000 లోపు చేసే వ్యాపార చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ప్రస్తుతం జరుగుతున్న 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలలో 95 శాతానికి పైగా రూ.2,000 లోపువే కాబట్టి, వాటిపై ఈ కొత్త నిబంధన ప్రభావం ఉండదు. అంటే, దుకాణంలో రూ.1,500 వస్తువును యూపీఐ ద్వారా కొంటే ఎలాంటి అదనపు రుసుము ఉండదు. అధిక విలువైన లావాదేవీలకే ఈ మార్పు వర్తిస్తుంది.




**ప్రభుత్వం ఏమంటోంది?..**

ఈ ఛార్జీల భారాన్ని పూర్తిగా వ్యాపారులే భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఒకవేళ వ్యాపారులు బిల్లులపై 'యూపీఐ ఛార్జీ' అని ప్రత్యేకంగా వేయడం ప్రారంభిస్తే, యూపీఐ ఇక ఉచితం కాదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఇది డిజిటల్ చెల్లింపుల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే, ఈ భారం వినియోగదారులపై పడకుండా చూసేందుకు పేమెంట్ అగ్రిగేటర్లు, బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

**నగదు వైపు వెళ్లనున్న ప్రజలు?..**

ఈ కొత్త ఛార్జీల వల్ల ప్రజలు మళ్లీ నగదు వాడకం వైపు మళ్లుతారని ప్రభుత్వం భావించడం లేదు. మొత్తం యూపీఐ లావాదేవీల పరిమాణంలో కేవలం 4 శాతం మాత్రమే ఈ కొత్త లెవీ పరిధిలోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌పీసీఐ గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో జరిగిన పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో 86 శాతం రూ.500 లోపువే కాగా, మరో 10 శాతం రూ.501 నుంచి రూ.2,000 మధ్య ఉన్నాయి. కాబట్టి సామాన్య ప్రజల రోజువారీ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదు. మరోవైపు, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై లావాదేవీ విలువతో సంబంధం లేకుండా ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం చేశారు. ఇది వ్యాపారులకు, వినియోగదారులకు మరో డిజిటల్ చెల్లింపు మార్గంగా అందుబాటులో ఉంటుంది.

**దేశవ్యాప్తంగా పెట్రోల్ పంప్ నిర్వాహకుల అభ్యంతరం..**

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూపీఐ) అక్టోబర్ 15 నుంచి అమలు చేయనున్న నూతన మర్చంట్ డిస్కౌంట్ రేట్ నిబంధనలపై దేశవ్యాప్తంగా పెట్రోల్ పంప్ నిర్వాహకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఫ్రేమ్వర్క్ ప్రకారం రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన ఇంధన యూపీఐ లావాదేవీలపై వ్యాపారుల నుంచి 0.4 శాతం ఎండీఆర్ చార్జీ వసూలు చేయనుండగా.. రూ. 2,000 లోపు లావాదేవీలకు ఎటువంటి చార్జీలు ఉండవు అని అన్నారు. అయితే, ఈ నిర్ణయంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్, ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. లీటరుకు తమకు వచ్చే కమిషన్ కేవలం రూ. 2.40 నుంచి రూ. 3.40 వరకు మాత్రమే ఉంటుందని... ఒక్కో పెద్ద లావాదేవీపై 0.4 శాతం చొప్పున ఎండీఆర్ చెల్లించాల్సి వస్తే పెట్రోల్ పంప్లపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని డీలర్లు పేర్కొంటున్నారు. ఇంధనం అత్యవసర సరుకు అయినందున పెట్రోల్ బంకులకు ఎండీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని... లేకపోతే అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 పైబడిన ఇంధన కొనుగోళ్లకు యూపీఐ డిజిటల్ చెల్లింపులను నిలిపివేసి, కేవలం నగదు రూపంలో మాత్రమే స్వీకరిస్తామని హెచ్చరించారు.

ఇదిలాఉంటే, కేంద్రం తీసుకున్న చర్యలతో ఘజియాబాద్‌లో పలువురు వ్యాపారులు యూపీఐకి నిరసన చేపట్టారు. తమ షాపుల ముందు యూపీఐ చెల్లింపులు స్వీకరించబడవు' అంటూ నోటీసులు అంటిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు పైబడిన ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయమే ఈ ఆందోళనకు కారణం అయ్యింది అవుతొంది కూడా.

## గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎఫ్డీసీ మాజీ చైర్మన్



గజ్వేల్, సెప్టెంబర్ 20(మనం న్యూస్): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు భారత్ నగర్లో సిరి అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి 108 లీటర్ల స్వచ్ఛమైన ఆవుపాలతో విశేష అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణలు భక్తిశ్రద్ధలతో చేపట్టి, అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిరి యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రతి ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎంతో నిష్టతో, కన్నులపండువగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భక్తిభావంతో పాటు సామాజిక దృక్పథంతో ఉత్సవాలు జరపడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు ముదిరాజ్, అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, బుక్క రమేష్, జిల్లా కళ్యాణ్ మాధవి దంపతులు, సహస్ర, నిఖిల, సిరి యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ గడ్డ గణేశుడిని దర్శించుకున్న కాట దంపతులు

భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డింపు

విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం



పటాన్ చెరు, సెప్టెంబర్ 20 (మనం న్యూస్): ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ గణేష్ దేవస్థానం (గణేష్ గడ్డ)లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, ఆయన సతీమణి, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆలయానికి చేరుకుని శ్రీ గణేష్ స్వామివారిని దర్శించుకున్నారు. కాట దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య కాట దంపతులకు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కాట శ్రీనివాస్ గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించారు.

**భక్తులకు అన్నధానం..**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నందిగామ సర్పంచ్ విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. అన్నదాన కార్యక్రమంలో కాట శ్రీనివాస్ గౌడ్, కాట సుధా శ్రీనివాస్ గౌడ్ దంపతులు స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రాకతో రుద్రారం గణేష్ గడ్డ సందడిగా మారింది.

## లక్ష్మీ ప్రసన్ననగర్ గాణనాధునికి చెప్పన్ బోగ్ నివేదన

రకరకాల పూలతో గణనాధుని అలంకారం

కుంకుమ పూజకు భారీగా తరలి వచ్చిన మహిళలు



గజ్వేల్, సెప్టెంబర్ 20 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీప్రసన్న నగర్ లో ఏర్పాటుచేసిన గణనాధుని మండపం వద్ద రకరకాల పూలతో గణనాధుని అలంకారాన్ని మహిళలు అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం నాడు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక లక్ష్మీ ప్రసన్న నగర్ కాలనీవాసులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

గత ఏడు రోజులుగా ప్రతిరోజు ఉదయం సాయంత్రం పూట జంటలచే ప్రత్యేక పూజా కార్యక్రమాలని నిర్వహిస్తూ భక్తిని కాలనీవాసులు చాటుకుంటున్నారు. మండపం వద్ద వివిధ రకాల ఆటలు పాటలతో పాటు భజన కార్యక్రమాలను నిర్వహిస్తూ అల్పాహారాన్ని భోజన సదుపాయాన్ని కూడా మండప నిర్వహకులు ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగానే ఆదివారం నాడు చెప్పన్ భోగ్ కార్యక్రమాన్ని నిర్వహించగా కాలనీలోని మహిళలందరూ ప్రతి ఒక్కరూ వివిధ రకాల ఫలహారాలను తీసుకొని వచ్చి గణనాధునికి సమర్పించడం జరిగింది అనంతరం మహిళలందరూ సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం కదలిక



తుమ్మల లేఖకు స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ • మంత్రి తుమ్మలకు ఫోన్ చేసి హామీ

పాండురంగాపురం-సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పనులు తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు

సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్కు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

పెనుబల్లి-కొండపల్లి (అమరావతి) కొత్త రైల్వే మార్గాన్ని మంజూరు చేయాలని కోరిన మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 20(మనం బ్యూరో): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఉమ్మడి ఖమ్మం ప్రాంత ప్రజల చిరకాల రైల్వే కల సాకారం దిశగా కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించింది. పాండురంగాపురం-సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు హామీ ఇచ్చారు. ఇటీవల మంత్రి తుమ్మల రాసిన లేఖకు స్పందించిన కేంద్ర మంత్రి ఫోన్లో మాట్లాడి, పెండింగ్లో ఉన్న రైల్వే అంశాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**భద్రాద్రి యాత్రికులకు మరింత సౌకర్యం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశవ్యాప్తంగా భక్తులు, యాత్రికులు వస్తుంటారని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. పాండురంగాపురం-సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పూర్తయితే భద్రాచలం వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి, యాత్రికుల సౌకర్యానికి ఈ రైల్వే మార్గం ఎంతో కీలకమని పేర్కొంటూ పనులను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన అశ్విని వైష్ణవ్ పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్కు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి**

సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్ ఇప్పటికే రైల్వే బడ్జెట్లో ప్రకటించబడినప్పటికీ, నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని మంత్రి తుమ్మల కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే సమయంలో కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రైల్వే లైన్ నిర్మాణం ఇప్పటికే చేపట్టిన విషయాన్ని మంత్రి తుమ్మల వివరించారు. కొత్తగూడెం-సత్తుపల్లి రైల్వే అనుసంధానం ఉన్న నేపథ్యంలో సత్తుపల్లి-కొవ్వూరు మార్గం పూర్తయితే ఈ ప్రాంతం మరింత విస్తృత రైల్వే నెట్వర్క్తో అనుసంధానమవుతుందని తెలిపారు.

**పెనుబల్లి-కొండపల్లి (అమరావతి) కొత్త రైల్వే మార్గానికి మంజూరు కోరిన మంత్రి తుమ్మల**

పెనుబల్లి నుంచి కొండపల్లి (అమరావతి) వరకు కొత్త రైల్వే మార్గాన్ని మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కేంద్ర రైల్వే మంత్రిని కోరారు. ఈ మార్గం ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం ప్రాంతం నుంచి అమరావతి వైపు ప్రయాణించే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. సత్తుపల్లి-కొవ్వూరు మార్గానికి నిధుల మంజూరు, పెనుబల్లి-కొండపల్లి (అమరావతి) కొత్త రైల్వే మార్గం మంజూరుకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను పంపిస్తామని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు.

**భద్రాద్రి-ఉమ్మడి ఖమ్మం ప్రాంత అభివృద్ధికి రైల్వే అనుసంధానం కీలకం**

పాండురంగాపురం-సాకేతపురి (సారపాక) రైల్వే లైన్ పనులు ప్రారంభం, సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్కు నిధుల మంజూరు, పెనుబల్లి-కొండపల్లి (అమరావతి) కొత్త రైల్వే మార్గానికి మంజూరు లభిస్తే భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి ఖమ్మం ప్రాంతాల రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.

యాత్రికులు, ప్రయాణికులతో పాటు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కూడా ఈ రైల్వే అనుసంధానాలు ప్రయోజనం చేకూర్చనున్నాయి.

మంత్రి తుమ్మల చేసిన విజ్ఞప్తులకు కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి ప్రత్యేక బృందాలను పంపిస్తామని, సంబంధిత అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం పట్ల ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# ఘనంగా నవరాత్రోత్సవాలు

3డి ఆర్ట్ మండపంలో కొలువై వెలసిన శ్రీ విఘ్నేశ్వరుడు

బహు అద్భుతం అనిపిస్తున్న బొజ్జ గణపయ్య మండపం



హైదరాబాద్, సెప్టెంబర్ 20(మనంన్యూస్): శ్రీ గణేష్ మహారాజ్ .. బొజ్జగణపయ్య.. భారత దేశంలో ఎలా కొలిచిన సిద్ధి , బుద్ధి ప్రసాదించే వరాలు ఇచ్చే దేవాది దేవుడు, గణపతి అంటె గణములకు అధిపతి, గణములకు ఈశుడు గణేశుడు, గణములు అంటె ప్రమథ గణములు,దేవతా గణములు, రాక్షసగణములు, సిద్ధ, సాధ్య,యక్ష , రాక్షస, దేవ, దానవ, మానవ, కిన్నెర, కింపురుష , మొదలగు సమస్త గణములకు అధిపతి మన 'గణపతి' !! సమస్త విఘ్నములకు అధిపతి.! అందుకే ఆయనను' విఘ్నేశ్వరుడు 'అని కూడా అంటారు. గూడెం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, గణనాథుని సన్నిధిలో భారీ ఆధ్యాత్మిక సందడి భక్త కోటి చూసి, ఇలాంటి యువకులు ఒకేతాటిపై ఒకేమాటపై ఉండి, ఈ ఆధ్యాత్మిక మహా ప్రసాద (అన్నదాన) కార్యక్రమం., ఇంత చక్కటి మండపం నిర్మించడం కనులకు చెదరని ఒక్క గొప్ప దివ్య మండపం ఇలా తయారు చేసారు. రుద్రా టీంకు నా శుభాభినందనలు తెలిపారు. శ్రీ గణనాధుని నవరాత్రి ఉత్సవాలు శ్రీ సాయి చందు ముదిరాజ్ ఆధ్వర్యంలో టీం రుద్రా యూత్ అసోసియేషన్ వారు 12 సం.పూర్తి చేసుకున్న శుభా సందర్భంగా నిర్వహకులు ఈసారి సొంతంగా మరియు అందరికి దృష్టి ఆకర్షించే విధముగా 3డి ఆర్ట్ మండపంలో కొలువై వెలసిన శ్రీ విఘ్నేశ్వరుడు. మండలంలో శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయంలోని ప్రతికాత్మిక చిహానలు ఇంకా పైకప్పు ఒక వైభవోపితమైన మండపాన్ని సృష్టించేలా రూపొందించబడ్డాయి. బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ , మాద్రి పృథ్వీరాజ్ పటాన్చెరు మాట్లాడుతూ, మనమందరం భారతీయులమే.. స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలందరినీ ఐక్యంగా ముందుకు నడిపించడంలో శ్రీ విగ్నేశ్వర పూజలు, గణేష్ ఉత్సవాలు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించాయి. మన సంస్క ృతి, సంప్రదాయాల ప్రకారం ఏ శుభకార్యమైనా విఘ్నేశ్వరుడి పూజతోనే మొదలవుతుంది. నాటి స్వాతంత్ర్య ఉద్యమ కాలం నాటి ఐక్యమత్యం మరియు దేశభక్తి అనే దిక్సూచి నేటికీ కొనసాగేలా, యువత అంతా ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని కోరుతున్నారు.గణేష్ శోభాయాత్ర మరియు నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం, పోలీస్ శాఖ, మరియు ఎఎఇ సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని గణపయ్య స్వాములు, ఉత్సవ కమిటీ అసోసియేషన్ సభ్యులు కోరారు. అలాగే, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొనేరులలోనే (బేబీ పాండ్స్) విగ్రహాలను నిమజ్జనం చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. పట్లోళ్ల ఆదిత్య రెడ్డి , తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్, సంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యులు బిజెపి మహిళా మోర్చా సీనియర్ నాయకులు కే సుజాత, కొలుకూరు రాజశేఖర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఐఎన్టీయూసీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పటాన్ చేరు పట్టన కాంగ్రెస్ కమిటీ నాయకులూ, కోల్కురి నర్సింహా రెడ్డి , ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శ్రీ జలగరి ఎట్టయ్య (ఏటయ్య) ముదిరాజ్, చట్ల. శివ కుమార్ ముదిరాజ్ పి ఆర్ మీడియా సంచాలకులు, సీనియర్ నాయకులు రవి మహారాజ్, గౌతంనగర్ బిజెపి బూత్ అధ్యక్షులు కుందన్ ముదిరాజ్,

కొర్వి . సాయి చందు ముధిరాజ్, టీమ్ రుద్ర యూత్ అసోసియేషన్, పటాన్చెరు అధ్యక్షులు.. మరియు 30 మంది గణేశుని భక్తులు (ఊటజ్చీఛీట) ఇందులో అందరూ ఉన్నారు వారు వీలు కాదు మనం అందరమూ ఒకటే అన్నారు సాయి.. స్వతంత్ర కాలంలో ఎలా ఉండాలో వీరిని చూసి నేర్చుకోవాలి 12.సం బంధం జై భోలో గణేష్ మహారాజ్ కి జై అనే బంధం అదే నినాదం.. ఈ ఆధ్యాత్మిక మహా ప్రసాద (అన్నదాన) కార్యక్రమంలో హైదరాబాద్ యువ పెన్సిల్ ఆర్టిస్ట్ చిట్ల కార్తీక్ ముదిరాజ్, చందు ముధిరాజ్, మని, ముఖేష్ ముధిరాజ్ , రిషి కుమార్ ముధిరాజ్ , సాయి కుమార్ ముధిరాజ్ , సన్నీ కుమార్ , టప్పా విశాల్ ముదిరాజ్, ప్రవీణ్, తదితరులు పాలుగోన్నారు.

## హంటర్ హిల్స్లో ఘనంగా గణపతి హోమం

31వ డివిజన్లో భక్తిశ్రద్ధలతో పూజలు



హైదరాబాద్, సెప్టెంబర్ 20(మనంన్యూస్): 31వ డివిజన్ హంటర్ హిల్స్ ఆదివారం గణపతి హోమం కమిటీ ఆధ్వర్యంలో గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహం కోసం, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సంకల్పంతో ఈ హోమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి మాధవి రమేష్, చల్ల ఉమా హన్మంత్, లాకావత్ సంధ్య కర్ణాకర్, గాయపు విజయ లింగా రెడ్డి, ఏర్పాటి స్రవంతి దిలీప్ కుమార్ ,బాధవత్ సరిత బాలాజీ, లకావత్ రజిత నరేష్, వంకుడోత్ స్వరూప అమిత్ షా దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి సేవలో కంజర్ల కృష్ణమూర్తి



**వినాయకులను దర్శించుకుని ప్రత్యేక పూజలు**

**గణేష్ మండపాలకు కృష్ణమూర్తి విరాళాల వెల్లువ**

**పూజలు, అన్నదాన కార్యక్రమాలకు ఆర్థిక సహాయం**

రామచంద్రాపురం, సెప్టెంబర్ 20 (మనం న్యూస్) : వినాయక నవరాత్రి ఉత్సవాలు భారతి నగర్ డివిజన్ పరిధిలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బీజేపీ సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్, కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ చైర్మన్ కంజర్ల కృష్ణమూర్తి వివిధ వినాయక మండపాలను సందర్శించి గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలకు విరాళాలను అందజేశారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్ ఎంఐజీ కాలనీలో మహదేవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కంజర్ల కృష్ణమూర్తి సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు చేపడుతున్న అన్నప్రసాద కార్యక్రమానికి విరాళం అందజేశారు.

అదే కాలనీలో దాసాంజనేయ స్వామి ఆలయం సమీపంలో వానరసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన కృష్ణమూర్తి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల నిర్వహణకు తనవంతుగా విరాళాన్ని అందించారు. అనంతరం భారతి నగర్ డివిజన్లో నవజ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కూడా కృష్ణమూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఓల్ ఎంఐజీ కాలనీలో నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చేపడుతున్న అన్నదాన కార్యక్రమానికి విరాళం అందించారు.

అలాగే భారతి నగర్ ఓల్ ఎంఐజీ కాలనీలోని శ్రీశ్రీ నల్లపోచమ్మ తల్లి, శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో కల్వర్ కింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కృష్ణమూర్తి దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం యువసేన సభ్యులు నిర్వహించనున్న అన్నసమారాధన కార్యక్రమానికి విరాళాన్ని అందజేశారు.

**గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి..**

**కంజర్ల కృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్ కృష్ణమూర్తి**

విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలనికంజర్ల కృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్ కంజర్ల కృష్ణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాల్లో సునంద కృష్ణమూర్తి, రాజేందర్ చారి, సుజాత, సాయి వెంకట హర్షా చారి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## నందిగామలో గ్రామకంఠానికి ఎసరు!

- దర్జాగా అక్రమ నిర్మాణాలు
- నందిగామలో గ్రామకంఠం భూమిలో నాలుగు అంతస్తుల భారీ నిర్మాణాలు
- ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు సాగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు





సంగారెడ్డి , సెప్టెంబర్ 20 మనం ప్రతినిధి : కబ్జాకు కాదేది కనర్హం అన్నట్టుగా ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్ను పడుతోంది. అది గ్రామకంఠం అయినా.. శిఖం అయినా.. పోరంబోకు అయినా.. అసైన్డ్ భూమి అయినా.. ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేసేయడమే అన్నట్టుగా వ్యవహారం సాగుతోంది. అధికార, అంగబలం ఉంటే ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం మరింత అలవోకగా మారిందనే పరిస్థితి కనిపిస్తోంది. పటాన్చెరు మండల పరిధిలోని నందిగామ గ్రామపంచాయతీలో ప్రభుత్వ భూమిలో భారీ నిర్మాణాలు దర్జాగా కొనసాగుతున్నాయి. గ్రామపంచాయతీకి సమీపంలోని ఉన్న గ్రామకంఠం భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు చేపట్టారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు భవనాలను నాలుగు అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం కళ్లుమూసుకుని కూర్చున్నట్టుగా చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు జరుగుతున్న విషయం అధికారుల దృష్టికి రాలేదా? లేక తెలిసినా పట్టించుకోవడం లేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**నాలుగు అంతస్తుల నిర్మాణాలు కనిపించవా?**

సాధారణంగా అనుమతి లేకుండా చిన్న నిర్మాణం చేపట్టినా నోటీసులు ఇచ్చే పంచాయతీ అధికారులు.. ఇక్కడ మాత్రం ఏకంగా నాలుగు భవనాలు నాలుగు అంతస్తుల వరకు నిర్మిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణాలు దర్జాగా సాగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో ఈ వ్యవహారం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమిలో ఇంత పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఎవరు ఇచ్చారు? పంచాయతీ రికార్డుల్లో ఈ భూమి వివరాలు ఏమిటి? నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? లేక అధికారుల కనుసన్నల్లోనే పనులు కొనసాగుతున్నాయా? అనే విషయాలు తేలాల్సి ఉంది.

**జిల్లా అధికారులు వెంటనే స్పందించాలి**

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు తమ కళ్ల ముందే భారీ నిర్మాణాలు జరుగుతున్నా మౌనం వహించడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని పరిశీలించి, భూమి వివరాలు, నిర్మాణ అనుమతులు, నిర్మాణదారుల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు తమ కళ్ల ముందే భారీ నిర్మాణాలు జరుగుతున్నా మౌనం వహించడం పట్ల గ్రామస్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నందిగామలోని గ్రామకంఠం భూములను పరిశీలించి, వాటిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు, స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# విన్ విజన్ కంటి హాస్పిటల్‌ని ప్రారంభించిన మంత్రి తుమ్మల



- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి

ఖమ్మం, సెప్టెంబర్ 20 (మనం న్యూస్): ఖమ్మం పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన విన్ విజన్ కంటి హా స్పిటల్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హాస్పిటల్ మేనేజ్మెంట్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఖమ్మం జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని కోరారు. ఈ ప్రారంభోత్సవం లో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి, నాగళ్ళ దీపక్ చౌదరి తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# బస్టాండ్లో స్వచ్ఛ భారత్



- ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్

ఖమ్మం, సెప్టెంబర్ 20(మనం న్యూస్): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ ఆదివారం సుడిగాలి పర్యటన చేపట్టారు . జిల్లా అధ్యక్షులు బండ్ల రీగన్ ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించిన ఈ పర్యటనలో ఆయన పలు సేవా , రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు . తొలుత ఖమ్మం నగరంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా పాత బస్టాండ్లో స్వచ్ఛ భారత్ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు . అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది . పార్టీ సంస్థాగత బలోపేతం , కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు . అనంతరం నూతన పదాధికారులకు అధికారిక నియామక పత్రాలను అందజేశారు . సమావేశంలో జిల్లా అధ్యక్షులు బండ్ల రీగన్ ప్రతాప్ ప్రసంగిస్తూ.. దశాబ్దాలుగా దళితులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న రాజకీయ శక్తులకు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు . అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి బీజేపీయే అసలైన వేదికని పేర్కొన్నారు . రానున్న రోజుల్లో మధిర , సత్తుపల్లి నియోజకవర్గాల్లో బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పనిచేస్తామని , క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేసి దళితవాడల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు , కార్యాలయ కార్యదర్శి విష్ణు , ఉపాధ్యక్షులు బోయల వెంకట్ , రాష్ట్ర అధికార ప్రతినిధి స్వర్ణఖర్ , ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సుదర్శన్ , ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రతాప్ , రాకేష్ బాబుతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు .

# నేటి ప్రజావాణి రద్దు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశం నేపథ్యంలో నిర్ణయం
- రేపు ప్రజావాణికి ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావొద్దు: జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 20 (మనంప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మరియు ఐదుగురు సభ్యుల బృందం ఈ నెల 21న జిల్లాలో పర్యటించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీలు, భూ సమస్యలు, ఆర్ఓఆర్ అమలు తదితర అంశాలపై జిల్లా అధికార యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, ప్రతి సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రేపు (సోమవారం) రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు.

కమిషన్ సమీక్ష సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు . కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి, రేపు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.

# లంబోదరునికి ప్రత్యేక పూజలు

## పూజల్లో పాల్గొన్న ఆర్ జె సి కృష్ణ, నామవరపు ఈశ్వర్



ఖమ్మం, సెప్టెంబర్ 20 ( మనం న్యూస్): స్థానిక జహీర్పుర ఎస్సీ కాలనీలోని రేషన్ షాపు వద్ద లంబోదర యూత్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఎస్బిఐటి, ఆర్ జె సి విద్యాసంస్థల చైర్మన్ ఆర్ జె సి కృష్ణ లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువ నాయకులు నామవరపు ఈశ్వర్, నామవరపు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజ కార్యక్రమానికి ఆర్ జె సి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గణనాథుడికి ధూప దీప నైవేద్యాలతో, హారతులతో పూజలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళా భక్తులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆర్ జె సి కృష్ణ మాట్లాడుతూ గణేష్ వేడుకలు ప్రజల్లో ఐకమత్యాన్ని , సహకార గుణాన్ని పెంపొందిస్తున్నాయ ని తెలిపారు. నామవరపు ఈశ్వర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల స్ఫూర్తితో యువత సమైక్యతతో ఉండి తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు నామవరపు సతీష్, పి నాగరాజు, పోటు శరత్, బత్తుల మురళి, కనకం వీరభద్రం, మాటేటి కిరణ్, రాఘవరపు ప్రసాద్, సత్యనారాయణ, వడ్లమూడి రవి, మానుకొండ చంద్రకాంత్, భరత్, సంపత్, గాదె రవి, ముతేష్, అనిల్ , ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మన్యం మసులుతోంది..

# విజృంభిస్తున్న విషజ్వరాలు



- ప్రతి ఇంటిలోనూ జ్వర పీడితులే
- కిటకిటలాడుతున్న వైద్యశాలలు
- డెంగ్యూ, మలేరియాతో గజ గజ
- రోజుకు 200 లకు పైగా ఓపి
- అందులో 50 మంది వరకు జ్వరపీడితులే

చర్ల, సెప్టెంబర్ 20 (మనం న్యూస్): మన్యం మసులుతోంది..వాతావరణ పరిస్థితుల కారణంగా మండల వ్యాపితంగా సీజనల్ వ్యాదులు పడగ విప్పాయి. చర్ల పట్టణంతో పాటు ఆదివాసీ పల్లెల్లో విషజ్వరాలు విజృంబిస్తున్నాయి. ఏ ఇంట చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు గ్రామాలు చిత్తడిగా మారడంతో సీజనల్ వ్యాదులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ప్రజలను రోగాలబారి నుండి కాపాడాల్సిన వైద్యశాఖ వైద్యులు లేకుండానే అరా కొరాగా వైద్యశిభిరాలను నిర్వహించి చేతులు దులుపుకోగా నిదులు ఉన్నా పారిశుధ్య పనులు చేపట్టక గ్రామ పంచాయతీలు చేతులెత్తేసాయి. ఈ నేపథ్యంలో చర్ల మండల ప్రజలు విష జ్వరాలకు విలవిలలాడుతున్నారు.

చర్ల మండల మన్యం మంచమెక్కింది. ఏ ఇంట చూసినా జ్వరంతో సలసలా వల్లు మసలే రోగులే కనిపిస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు కొయ్యూరు, సత్యనారాయణపురం గ్రామాలలో ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆయా వైద్య శాలల పరిదిలో రోజు రోజుకు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. అనేక గిరిజన పల్లెలు మంచ మెక్కాయి. ఏ ఇంట చూసినా జ్వరంతో మూలుగుతున్న వారే దర్శనమిస్తున్నారు. జ్వర పీడితులతో అయా వైద్యశాలలు కిటకిట లాడుతున్నాయి. చర్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రంకు జ్వర పీడితుల తాకిడి ఎక్కువగా ఉండగా మరి కొంతమంది బ్రతుకు జీవుడా అంటూ భద్రాచలంలోని ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రంకు ప్రతిరోజూ 200 మందికి పైగా రోగులు వస్తుండటంతో వైద్యశాల కిటకిటలాడుతోంది. ఇందులో 30 నుండి 50 మంది వరకు జ్వరపీడితులే ఉంటున్నారు. వీటిలో ప్రతి రోజు ఏడు ఎనిమిది మంది మలేరియా డెంగ్యూ లక్షణాలతో బాదపడే వారే ఉంటున్నారు. మిగిలిన రోగులలో ఎక్కువగా వల్లు నొప్పులు, జలుబు, దగ్గుతో బాదపడుతున్న

వారు ఉంటున్నారు. జ్వరపీడితులకు మెరుగైన వైద్యం అందచేస్తుండటంతో పాటు 24 గంటలూ అర్హులయిన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటంతో రోగులు సి హెచ్ సి కు క్యూకడుతున్నారు. వైద్యశాలలోని బెడ్లన్ని రోగులతో నిండిపోయారు. సి హెచ్ ని వైద్యులు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ సాయివర్ధన్, డాక్టర్ సంకీర్త్, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ జాన్, డాక్టర్ తిరుపతి లు రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తుండటంతో ఎక్కువ మంది రోగులు ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలకు వెల్లకుండా నేరుగా సామాజిక ఆరోగ్య కేంద్రంకు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఎంతటి జ్వరమైనా దైర్యంతో చికిత్స అంచేస్తుండటంతో వైద్యశాల ఆదరణ పొందుతోంది. దీంతో వైద్యశాల రోగులతో కిటకిటలాడుతోంది. వైద్యశాలలోని బెడ్లన్నీ జ్వరపీడితులతో నిండిపోయాయి. మరో వైపు కొయ్యూరు, సత్యనారాయణపురం ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలు సైతం రోగులతో కిటకిటలాడుతున్నారు. ప్రతి రోజు దాదాపు 50 వరకు ఓపి వస్తుండగా ఇందులో 10 నుండి వరకు జ్వరపేడితులు ఉంటున్నారు. క్షేత్రస్థాయిలో సీజనల్ వ్యాదులకు అరికట్టాల్సిన ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలు చేతులెత్తేసాయి. మలేరియా ప్రభావిత గ్రామాలలో దోమలమంది పిచకారి చేయాల్సి ఉండగా ఈ ఏడాది దోమల మందు పిచకారి చేసిన దాఖలాలు లేవు. ఎప్పటికప్పుడు ర్యాపిడ్ ఫీవర్ సర్వేలు చేపట్టి జ్వరాలను అదుపులోకి తేవాల్సి ఉండగా ఇంత వరకు ఫీవర్ సర్వేలను చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. ఆయా వైద్య శాలల వరిదిలో విస్తృతంగా వైద్య శిబిరాలను నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు నామ మాత్రపు వైద్యశిభిరాలను నిర్వహించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. వైద్యులు లేకుండా క్రింది స్దాయి సిబ్బందితో అరాకొరాగా వైద్య శిభిరాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో రోగాల పరిస్దితిని వెలుగులోకి తీసుకువచ్చి వైద్యశాఖను అప్రమత్తం చేసే ప్రయత్నం చేస్తున్న 'పాత్రికేయులపై' కొంతమంది వైద్యులు, సిబ్బంది ఎదురుదాడికి దిగే యత్నం చేస్తున్నారు. జ్వరాలు విజృంబిస్తున్న వేళ వైద్య శిభిరాలను నిర్వహించి పరిస్దితిని చక్కదిద్దాల్సిన వైద్యశాఖ నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలు చిత్తడిగా మారడంతో పారిశుధ్యం లోపించి దోమల సంచారం పెరిగింది. ఫలితంగా జ్వరాలు ప్రభలుతున్నాయి. చర్ల పట్టణంతో పాటు గ్రామాలలో కనీసం బ్లీచింగ్ సైతం చల్లించడం లేదంటే పరిస్దితి ఎంత దారుణంగా మారిందో అర్దం చేసుకోవచ్చు. ఇప్పటికయినా వైద్యఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పని చేసి పారిశుధ్య చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

### వాతావరణ మార్పులతోనే జ్వరతీవ్రత పెరిగింది

**డాక్టర్ సాయివర్దన్.. సి హెచ్ సి సూపరింటెండెంట్, చర్ల**

వాతావరణం మార్పుల కారణంగా జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రతిరోజూ 200 లకు పైగా ఓపి వస్తుండగా ఇందులో 30 నుండి 50 వరకు జ్వరపీడితులే ఉంటున్నారు. వైద్యశాలలో అన్ని రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. రోగులు గ్రామీణ వైద్యులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని కోరారు.

# సింగరేణి గనుల వద్ద సేఫ్టీ ప్రమాణాలను బలోపేతం చేయాలి



- అధికారులకు డైరెక్టర్ వెంకటేశ్వర్లు సూచన
- ఆర్ సి హెచ్ పి, పివికే బంకర్ల పరిశీలన

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 20(మనం న్యూస్): సింగరేణిలో సేఫ్టీ ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని సింగరేణి డైరెక్టర్ కే.వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన కొత్తగూడెం ఏరియాలోని ఆర్ సి హెచ్ పి, పివికే బంకర్లను రైల్వే లోడింగ్ ఏరియాను సందర్శించి అధికారులతో మాట్లాడారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ముందస్తు భద్రతా చర్యలు చేపడుతూ సేఫ్టీ ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.అలాగే నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి డిస్పాచ్ లక్ష్యాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఓబిఆర్ పనితీరును మెరుగుపరచడం ద్వారా భవిష్యత్ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డిస్పాచ్ కార్యకలాపాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి సత్వర పరిష్కారాలు చూపాలని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్పత్తి ఉత్పాదకతను పెంపొందించడంతో పాటు భద్రతకు పెద్దపీట వేయాలని డైరెక్టర్ పిపీ సూచించారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తో పాటు ఏరియా జనరల్ మేనేజర్ వెంకట రమణ, అధికారులు గోవింద రావు, రామకృష్ణ, లింగా తదితరులు పాల్గొన్నారు.

## డా. జగదీష్ మృతి వైద్యరంగానికి తీరని లోటు

- మాజీ ఎంపీ నామ



ఖమ్మ, సెప్టెంబర్ 20(మనంన్యూస్): ప్రముఖ న్యూరో సర్జన్ డా. కే. జగదీష్బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. ఎంతోమంది ప్రాణాలను కాపాడి, రోగులకు భరోసా కల్పించిన డా. జగదీష్ ఆకస్మిక మరణం వైద్యరంగానికి, సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ డా. జగదీష్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## రూ.87 లక్షల సీఎంఆర్ఎఫ్

# చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు అందజేసిన పార్లమెంట్ సభ్యులు రామసహాయం



ఖమ్మం, సెప్టెంబర్ 20 (మనం న్యూస్): పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఖమ్మంలోని ఘట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి హాజరై.. లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) చెక్కులను పంపిణీ చేశారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన..220మందికి రూ.87 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా.. కాంగ్రెస్ నేతలు మద్దినేని స్వర్ణకుమారి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పార్టీ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేయాలి

## ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేజెండ్ల సాయి కుమార్



ఖమ్మం, సెప్టెంబర్ 20 (మనం న్యూస్): యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేయాలని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం లో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ యువజన కాంగ్రెస్ ఇన్చార్జి ఖలీద్ అహ్మద్, జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం అర్బన్ డీసీసీ అధ్యక్షులు నాగెండ్ల దీపక్ చౌదరి, ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్చార్జి వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, యువతను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, రాబోయే కార్యక్రమాలపై కార్యవర్గ సభ్యులతో చర్చించారు. యువత సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అంజనీ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్, బెజ్జం బాలగంగాధర్, బానోత్ కోటేష్, ఆదర్శ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బెల్లంకొండ శరత్, బిచ్చల అన్వేష్, బాలరాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు అంబటి ఈశ్వర్, జంగం రాజేష్, సన్నీ యాదవ్, కిట్టు మరియు మండల అధ్యక్షులు ముత్తారావు, జనప్రియ కుమార్, నిమ్మల నాగేశ్వరరావు, దొడ్డ వేణు, యడవల్లి నాగరాజు, దుడిమెట్ల వెంకట్ మరియు కూన వీరారెడ్డి, హృదయ్ కిరణ్, బెల్లం సాయితేజ, యడ్లపల్లి తరుణ్, సందీప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితర యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి డీసీసీ ఎంపికలో తోట లక్ష్మీకాంతరావు ముద్ర

- అధిష్ఠానంతో సమన్వయం.. పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డికి కీలక బాధ్యత
- ఉమ్మడి మెదక్ రాజకీయాల్లో పెరుగుతున్న తోట ప్రభావంపై చర్చ
- సీనియర్ల ప్రశంసలు, రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్

కామారెడ్డి, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి ఎంపికలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తనదైన రాజకీయ ముద్ర వేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో వ్యూహాత్మకంగా చక్రం తిప్పి తన వారికి కీలక పదవి దక్కేలా చేయడంలో ఆయన చూపిన రాజకీయ చతురత ఇప్పుడు పార్టీ వర్గాల్లోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది.

### అటు ఏఐసీసీ.. ఇటు టీపీసీసీలో చక్రం తిప్పిన వైనం

సంగారెడ్డి డీసీసీ అధ్యక్ష పదవి విషయంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు అత్యంత చాకచక్యంగా అడుగులు వేశారు. ఢిల్లీ స్థాయిలో ఏఐసీసీ అగ్రనేతలతో పాటు, రాష్ట్రంలో టీపీసీసీ నాయకత్వంతోనూ పకడ్బందీగా సంప్రదింపులు జరిపి తనదైన శైలిలో పంతం నెగ్గించుకున్నారు. పార్టీ కోసం కష్టపడే తన వారికి, అనుచరులకు పదవులు ఇప్పించడంలో తాను 'దిట్ట' అని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

### సీనియర్ నాయకుల ప్రశంసలు...

ఈ ఎంపిక ప్రక్రియలో అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ, ఎవరికీ ఇబ్బంది కలగకుండా తన వ్యూహాన్ని అమలు పరిచిన తీరుపై పార్టీలోని సీనియర్ నాయకులు సైతం ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఒకవైపు అధిష్ఠానం వద్ద పట్టు సాధిస్తూనే, మరోవైపు సీనియర్ల ఆమోదాన్ని, ప్రశంసలను పొందేలా వ్యవహరించడం ఆయన సమర్థ నాయకత్వానికి నిదర్శనమని పార్టీ నేతలు కొనియాడుతున్నారు.

### తెలంగాణ కాంగ్రెస్లో 'లక్ష్మీకాంతరావు' మార్క్ పాలిటిక్స్

తక్కువ కాలంలోనే అధిష్ఠానం వద్ద తిరుగులేని నమ్మకాన్ని సంపాదించుకుని, జిల్లా సరిహద్దులు దాటి పక్క జిల్లా రాజకీయాల్లోనూ ఇంతటి బలమైన ముద్ర వేయడం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమైంది. సీనియర్ల మన్ననలు పొందుతూ ముందడుగు వేస్తున్న ఈ 'యువ నేత' ఎత్తుగడలు, రాజకీయ చతురత భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలక పాత్ర పోషించనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## హనుమంత వాహనంపై
# శ్రీమలయప్ప

**రామభక్త హనుమంతునిపై భక్తులను కటాక్షించిన శ్రీమలయప్ప**



**తిరుమల, సెప్టెంబరు 20 మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన ఆదివారం ఉదయం శ్రీమలయప్పస్వామివారు కోదండరాముని అలంకారంలో హనుమంత వాహనంపై భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.వాహనం ముందు గజరాజులు గంభీరంగా నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ హనుమంత వాహనసేవ భక్తి పారవశ్యంతో వైభవంగా సాగింది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ గోవిందా... గోవిందా... అంటూ స్వామివారిని దర్శించుకున్నారు.

**హనుమంత వాహనం – భగవద్భక్తికి ప్రతీక...**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు ఉదయం శేషాచలాధీశుడు శ్రీరామావతారంలో తన పరమభక్తుడైన హనుమంతునిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులలో అగ్రగణ్యుడైన హనుమంతుడు భగవంతునిపై అచంచలమైన భక్తి, సేవాభావం, శరణాగతికి ప్రతిరూపంగా నిలుస్తాడు. గురుశిష్యులైన శ్రీరాముడు, హనుమంతుల దివ్యసంబంధం భక్తి, జ్ఞానం, సేవాతత్వాల సమన్వయాన్ని చాటిచెబుతుంది. హనుమంత వాహనంపై కోదండరాముని దర్శించుకోవడం ద్వారా భక్తులకు భగవద్భక్తి, ధర్మనిష్ఠ, శరణాగతి భావాలు మరింతగా పెంపొందుతాయని ఆధ్యాత్మిక విశ్వాసం. ఈ వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా పురవీధుల్లో గణనాథుల శోభాయాత్ర

**హెలికాప్టర్‌తో పుష్పవర్షం.. డీజేలకు స్టెప్పులేసిన భక్తులు**

**గరిడి గణపతికి 50 ఏళ్లు పూర్తి.. ఎన్టీఆర్ సర్కిల్లో కనువిందు చేసిన పుష్పాభిషేకం**

**హిందూపురం, సెప్టెంబర్ 20 (మనం న్యూస్):** హిందూపురం పట్టణంలో గణేష్ నిమజ్జన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులు ఆదివారం తమ మండపాల నుంచి నిమజ్జనానికి తరలివెళ్లాయి. పట్టణంలోని ప్రధాన రహదారులు, పురవీధులు గణనాథుల శోభాయాత్రలతో సందడిగా మారాయి. వివిధ ఆకారాలు, ప్రత్యేక అలంకరణలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఊరేగింపుగా నిమజ్జన కేంద్రాల వైపు కదిలాయి.

**గడ్డం కోనేరు వద్ద గంగాపూజ...**

నిమజ్జనానికి తరలివచ్చిన గణనాథులకు గడ్డం కోనేరు వద్ద ప్రత్యేక గంగాపూజ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య పాల్గొన్నారు. గంగాపూజ అనంతరం గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

**డీజేలకు స్టెప్పులేసిన భక్తులు...**

గణేష్ శోభాయాత్రలో యువతతో పాటు మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే సంగీతం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పురవీధులు సందడిగా మారాయి. గణనాథుల ముందు భక్తులు నృత్యాలు చేస్తూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. శోభాయాత్రను తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి, కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

**గరిడి గణపతికి 50 ఏళ్లు.. హెలికాప్టర్తో పుష్పవర్షం..**

హిందూపురం రైల్వే రోడ్డులో ప్రతిష్ఠించిన గరిడి గణపతి ఉత్సవాలకు ఈ ఏడాది ప్రత్యేకత సంతరించుకుంది. గరిడి గణపతి ప్రతిష్ఠకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గణనాథుడిపై హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించారు. ఆకాశం నుంచి పూల వర్షం కురుస్తున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎన్టీఆర్ సర్కిల్ పరిసర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, భక్తులు చేరుకుని తిలకించారు.

**వివిధ రూపాల్లో గణనాథులు...**

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ఆకారాలు, విభిన్న అలంకరణలతో ఏర్పాటు చేసిన గణనాథులు శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒక్కో మండపం నుంచి బయలుదేరిన గణనాథులతో హిందూపురం పురవీధులు గణేష్ నామస్మరణతో మార్మోగాయి.

## అక్టోబర్ 25న విద్యుత్ ఉద్యోగుల డిస్కాం మహాసభలు

**కందారపు మురళి ఛైర్మన్ గా 108 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు**



**తిరుపతి, సెప్టెంబర్ 20 మనం న్యూస్:** యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఏపీ ఎస్పీడీసీఎల్ 8వ డిస్కం మహాసభలను అక్టోబర్ 25న తిరుపతిలో నిర్వహించనున్నట్లు యూనియన్ డిస్కం అధ్యక్షుడు ఎన్. శివశంకర్ ప్రకటించారు.మహాసభల నిర్వహణ కోసం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి ఛైర్మన్గా మొత్తం 108 మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఆహ్వాన సంఘ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఆహ్వాన సంఘ చీఫ్ అడ్వైసరు గా దుగ్గిరాల సూరిబాబు,పి. సుదర్శన్రెడ్డి, చీఫ్ కన్వీనర్గా ఎన్. శివశంకర్, వైస్ ఛైర్మన్గా ఎస్. జాకీర్ హుస్సేన్, కన్వీనర్లుగా బి. నాయనప్రసాద్, వి. శివప్రసాద్, పెంచల్ ప్రసాద్, కో-ఛైర్మన్గా హజరత్ నాయుడు, కో-కన్వీనర్గా డిస్కం ఉపాధ్యక్షుడు పి. సుప్రసాద్రెడ్డితోపాటు పలువురిని చీఫ్ ప్యాట్రన్లు, ఇతర బాధ్యులుగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పర్మనెంట్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ తదితర విధానాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

## చోరీలకు పాల్పడే ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను
# అరెస్ట్ చేసిన కల్లూరు పోలీసులు

**రూ.90 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, 03 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.**

**నాలుగు వరుస చోరీ కేసులను ఛేదించిన పోలీసులు**

**ఏ-1 ముద్దాయి ఆర్. దినేష్ పై మొత్తం 18 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.**




**చిత్తూరు సెప్టెంబరు 20 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ప్రజల ఆస్తి, ప్రాణాల రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస చోరీ కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.90 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కల్లూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు క్రైమ్ పార్టీ బృందాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ప్రత్యేకంగా అభినందించారు. కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుంగనూరు రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణ జ్యువెలరీస్ దుకాణంలో జులై 17,2026 రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపు తాళాలు పగులగొట్టి సుమారు 314 గ్రాముల బంగారం మరియు 20 కిలోల వెండి ఆభరణాలను అపహరించారు.

ఈ ఘటనపై కల్లూరు పోలీస్ స్టేషన్లో క్రైం నెం.74/2026 అండర్/ సెక్షన్331(4), 305(బి) బిఎన్స్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు, చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ జె. వెంకట నారాయణ పర్యవేక్షణలో, కల్లూరు సీఐ ఎం. జయరామయ్య, ఎస్ఐ యు. వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ దేవరాజులు రెడ్డి, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, మానవ నిఘా మరియు ఇతర ఆధారాలను ఉపయోగించి నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టాయి,ఈ క్రమంలో సెప్టెంబరు19,2026న అందిన విశ్వసనీయ సమాచారంతో పాలసముద్రం మండలం, వెంగలరాజకుప్పం పంచాయతీ పరిధిలోని దీనబంధాపురం గ్రామ సమీపంలో ఐదుగురు నిందితులను సాయంత్రం 4.00 గంటలకు పోలీసులు అరెస్ట్ చేశారు.జయలక్ష్మిపురం గ్రామం, పాలసముద్రం మండలం - క్రైం నెం.17/2026,నెల్లేపల్లి గ్రామం, గంగాధర నెల్లూరు మండలం -క్రైం.నెం.65/2026, దిగువమాఘం గ్రామం, తవనంపల్లె మండలం క్రైం.నెం.57/2026,శ్రీ కృష్ణ జ్యువెలరీస్, కల్లూరు -క్రైం నెం.74/2026,విచారణలో నిందితులు పై నాలుగు చోరీ కేసులకు పాల్పడినట్లు వెల్లడైంది.దొంగిలించిన బంగారం, వెండి వస్తువుల్లో కొంత భాగాన్ని వేలూరు, చెన్నై ప్రాంతాల్లో విక్రయించి, వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలు మరియు విలాసాలకు ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైంది. బంగారు ఆభరణాలు - సుమారు 404 గ్రాములు,వెండి వస్తువులు - సుమారు 17 కిలోలు, ద్విచక్ర వాహనాలు - 03,మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ - ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.90 లక్షలు,ఏ-1: ఆర్. దినేష్ (25), తండ్రి: రవి, కనికాపురం హెచ్డబ్ల్యూ కాలనీ, వి.ఆర్. కుప్పం పోస్టు, పాలసముద్రం మండలం, చిత్తూరు జిల్లా.

ఇతనిపై మొత్తం 18 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.ఏ-2: బాలయ్య చిరంజీవి (34), తండ్రి: బాలయ్య, కొండపురం గ్రామం, అమ్మనేరి పోస్టు, తిరుత్తణి తాలూకా, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు.

ఇతనిపై మొత్తం 4 కేసులు నమోదై ఉండగా, వాటిలో తిరుపతి జిల్లా పుత్తూరు పోలీస్ స్టేషన్ క్రైం.నెం.209/2023 హత్య కేసు కూడా ఉంది. ఏ-3: ఎస్.యు. జగన్ బెరికి (19),తండ్రి ఉమాపతి, శ్రీకృష్ణపురం, ఆర్కే పేట పోస్ట్, పల్లిపట్టు తాలూకా, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు.ఏ-4: ఎస్. వసంత్ కుమార్ తుపాకి (19), తండ్రి సంజీవి, ఆర్కే పేట, పల్లిపట్టు తాలూకా, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు.

ఏ-5: డి. సిలంబరసన్ శింబు (19),తండ్రి ధర్మయ్య, ఇందిరా నగర్, విఆర్ కుప్పం పోస్ట్, పాలసముద్రం మండలం, చిత్తూరు జిల్లా.నిందితులను వేగంగా గుర్తించి, అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేయడంతో పాటు వరుస చోరీ కేసులను ఛేదించి భారీ మొత్తంలో చోరీ సొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కల్లూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, క్రైమ్ పార్టీ బృందాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడె ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రజల భద్రత, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

# మెకానికులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- **చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**
- **ఘనంగా టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ మూడవ వార్షికోత్సవం**
- **అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది:**
- **ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్**




**చిత్తూరు సెప్టెంబర్ 20 మనం న్యూస్:** భవిష్యత్తు అంతా ఎలక్ట్రానిక్ వాహనాలదేనని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా టూ వీలర్ మెకానికులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు.ఆదివారం చిత్తూరు నగరంలో నిర్వహించిన 'టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్' మూడవ వార్షికోత్సవ వేడుకలకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై,.. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ.. వాహన రంగంలో వస్తున్న పెను మార్పులను మెకానికులు గమనించాలన్నారు. రాబోయే రోజుల్లో ఈవీ (ఈవి) వాహనాల హవా నడవనుందని, అందుకు తగ్గట్టుగా కొత్త టెక్నాలజీని నేర్చుకుని అప్డేట్ అవ్వడం ద్వారానే మార్కెట్లో రాణించగలరని సూచించారు. ట్రైల్ రన్ విషయంలో ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాలను బారిన పడకుండా తమ విలువైన ప్రాణాలను రక్షించుకోవాలని హెచ్చరించారు. టూ వీలర్స్ మెకానిక్ ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు శాసనసభ్యులు (ఎమ్మెల్యే) గురుజాల జగన్ మోహన్ మాట్లాడుతూ.. సమాజంలో రాత్రింబవళ్లు కష్టపడే అసంఘటిత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మెకానికుల సంక్షేమానికి, వారి కుటుంబాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని అందరూ ఐక్యంగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు.

చిత్తూరు టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు, పక్కా ఇండ్ల మంజూరు విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తామన్నారు.ఈ వేడుకల్లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ (టిడిపి) మహిళా నాయకురాలు లావణ్య మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే కార్మిక కుటుంబాలలోని మహిళలకు, వారి పిల్లల చదువులకు తమ వంతు మద్దతు ఉంటుందని తెలిపారు. మెకానిక్ అసోసియేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక మెకానికులు, కార్మికులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు అతిథులను ఘనంగా సత్కరించారు. అలాగే ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

# హనుమంతుడిపై రాముడు.. గజరాజుపై గోవిందుడు..!

- **తుమ్మలగుంటలో వైభవంగా బ్రహ్మోత్సవాలు**
- **కోలాహలంగా వసంతోత్సవం వేడుకలు**
- **సారె సమర్పించిన చంద్రగిరి మండలం లోనిభక్తులు**



**తిరుపతి రూరల్ సెప్టెంబరు 20 మనం న్యూస్:** తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు ఆదివారం ఉదయం హనుమంత వాహనం, రాత్రికి గజ వాహనంపై స్వామివారు పుర వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంతో పాటు గ్రామంలోని వీధులు, పరిసర ప్రాంతాలను విద్యుత్తు దీపాలతో అలంకరించడంతో ఉత్సవ శోభ మరింత పెరిగింది. ఉదయం శ్రీరామచంద్రుని అలంకారంలో స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగారు. త్రేతాయుగంలో తనకు సేవ చేసిన హనుమంతుడి భక్తి, సేవా తత్పరతను స్మరిస్తూ ఈ వాహన సేవ నిర్వహించారు.ఉత్సవాల్లో ఆదివారం ఉదయం హనుమంత వాహనంపై శ్రీరామునిగా దర్శనమిచ్చిన స్వామి హనుమంత వాహన సేవలో కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్న భక్తులు, హనుమంత వాహన సేవకు చంద్రగిరి మండలంలోని పనపాకం, ఎ.రంగం పేట, కందులవారి పల్లి, చిన్న రామాపురం, రామిరెడ్డి పల్లి, కొటాల, ఐతేపల్లి, ఎం.కొంగరవారిపల్లి,అగరాల, కల్ రోడ్డు పల్లి పంచాయతీల నుంచి సారె తీసుకువచ్చిన భక్తులకు సాదర స్వాగతం పలికిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వాహన సేవల్లో భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకున్న కళా కారులు, భజన బృందాలు,రాత్రి గజ వాహనంపై గోవిందుని రూపంలో స్వామివారు రాజసంగా దర్శనమిచ్చారు. గజేంద్రమోక్ష ఘట్టాన్ని స్మరింపజేస్తూ శరణు కోరిన భక్తులను ఎల్లవేళలా కాపాడే దైవంగా స్వామివారి వైభవాన్ని చాటేలా గజ వాహన సేవ నిర్వహించారు. గజవాహనంపై కొండలరాయుడిని దర్శించుకున్న భక్తులు గోవింద నామస్మరణ చేశారు.

**కోలాహలంగా వసంతోత్సవం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదేవుని సన్నిధిలో సుగంధ ద్రవ్యాలు కలిపిన నీటిని చల్లుకుంటూ భక్తులు సందడి చేశారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల గాత్ర కచేరీ ఆకట్టుకుంది. వివిధ వేషధారణల్లో కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ మాజీ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి దంపతులు, ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి, ఆలయ అర్చకులు, వేద పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మాజీ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

**అలరించిన కోలాటాలు, భజనలు**

బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు ఉదయం హనుమంత వాహన సేవలో కళాకారులు ప్రదర్శించిన కోలాటాలు, భజనలు భక్తులను అలరించాయి. అలాగే గజ వాహన సేవలో దేవతారూపాలు ధరించిన కళాకారులు, నృత్యకారులు తమ ప్రదర్శనలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు.

**భక్తులు అందరికీ రుచికరమైన భోజనాలు**

బ్రహ్మోత్సవాలు ఆరంభం నుంచి ముగింపు వరకు కళాకారులు, భక్తులు అందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి స్వయంగా తన ఇంటి వద్ద వంట తయారీ మనుషులను ఏర్పాటు చేసి అందరికీ రుచికరమైన, సుచికరమైన బోజనాలను పంపిణీ చేస్తున్నారు. భక్తులకు అందించే భోజనాలను తరచుగా ఆయన తనిఖీ చేస్తూ నాణ్యతలో తేడా లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.:

## నిమజ్జనానికి విచ్చేసిన భక్తులకు ఎమ్మెల్యే ప్రత్యేక విందు

**ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు**



**కదిరి, సెప్టెంబర్20మనంన్యూస్:-** వినాయక నిమజ్జన కార్యక్రమానికి కదిరి దేవరచెరువు వద్దకు విచ్చేసిన భక్తులకు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా జర్మన్ టెంట్లు ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణంలో రుచికరమైన విందు భోజనాలను ఏర్పాటు చేశారు. భక్తులతో పాటు నిమజ్జన కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి కూడా ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించారు.

వినాయక నిమజ్జనం కోసం దేవరచెరువు వద్దకు వచ్చిన భక్తులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లను అభినందించారు. ఇంత పెద్ద ఎత్తున భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భోజనాలు అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇటువంటి కార్యక్రమాన్ని ఎన్నడూ చూడలేదు అంటూ భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టారు. భక్తులకు సేవ చేయడం ద్వారా వినాయకుని ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.



## రోడ్డు నిబంధనలు పాటించాలి

**మంత్రాలయం , సెప్టెంబర్ 20,మనం న్యూస్ ;-** వాహన దారులు ఖచ్చితంగా రోడ్డు నిభందనలు పాటించాలని ఎస్సై మల్లికార్జున సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహన దారులను నిలిపి రికార్డులను పరిశీలించారు. హెల్మెట్ ధరించి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఇతర భారీ వాహన దారులు వాహనాల రికార్డులతో రోడ్డు నిభందనలు పాటించాలని పరిమిత వేగంతో వెళ్లి గమ్యాన్ని చేరాలని కోరారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున, కానిస్టేబుల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

- **కార్యక్రమంలో పాల్గొన్నఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్**

**అనంతపురం సెప్టెంబర్ 20 మనం బ్యూరో :** ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాప్తాడు పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ జగదీష్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 22న ఎన్టీఆర్, పరిటాల రవి కాంశ్య విగ్రహాల ఆవిష్కరణకు మంత్రి నారా లోకేష్ రానున్నారు. ఈ నేపథ్యంలోజిల్లా ఎస్పీ జగదీష్ రాప్తాడులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రాపాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజులతో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కార్యక్రమానికి భారీగా ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఎమ్.ఎస్.రాజు మాట్లాడుతూ



విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని దిగ్విజయం చేసేందుకు అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# షఫాలీ సెంచరీ.. ఫైనల్స్‌కు టీమిండియా

## ‘మైసా’తో రష్మిక ఉగ్రరూపం!

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్ గానే కాకుండా తనపై సోలో సినిమాలు కూడా చేస్తున్న సంగతి తెలిసిందే. అలా యువ దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న సాలిడ్ యాక్షన్ చిత్రం ‘మైసా’ చేస్తుంది. ఒక ఇంటెన్స్ యాక్షన్ ఎలిమెంట్స్ తో ప్లాన్ చేసిన ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా విడుదల చేసిన టీజర్ లో మాత్రం రష్మిక తన ఇంటెన్స్ పెర్ఫామెన్స్ తో మరో కోణాన్ని చూపించింది అని చెప్పవచ్చు.



ఒక తెరచాటు ఆడపిల్ల వైలెంట్ అయితే ఏ రేంజ్ లో ఉంటుందో ఆ అంతటినీ రష్మిక తన ఉగ్రరూపంతో చూపించింది అని చెప్పాలి. రష్మిక సాలిడ్ పెర్ఫామర్ అని అందరికీ తెలుసు. కానీ ఇందులో ఆమె చేస్తున్న యాక్షన్ పార్ట్ కూడా ఒకింత షాకింగ్ గా ఉందని చెప్పాలి. తన డెడికేషన్ అద్భుతంగా కనిపిస్తుంది. ఈ టీజర్ అంతా ఆమెనే హైలైట్ గా కనిపిస్తుంది.

ఇక జేక్స్ బిజోయ్ ఇచ్చిన స్కోర్ కూడా బాగుంది. దర్శకుడు రవీంద్ర ఒక రా అండ్ రస్టిక్ రూరల్ యాక్షన్ ఫీస్ట్ ని ప్రామిస్ చేస్తున్నారు. సహజమైన లొకేషన్స్ లో షూట్ చేసినట్టుగా ఇందులో కనిపిస్తుంది. దీనిలో కెమెరా వర్క్ ఇతర బృందాలు కూడా గట్టిగానే కష్టపడినట్టు తెలుస్తుంది. సో మొత్తానికి ఈ నవంబర్ 27న ఒక ఇంటెన్స్ ఫీస్ట్ ని అన్ ఫార్ములా ఫిలిమ్స్ వారు తీసుకొస్తున్నారని చెప్పొచ్చు.

ఏషియన్ గేమ్స్ 2026 మహిళల క్రికెట్లో భారత్ ఫైనల్స్కు దూసుకెళ్లింది. ఇవాళ జరిగిన రెండో సెమీఫైనల్లో టీమిండియా బంగ్లాదేశ్‌పై 115 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి, రెండో ఫైనల్ బెర్త్ దక్కించుకుంది.

ఇవాళ ఉదయమే జరిగిన తొలి సెమీఫైనల్లో పాకిస్తాన్ను చిత్తు చేసి శ్రీలంక తొలి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. సెప్టెంబర్ 22న స్వర్ణ పతకం కోసం జరిగే ఫైనల్లో శ్రీలంక టీమిండియాను ఢీకొంటుంది. అదే రోజు కాంస్య పతకం కోసం పాకిస్తాన్, బంగ్లాదేశ్ పోటీపడతాయి. ఫైనల్లో ఓడిన జట్టు రజతంతో సరిపెట్టుకుంటుంది.

భారత్-బంగ్లాదేశ్ మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (49 బంతుల్లో 100 నాటౌట్; 3 ఫోర్లు, 9 సిక్సర్లు) విధ్వంసకర శతకంతో విరుచుకుపడటంతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది.

భారత ఇన్నింగ్స్లో స్మృతి మంధన (19 బంతుల్లో 37; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ హర్మన్ప్రీత్ (33 బంతుల్లో 40; 6 ఫోర్లు) కూడా మెరుపు ఇన్నింగ్స్లు ఆడారు. మిగతా ప్లేయర్లలో కమలిని (3), రిచా ఘోష్ (2) నిరాశపరిచారు. బంగ్లా బౌలర్లలో షంజిద అక్తర్, రబేయా ఖాన్, నహిద అక్తర్, మరుఫా అక్తర్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన బంగ్లాదేశ్ భారత బౌలర్ల ధాటికి పూర్తిగా చేతులెత్తేసింది. పేసర్ నందిని శర్మ (4-0-25-3) అద్భుతంగా బౌలింగ్ చేసి బంగ్లా పతనాన్ని శాసించింది. ఆమెకు స్పిన్నర్లు శ్రీచరణి (3-1-7-2), శ్రేయాంక పాటిల్ (3-0-22-1), దీప్తి శర్మ (2.4-0-7-3) సహకరించారు.

మరో పేసర్ క్రాంతి గౌడ్ (3-0-20-1) కూడా తన పాత్రకు న్యాయం చేసింది. మొత్తంగా వీరి ధాటికి బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా ఇన్నింగ్స్లో దిల్వర అక్తర్ (27), షర్మిన్ అక్తర్ (10), సుల్తానా ఖాతూన్ (12 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు.




## వరుస ఆఫర్లతో దూసుకుపోతున్న ప్రియాంక మోహన్



కోలీవుడ్ క్యూట్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ ప్రియాంక మోహన్ క్రేజ్ ఇప్పుడు పీక్స్కి వెళ్లిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. ఏ భాషలో చూసినా వరుస ఆఫర్లతో ఈ అమ్మడు దూసుకుపోతున్న తీరు చూసి నెటిజన్లు సైతం షాక్ అవుతున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో ‘అరసన్’, ‘మంజనత్తి’, ‘కవిన్-9’ లాంటి క్రేజీ ప్రాజెక్ట్స్ ఉండగా, తాజాగా టాలీవుడ్ నుంచి మరో అదిరిపోయే బంపర్ ఆఫర్ ఆమె ఖాతాలో చేరినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతూ హాట్ టాపిక్గా మారాయి. ఇటీవల ‘ఇరుముడి’తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న మాస్ మహారాజా రవితేజ, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబినేషన్లో రాబోతున్న భారీ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్గా ఫిక్స్ అయినట్లు సమాచారం. భారీ విజయంతో ఫుల్ జోష్లో ఉన్న రవితేజ సరసన ఈ బ్యూటీ జోడీ కడుతుండటం విశేషం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే వచ్చే అక్టోబర్లో దసరా పండుగ కానుకగా ఈ మూవీని అఫీషియల్గా పట్టాలెక్కించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. లక్ష్మణ్ అత్యంత భారీ బడ్జెట్తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని, వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్గా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రవితేజ - వివేక్ ఆత్రేయ కాంబోకి ప్రియాంక మోహన్ గ్లామర్ తోడవడంతో, ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయిపోయాయి.

## వలవరిన్ అద్భుతం.. సింగిల్స్ లోనూ సిల్వర్ మెడల్



ఆసియా క్రీడల్లో భారత యువ షూటర్ ఎలావెనిల్ వలవరిన్ అద్భుతం చేసింది. ఇప్పటికే టీమ్ విభాగంలో రజతం సాధించిన ఆమె.. వ్యక్తిగత విభాగంలోనూ పతకం సొంతం చేసుకుంది. 10 మీటర్ల రైఫిల్ విభాగంలో రెండో ప్లేస్ సాధించింది. జపాన్కు చెందిన హినట టైచి 253 పాయింట్లు సాధించి స్వర్ణం కైవసం చేసుకుంది. వలవరిన్ 252.4 పాయింట్లతో సిల్వర్ మెడల్ను దక్కించుకుంది. సౌత్ కొరియా షూటర్ బాన్ హ్యోజిన్ (230.4) మూడో ప్లేస్లో నిలిచి కాంస్యం అందుకొంది.

### టీమ్ ఈవెంట్ లోనూ..

అంతకుముందు ఆసియా క్రీడల్లో (2026) భారత్కు తొలి పతకం షూటింగ్ విభాగంలో వరించింది. మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్లో రజత పతకాన్ని సాధించింది. ఎలావెనిల్ వలరివన్, సోనం, విదర్శ వినోద్ల త్రయం అద్భుత ప్రదర్శనతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ విభాగంలో చైనా స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది.

## స్పృహ తప్పి పడిపోయిన భారత అథ్లెట్



జపాన్లో ఆసియా క్రీడలు ఘనంగా జరుగుతున్నాయి. భారత్కు చెందిన మిక్స్డ్ మార్షల్ ఆరట్స్ ఫైటర్ వరుణ్ సన్యాల్ అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధమవుతుండగా.. అతడు క్రూయిజ్ షిప్లో స్పృహ తప్పి పడిపోయినట్లు ఎంఎంఏ స్పోరట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు నిఖిల్ కుందేరా వెల్లడించారు. నేపాల్కు చెందిన అథ్లెట్ వరుణ్ సన్యాల్ను గమనించి.. సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. అనారోగ్యం కారణంగా అతడు క్వార్టర్ ఫైనల్ నుంచి డిస్క్వాలిఫై అయినట్లు సమచారం. ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ కుమారుడే వరుణ్ సన్యాల్.



## ఆసియా క్రీడల్లో భారత్ కు తొలి పతకం ఖాయం

జపాన్లోని నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో (2026) భారత్ కు తొలి పతకం ఖాయమైంది. మిక్స్డ్ మార్షల్ ఆరట్స్ మహిళల-60 కేజీల విభాగంలో భారత క్రీడాకారిణి సుచిక తరియల్ సెమీఫైనల్స్ కు చేరుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్ లో మంగోలియాకు చెందిన అల్తాన్ చిమెగ్ బైగల్మాను 2-0 తేడాతో ఓడించి, సుచిక కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నారు. సుచిక ఫైనల్ కు చేరేందుకు సింగపూర్ కు చెందిన హుయ్ హూన్ టియో లేదా ఇరాన్ కు చెందిన అరెజౌ సలీమిఘులేహ్తోకిలలో ఒకరితో తలపడనున్నారు.

## ‘ది ప్యారడైజ్’లో డూప్ షాట్స్ లేవు.. : నాని

**తనకు ఏ స్టార్డమ్ ట్యాగ్లు, బాక్సాఫీస్ రికార్డులతో పనిలేదని తెలుగు ప్రేక్షకులు గర్వంగా చూపించుకునేలా తిరుగులేని చిత్రాలు తన నట జాబితాలో ఉండాలని అంటున్నారు నాని. ఆయన కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’. కయాదు లోహర్ కథానాయిక. మోహన్బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కుల్కర్ణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నాని ముచ్చటించారు.**

- ‘‘ఈ కథలో ఏదో ప్రత్యేకంగా కనిపించాలని జడలు వేసుకోలేదు. కథలో నుంచి పుట్టిన క్యారెక్టర్ ఇది! ‘జడల్’ సొసైటీలో సాధారణ వ్యక్తిలాంటివాడు కాదు. వాడికి చిన్నప్పటి నుంచే ఓ పిచ్చి ఉంటుంది. అదేంటో మీరు తెరపై చూడాలి’’
- ‘‘సెట్స్లో మాకెప్పుడూ నెంబర్లు, కలెక్షన్ల ఒత్తిడి లేదు. ఒక సన్నివేశం షూటింగ్ అయిపోయాక శ్రీకాంత్ వచ్చి ‘అన్నా.. థియేటర్ ఊగిపోద్ది అంతే’ అనేవాడు. మాస్ ఆడియన్స్ నాడి తెలిసిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. ‘ప్యారడైజ్’ అతని విజన్’’
- ‘‘ఇందులో మేమంతా సవారీలు అనే తెగకు సంబంధించిన వాళ్లుగా కనిపిస్తాం. వాళ్లకు ఎలాంటి గుర్తింపూ ఉండదు.. వాళ్లు ఎవరిని చంపినా కేసు ఉండదు. వాళ్లను చంపినా ఎవరూ పట్టించుకోరు! అసలు ఉనికి లేని ఒక జాతి తమ ఉనికి కోసం చేసే తిరుగుబాటు ఈ కథ, 80వ దశకం నేపథ్యంగా మునుపెన్నడూ చూడని ఒక కొత్త ప్రపంచాన్ని దర్శకుడు శ్రీకాంత్ అతడి టీమ్ సృష్టించింది’’



- ‘‘ఇందులో మోహన్ బాబు గారు సికంజా మాలిక్ అనే పాత్ర పోషిస్తున్నారు. తెరపై చాలా క్రూరంగా ఉంటుంది. కథ వినగానే ఆయన ఎంతో ఉత్సాహం చూపించారు. ‘ఇది నా కెరీర్లోనే బిగ్గెస్ట్ ఫిల్మ్ అవుతుంది’ అని అన్నారు. బిగ్ స్క్రీన్ కలెక్షన్ కింగ్ వర్సెస్ నేచురల్ స్టార్ పోరాటం చూస్తారు’’
- ‘‘‘జడల్’ పాత్ర కోసం మేకప్ వేసుకోవడానికి నాకు గంటన్నర సమయం పట్టేది. జడల వల్ల రోజంతా వెనక్కి ఆనుకోవడానికి కూడా ఉండేది కాదు. ఎక్కడున్నా నిటారుగా కూర్చోవాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఏకధాటిగా 36 గంటల పాటు షూట్ చేశాం! తలంతా ఎర్రబడి గాయాలయ్యాయి’’
- ‘‘ఈ సినిమాలో హీరోని బురదలో, నిప్పుల్లో, వర్షంలో ఎంత కష్టపెట్టారో.. తల్లి పాత్ర పోషించిన సోనాలి కులకర్ణి గారిని కూడా అంతే ఇబ్బంది పెట్టారు! ఒక్కసారి కూడా కంప్లైంట్ చేయకుండా ఆవిడ పడ్డ కష్టం రిలీజ్ తర్వాత అందరి ప్రశంసలు అందుకుంటుంది’’
- ‘‘సినిమాలో లెగ్ షాట్ అయినా, రింగ్ కనిపించే షాట్ అయినా నేనే స్వయంగా చేశా! రేపు స్క్రీన్ మీద చూసుకున్నప్పుడు ‘అబ్బా.. ఇది డూప్ షాట్’ అని నాకే అనిపిస్తే ఆ కాంప్లిమెంట్ను నేను జెన్యూన్గా ఓన్ చేసుకోలేను’’
- ‘‘సినిమాలో ఒకట్రెండు ఎపిసోడ్స్ను శ్రీకాంత్ ఎక్స్ట్రీమ్ రాడికల్గా తీశాడు. నాకు అత్యంత ఇష్టమైన సన్నివేశాల్లో అవి కూడా ఉన్నాయి. ఇంత ప్రభావం ఇచ్చే యాక్షన్, సీన్స్ ఒక కమర్షియల్ మాస్ సినిమాలో ఉంటాయా? అని థియేటర్లలో ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు’’
- ‘‘ఆయా షేర్, ఏష నాగుల కంటే ముందే నా కారులో, ఫోన్లో లూప్లో ప్లే అయిన సాంగ్ ‘అంజనా అంజనీ’! ఇది చాలా బ్యూటిఫుల్ సాంగ్.. త్వరలోనే బయటకు రాబోతోంది’’
- ‘‘సినిమా ఆలస్యమైతే కెరీర్ ఎందుకు ఎఫెక్ట్ అవుతుంది? సుకుమార్ గారికి పుష్ప ఆలస్యమైనంత మాత్రాన కెరీర్ ఎఫెక్ట్ అయిందా? నాణ్యమైన సినిమా చేయనప్పుడే కెరీర్ దెబ్బతింటుంది తప్ప, ఆలస్యం వల్ల కాదు. ప్యారడైజ్ చూసి థియేటర్ నుంచి బయటకు వచ్చాక ఫైట్లు, పాటల కంటే ఆ ‘అమ్మ-కొడుకు’ ఎమోషనే మిమ్మల్ని వెంటాడుతుంది’’
- ‘‘హీరోయిన్ కయాదు లోహర్ కేవలం పాటల కోసమే కాదు, కథలో చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా సెకండ్ హాఫ్లో ఎమోషనల్ స్టోరీ, ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. నా కెరీర్ మొదలైంది సెప్టెంబర్లోనే ‘భలే భలే మగాడివోయ్’ వచ్చింది కూడా సెప్టెంబరులోనే! ఇప్పుడు కూడా సెప్టెంబర్లోనే వస్తోంది. ఆ సెంటిమెంట్ ఈ సినిమాకు కూడా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్గా వర్కవుట్ అవుతుందని నమ్ముతున్నా’’
- తమిళ్, మలయాళం, కన్నడ ప్రేక్షకుల ఆదరణ చూస్తే ఆశ్చర్యంగా అనిపించింది. అందుకే అక్కడ కూడా లిప్-సింక్, వాయిస్ క్వాలిటీ విషయంలో అస్సలు రాజీపడలేదు. వాళ్లు ఇచ్చే ప్రేమకు మనమిచ్చే కనీస గౌరవం అది’’ అని నాని పంచుకున్నారు.



## ఎస్ఐని సన్మానించిన పెయింటర్ యూనియన్ సభ్యులు



కోదాడ/నడిగూడెం, సెప్టెంబర్ 20(మనం న్యూస్): ఇటీవల నూతనంగా ఎన్నికైన నడిగూడెం మండల పెయింటర్ యూనియన్ సభ్యులు మండల ఎస్సై తేజస్విని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ యూనియన్ సభ్యులు హౌసింగ్ పెయింటింగ్ వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం మండల హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ యూనియన్ కార్యవర్గ సభ్యులు. అధ్యక్షులు :గంటెపంగు సైదులు, ఉపాధ్యక్షులు నోసిన రవి, ప్రధాన కార్యదర్శి సీమ సుధాకర్, కోశాధికారి చిలక భాస్కర్, సహాయ కార్యదర్శిలు కొండూరు యాదాద్రి, దాసరి నాగేష్, కార్యవర్గ సభ్యులు దాసరి నరేష్, సీమ యాకోబు, షేక్ పాష, స్వామి, గెంటపంగు రమేష్, నాగేశ్వరరావు, చాందు, అశోక్, నూసిన, రఘు తదితరులు పాల్గొన్నారు.

# తంత్రం..చూ..మంత్రం!

## నిరుద్యోగులకు ఉద్యోగాల పేరిట గాలం

### పతనం అవుతున్న గ్రాఫ్‌ను రక్షించుకునే ప్రయత్నం
### కాకి లెక్కలతో అందరిని బురడి కోట్టిస్తున్న వైనం అంటూ విమర్శలు
### హంగామాలతో.. హడల్ కోట్టిస్తున్న ఆ ఇద్దరు నేతలు
### ముక్కున వేలుసుకుంటున్న ఆ రెండు సెగ్మెంట్ల ప్రజలు





సూర్యాపేట, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి): చేసేది గోరంత... పబ్లిసిటీ కొండంత.. అనే చందంగా తయారైంది ఆ నేతల హడావుడి... అంతా ఇంతా కాదు... దేశంలో ఎక్కడా జరగని విధంగా తాము మాత్రమే నిరుద్యోగులకు ఉద్యోగాల పేరా మెగా జాబ్ మేళా నిర్వహించి ఉపాధి కల్పించామని కాకి లెక్కలతో అందర్నీ బురిడీ కొట్టిస్తున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి తీరు చూసి కోదాడ హుజూర్నగర్ సెగ్మెంట్ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారంటే నమ్మక తప్పదు... ఒకపక్క ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చకపోవడంతో రాష్ట్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత మూట కట్టుకున్న నేపథ్యం కనిపిస్తుంది.. ఇదే విషయమై ప్రస్తుత కాంగ్రెస్ దుస్థితి పలు సర్వే సంస్థలు సైతం లెక్కలతో సహా కాంగ్రెస్ పార్టీ పెద్దల ముందు ఉంచింది... ఇదే పరిస్థితి సూర్యాపేట జిల్లా లోని హుజూర్నగర్ కోదాడ సెగ్మెంట్లో రోజు రోజుకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి గ్రాఫ్ పడిపోతుందనే విమర్శలు వినిపిస్తున్న నేపథ్యం, దీనికి తోడు సామాన్య కార్యకర్తలను పట్టించుకోరు అనే అపవాదు లేకపోలేదు.. దీంతో పట్టు నిలుపుకునేందుకు..ఆ ఇద్దరు నేతలు ఆపసోపాలు పడుతుండటం చూసి.. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులే చర్చించుకోవడం గమనార్హం... ఇందులో భాగంగానే పతనమవుతున్న గ్రాఫ్ ను రక్షించుకునేందుకు...కొలువుల జాతర నిర్వహించడం తెలిసిందే దీంతో ఆ రెండు నియోజకవర్గాల్లో... ప్రధానంగా యువత నుండి నెలకొన్న వ్యతిరేకతను తప్పించుకునేందుకు నిరుద్యోగులకు జాబ్ మేళా అని యువత ఓట్లకు గాలం వేస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటు న్నాయి.. తమను తాము కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు అందరిని ఆలోచింపజేస్తున్నాయి... తాజాగా నిర్ణయించిన జాబ్ మేళాలో...35000 మంది నిరుద్యోగ యువత హాజరైనట్లు నిర్వాహకులు ఊదరగొడుతున్నా.... వాస్తవానికి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నట్లు సమాచారం... 35 వేల మంది నిరుద్యోగులు హాజరైతే... ఒక్క రోజు జాబ్ మేళాకు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెబుతున్న వాస్తవానికి ఆ సంఖ్య లో మూడో వంతు కూడా లేనట్టు ఆ మేళాకు హాజరైన నిరుద్యోగులే చెబుతుండడం విశేషం... అయితే ఒక్కరోజు లో ఇంటర్వ్యూలు నిర్వహించడం సాధ్యమా అనే ప్రశ్నలు తలెత్తుండడం గమనార్హం... ఒకపక్క 5.625. ఉద్యోగాలు కల్పించామని ప్రకటిస్తుంటే... మరో పక్క కేవలం సగం మందికి పైగా ఆఫర్ లెటర్లు మాత్రమే.. నిరుద్యోగులకు అందజేశారని.. 3500 మందికి మాత్రమే కొలువు జాయినింగ్ లెటర్లు తీసుకున్నట్లు సమాచారం.. ఇదే విషయాన్ని అధికారులను వివరాలు తెలపమని అడిగితే.. పూర్తిస్థాయి సమాచారం అందలేదని ఇంకా ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగాల నియామకాల లెక్క తేలుతుంది అనే దాట వేసే ధోరణి అవలంబిస్తుండటం కోసం మెరుపు...ఇప్పటికే విపక్ష పార్టీల నాయకులు వసూల్ మేళ నా.... జాబ్ మేళా.. అనే విమర్శనాస్త్రాలు మీడియా ముఖంగా సంధిస్తుండటం తెలిసిందే.. అంతేకాకుండా గత సంవత్సరం హుజూర్నగర్ లో ఎన్ని ఉద్యోగాలు కల్పించారు. ఇందులో ఎంతమంది యువత ఇప్పటివరకు విధుల్లో కొనసాగుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ వినిపిస్తుంది.. తాజాగా జాబ్ మేళా ఉద్యోగాలు.. ఏ స్థాయిలో చదువు అర్హత బట్టి కొలువులు యువతకు అందజేశారు లేదో గత సంవత్సరం తాజాగా నిర్వహించిన జాబ్ మేళా కొలువుల సంఖ్య పై ఒక లేఖ విడుదల చేయాలని విపక్ష పార్టీ నేతలు బహిరంగంగా. ప్రశ్నిస్తున్నారు... దీనిపై ఆ రెండు సెగ్మెంట్ల నేతలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి మరి.. మరోపక్క ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి కాంగ్రెస్ పార్టీ పెద్ద సంఖ్యలో బస్సులు తీసుకొచ్చి అందులో అధిక సంఖ్యలో హస్తం పార్టీ నాయకులు కార్యకర్తలు మాత్రమే హాజరయ్యారని 10000 నుండి 12,000 మంది నిరుద్యోగ యువత కూడా ఈ జాబ్ మేళాకు హాజరు కాలేదని.. బాటంగానే జాబ్ మేళా ప్రాంగణంలో పలువురు చెవులు కోరుకోవటం స్థానిక ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది... ఇది ఇలా ఉండగా ఈ మెగా జాబ్ మేళా పబ్లిసిటీ ఆకాశాన్ని అంటే విధంగా ఆ ఇద్దరు నేతలు అడల్ కొట్టిస్తున్న తీరును చూసి... కోదాడ హుజూర్నగర్ సెగ్మెంట్ ప్రజలు ముక్కున వేలు వేసుకునే పరిస్థితి ఏర్పడింది.

# రైతులకు కరెంటు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం



- **దున్నపోతు మీద వర్షం పడ్డట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు**
- **అధికారుల మీద నెపం నెట్టి పబ్బం గడుపుకుంటున్న రేవంత్ రెడ్డి**
- **మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**

కోదాడ, సెప్టెంబర్ 20(మనం న్యూస్): రాష్ట్రంలో పాలన చేతగాక, సంక్షేమం అందించలేక రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నడిగూడెం మండలం కరివిరాల గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కరెంటు కోతలకు నిరసనగా రైతులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీసం వ్యవసాయానికి కరెంటు ఇవ్వలేని దుస్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. అధికారులను నామమాత్రం చేసి, ప్రభుత్వం మీద ఉన్న నెపాన్ని క్షేత్ర స్థాయి ఉద్యోగుల మీదకు నెడుతూ రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న అధికారులకు రైతుల పట్ల మానవత్వం ఉందని, వారు సహాయం చేద్దామనుకున్నా పైనుంచి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని స్పష్టం చేశారు. రైతులు బోర్లు, బావుల కింద వేసుకున్న పంటలు నాణ్యమైన విద్యుత్ లేక కళ్ల ముందే ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కన్నీరు పెడుతున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని, చెవిటోని ముందు శంఖం ఊదినట్లుగా ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. దున్నపోతు మీద వర్షం పడ్డట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతోందని, ప్రతిపక్షంగా తాము ముల్లు కర్ర పెట్టి పొడిస్తే తప్ప ఈ ప్రభుత్వం మేల్కొనేలా లేదని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం దిగివచ్చి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే అధికారులను అడ్డుకోవడమే కాకుండా, జాతీయ రహదారులను స్తంభింపజేస్తామని మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులను ఆదుకోవడమే తమ ఏకైక లక్ష్యమని, అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని తేల్చి చెప్పారు.

# టీం రేడియంట్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

- **ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ రాజమహేంద్ర నాయక్**



జనగామ, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి): జనగామ జిల్లా ఎల్లంల గ్రామంలో టీం రేడియంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ పూజ, అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా టీం రేడియంట్ సభ్యులు డీసీపీ రాజమహేంద్ర నాయక్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రచ్చ శివకుమార్, పెండల శివకుమార్, రాంబాబు, తాటి సాయికుమార్, మచ్చ సాయికుమార్, భాను, నాగేష్, భరత్, ఉదయ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కోయంబత్తూరు ర్యాలీలో మస్కరెన్హాస్ విజయం

## 23 సెకన్ల ఆధిక్యంతో ర్యాలీ గెలుపు



హైదరాబాద్ , సెప్టెంబర్ 20 (మనంన్యూస్): ఫ్యాబిడ్ అహ్మర్, మిలెన్ జార్జ్‌కు చివరి దశలో ఎదురైన అనూహ్య పరాజయంతో, డీన్ మస్కరెన్హాస్, గగన్ కరుంబయ్యా జంట బ్లూబ్యాండ్ స్పోర్ట్స్ ర్యాలీ ఆఫ్ కోయంబత్తూరులో అద్భుత విజయాన్ని అందుకుంది. రాత్రికి తొమ్మిది సెకన్ల వెనుకంజలో ఉన్న ఈ జంట, ఆదివారం అద్భుతమైన వేగంతో పోటీని మలుపుతిప్పి 23.482 సెకన్ల ఆధిక్యంతో విజయం సాధించింది.కర్ణ కదూర్, మూసా షరీఫ్ రెండో స్థానంలో నిలవగా, జేసన్ సాల్దాన్హా, శ్రీనివాస్ మూర్తి పి.వి. మూడో స్థానాన్ని దక్కించుకున్నారు.2026 ఎఫ్ఎంఎస్సీఐ ఇండియన్ నేషనల్ ర్యాలీ ఛాంపియన్షిప్ (ఐఎన్ఆర్సి) రెండో రౌండ్ కోయంబత్తూరులో జరిగింది. నగర పరిసర ప్రాంతాల్లోని కఠినమైన గ్రావెల్ రోడ్లపై సెప్టెంబర్ 19, 20 తేదీల్లో జరిగిన ఈ పోటీలో మొత్తం 64 మంది పోటీదారులు పాల్గొన్నారు.

**ఎనిమిది దశలు.. రెండు రోడ్లు..**
**చివరి వరకు ఉత్కంఠ..**

రెండు రోజుల పాటు జరిగిన ఈ ర్యాలీలో మొత్తం ఎనిమిది స్టేజ్ రన్స్, 110.80 కిలోమీటర్ల పోటీ దూరం ఉన్నాయి. ఇందులో ఎక్కువ భాగం గ్రావెల్ రోడ్లపైనే సాగింది.శనివారం బ్లాక్ థండర్ (13.50 కి.మీ.), ఎస్.ఎం. అగ్రో (14.20 కి.మీ.) స్టేజ్‌లను రెండేసి సార్లు నిర్వహించారు. ఆదివారం అదే రోడ్లను రివర్స్ దిశలో ఎస్.ఎం. అగ్రో , బ్లాక్ థండర్ పేర్లతో నిర్వహించారు. దీంతో ముందే పరిచయమైన రోడ్లను మరో దిశలో చదివి డ్రైవ్ చేయాల్సి వచ్చింది. కర్ణ కదూర్, మూసా షరీఫ్లదే ఆధిపత్యం. ఐఎన్ఆర్సి మోటార్స్పోర్ట్స్కు చెందిన మాజీ నేషనల్ ఛాంపియన్ కదూర్ తొలి రెండు స్టేజ్లలో అత్యంత వేగంగా దూసుకెళ్లి మొదటి రోజు ముగిసే సమయానికి అగ్రస్థానంలో నిలిచాడు.ఫ్యాబిడ్ అహ్మర్, మిలెన్ జార్జ్ 5.6 సెకన్ల వెనుకంజలో రెండో స్థానంలో ఉండగా, డీన్ మస్కరెన్హాస్, గగన్ కరుంబయ్యా మూడో స్థానంలో ఉన్నారు. వీరు లీడర్కు తొమ్మిది సెకన్లకు పైగా వెనుకబడి ఉన్నప్పటికీ, ఇంకా చాలా దూరం మిగిలి ఉండటంతో పోటీ పూర్తిగా ఓపెన్గా ఉంది.

**ఆదివారం మస్కరెన్హాస్ దూకుడు...**

ఆదివారం పోటీ పూర్తిగా మలుపుతిప్పుకుంది.ఎస్.ఎం. అగ్రో లో మస్కరెన్హాస్, కద్బూ దాదాపు తొమ్మిది సెకన్లు ఆధిక్యం సాధించి అహ్మర్ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకున్నాడు. లీడర్ కదూర్తో అతని మధ్య వ్యత్యాసం కేవలం 0.148 సెకన్లకు తగ్గింది.బ్లాక్ థండర్ లో మాత్రం మస్కరెన్హాస్ అద్భుతమైన వేగాన్ని ప్రదర్శించాడు. ఒకే స్టేజ్లో కద్బూ 14 సెకన్లకు పైగా ఆధిక్యం సాధించాడు.

ఎస్ఎస్ఎస్3 నుంచి ప్రతి స్టేజ్లోనూ మస్కరెన్హాస్-కరుంబయ్యా జంటే వేగంగా నిలిచింది. చివరకు వారు 1:36:19.777 సమయంతో ఫినిష్ చేసి, కదూర్-షరీఫ్ జంటపై 23.482 సెకన్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కదూర్ చివరి వరకు పోరాడినా, 1:36:43.259 సమయంతో రెండో స్థానంలో నిలిచాడు. డీన్ మస్కరెన్హాస్ మాట్లాడుతూ... శనివారం కర్ణ, మూసా చాలా బలమైన వేగాన్ని ప్రదర్శించారు. కాబట్టి మేము ఓపికగా ఉండి, క్రమంగా గ్యాప్ను తగ్గించుకోవాలని నిర్ణయించుకున్నాం. రాత్రికి తొమ్మిది సెకన్లు వెనుకబడి ఉండటం అంత చెడ్డ పరిస్థితి కాదు, ఎందుకంటే ఇంకా చాలా దూరం మిగిలి ఉంది. ఆదివారం మాకు సరైన రిథమ్ దొరికింది. ముఖ్యంగా బ్లాక్ థండర్లో వేగం పెంచిన తర్వాత చివరి వరకు అదే ఉత్సాహంతో దూసుకెళ్లాం.

అద్భుతమైన ప్రత్యర్థితో ఇది నిజమైన పోరాటం. రౌండ్ 2లో విజయం సాధించడం చాలా ఆనందంగా ఉంది. గగన్ కరుంబయ్యా మాట్లాడుతూ:ఈ వారాంతంలో ముఖ్యంగా ఆదివారం గ్యాప్లు చాలా తక్కువగా ఉన్న సమయంలో పేస్ నోట్స్ కీలకంగా మారాయి. డీన్ ప్రతి కాల్ను పూర్తిగా నమ్మాడు, అదే తేడాను తీసుకొచ్చింది. కర్ణ, మూసా వంటి అనుభవజ్ఞులైన జంటను ఓడించడం ఎప్పుడూ సులభం కాదు. ఛాంపియన్షిప్లో మిగిలిన రౌండ్ల కోసం మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నామన్నారు.

# కృష్ణకు నీళ్లు వచ్చిన పంటలను ఎండబెడుతున్నారు

- **పంట పొలాలు ఎందుకు ఎండుతున్నాయో సీఎం, మంత్రులు చెప్పాలి**
- **మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి**

నల్లగొండ, సెప్టెంబర్ 20( మనం ప్రతినిధి): పంటలు ఎందుకు ఎండబెడుతున్నారో...సీఎం మంత్రులు సమాధానం చెప్పాలని మాజీమంత్రి జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి, కనగల్ మండలం తే లకంటి గూడెం గ్రామంలో ఎండిన పంట పొలాలను పరిశీలించి, భైరవని పెదలింగయ్య యాదయ్యలతో ఎండిన పంట పొలంలోనే కూర్చొని, రైతులతో మాట్లాడి పరామర్శించి.... వారికి ధైర్యం చెప్పి అనంతరం మీడియాతో మాట్లాడారురైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానిది నేరపూరిత చర్య అన్నారు.కృష్ణాకు నీళ్లొచ్చినా పంటలు ఎందుకు ఎండబెడుతున్నరు అని ప్రశ్నించారు .నీళ్లు, కరెంట్ కష్టాల గురించి రైతుల స్పందన తెలుసుకోండి అన్నారు.నీళ్లు వాడుకున్నామని అబద్దం చెప్పిన ఉత్తమ్ రైతులకు ఏం సమాధానం చెపుతాడు అని అన్నారు ..ఎల్నినో ఎంత అబద్ధమో బొగ్గు కొరత కూడా అంతే అబద్దం అన్నారు .రాజకీయాల కోసమే అని మాట్లాడేటోళ్లు.. పంటలు ఎండిన రైతుల వద్దకు వెళ్లి మాట్లాడాలి అన్నారు .గతంలోనూ కోమటిరెడ్డి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు పంటలు సాగుచేసుకోలేకపోయినమని రైతులే చెబుతున్నారు అన్నారు .కేసీఆర్ వచ్చినంకనే పంటలు సాగుచేసుకుని.. బ్రహ్మాండంగా పండించుకున్నమం టున్నారు.మళ్లీ ఈ మూడేండ్లుగా పంటలు ఎండబెడుతున్నరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంకా ఎన్నాళ్లు ఎల్నినో పేరు చెప్పి డ్రామాలు అడుతారు.ఆనాడే 21 వేల మెగావాట్ల పవర్ జనరేట్ చేయడానికి కావాల్సినంత చేసిండు కేసీఆర్.కెసిఆర్ హయంలో వరుసగా నాణ్యమైన



విద్యుత్తు 24 గంటలు అందించినం..అందుకు విద్యుత్ వినియోగించుకున్న మీరంతా ప్రత్యక్ష సాక్షులే అన్నారు .యాదాద్రి, భద్రాద్రి లో ఉత్పత్తి అయ్యే విద్యుత్ యూనిట్లు ఎందుకు బంద్ పెట్టిండ్రు..నీళ్లు లేవని ఒకరు, బొగ్గు లేదని మరొకరు విద్యుత్, నీళ్లు బంద్ పెడుతున్నారు. మిల్లర్లను భయపెట్టి మిల్లులు బంద్ పెట్టిస్తున్నరు. కోమటిరెడ్డి, ఉత్తమ్, భట్టి మీరే సమాధానం చెప్పాలి అన్నారు .ఎండిన పొలాలకు ఏం సమాధానం చెబుతారో చెప్పండి..ఇందులో రాజకీయాలు అవసరంలేదు.. రైతులకు సమాధానం కావాలి..ఇందిరమ్మ రాజ్యమంటే రైతులను ఇబ్బందులు పెట్టడమేనా..ఓట్లేసి ఎన్నుకున్న ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై ఉన్నది.

**వెంటనే రైతుల కు సరిపడా నీళ్లు, 24 గంటల కరెంట్ అందించాలి..**

లేకుంటే రైతుల పక్షాన ఎటువంటి పోరాటానికైనా బి ఆర్ ఎస్ పార్టీ సిద్ధంగా ఉంటది అని హెచ్చరించారు. ఈ పర్యటనలో. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్ట మల్లికార్జునరెడ్డి, నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్కే కరీం పాషా, గోన రవీందర్ రావు,నల్గొండ మాజీ జెడ్పిటిసి తుమ్మల లింగస్వామి,కనగల్ నల్లగొండ మండల పార్టీ అధ్యక్షులు అయితగోని యాదయ్య, దేప వెంకటరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్, కార్పొరేటర్లు, మారగొని భవాని గణేష్, పెరికె యాదయ్య దొడ్డి రమేష్, బాణావత్ దీప్లా, గోపగోని స్వాతి రాజశేఖర్, రావుల శ్రీనివాసరెడ్డి, రామగిరి శ్రీధర్ రావు,జొన్నలగడ్డ శేఖర్ రెడ్డి బైరగోని వెంకన్న గౌడ్ సుంకి రెడ్డి వెంకట్ రెడ్డి,సర్పంచ్ కారింగు జానయ్య, గుండెబోయిన జంగయ్య, రాము,మర్రి రేణుక, నర్రా నిర్మల ,చెనగొని యాదగిరి ,చెనగొని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలి

- **6000 విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం**
- **అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి**
- **జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**



నల్లగొండ, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి): వినాయక ఉత్సవాలలో భాగంగా ఈ సంవత్సరం నల్గొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 6 వేల విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందని అందువల్ల నిమజ్జన కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు .

ఆదివారం అయన వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తో కలిసి రెవెన్యూ, పోలీస్ ,ఆర్డీఓలు మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వినాయక నిమజ్జనం లో భాగంగా సోమ, మంగళ, బుధవారాలలో ఎక్కువ విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందని, అందువల్ల అన్ని నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం సరైనంత నీటి వసతి లేనందున భక్తులు చెరువులు, కుంటలు, నదుల లోపలికి దిగి నిమజ్జనం చేయకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నిమజ్జన కేంద్రాల వద్ద లైటింగ్ తో పాటు, బారికేడింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, క్రేన్లు, మెడికల్ టీంలు, సూపర్వైజర్ల ను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు అవకాశం లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, బేబీ పాండ్స్ ఏర్పాటు చేసి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, నిమజ్జనంలో పంచాయతీ అధికారులు, మున్సిపల్ అధికారుల పాత్ర ముఖ్యమని అన్నారు.విగ్రహాలు నిమజ్జనం చేసే నిర్వాహకులు వినాయక విగ్రహాలతో పాటు, చెత్తను నీటిలో వేయకుండా అక్కడ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలో వేయాలన్నారు. నిమజ్జనం సందర్భంగా స్థానిక పోలీసులతో పాటు, 12వ బెటాలియన్ పోలీసులు, ఎస్డిఆర్ఎఫ్, ఆపదమిత్ర సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగడానికి వీలులేదని అన్నారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 28 నిమజ్జన ప్రదేశాలను గుర్తించడం జరిగిందని, ఈ కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు తో పాటు, అన్ని ఏర్పాట్లను చేయాలని, ముఖ్యంగా తహసిల్దారులు, ఎంపీడీవోలపై ఎక్కువ బాధ్యత ఉందని, శనివారం జిల్లా వ్యాప్తంగా 500 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆది, సోమ ,మంగళ, బుధవారాల్లో ఎక్కువ మొత్తంలో విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని, గతంలో చేసిన ఏర్పాట్లను మించి ఈసారి చేయాలని ,ఈ సంవత్సరం విగ్రహాలు ఎక్కువగా రిజిస్టర్ అయి ఉన్నందున ఏర్పాట్లు కూడా అదే స్థాయిలో చేయాలన్నారు. అన్ని చోట్ల బారికేడింగ్ తో పాటు, క్రేన్లు, లైటింగ్ ,పోలీసు బందోబస్తు ఏర్పాటు, అన్ని చూడాలని ,ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోవద్దని, విగ్రహాలు నిమజ్జనం చేసే చోట సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలన్నింటిని డివిజన్ తో పాటు, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్ కి అనుసంధానించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు నేరుగా నీటి ప్రదేశాలలోకి వెళ్లి వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయకుండా చూడాలని, అక్కడ ఏర్పాటు చేసిన గజ ఈతగాళ్ళ ద్వారా మాత్రమే విగ్రహాలను లోపలికి తీసుకువెళ్లి నిమజ్జనం చేయాలని, నిమజ్జనం చేసిన విగ్రహాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని రిజిస్టర్లో నమోదు చేయాలని చెప్పారు. ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు మాట్లాడారు.

# పోలీసుల పహారాలో జూరాల ప్రాజెక్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 20(మనంన్యూస్): వనపర్తి జిల్లాలోని జూరాల ప్రాజెక్టు వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాలువ కింద సాగు చేసిన పంటలు తీవ్రంగా ఎండిపోతుండటంతో. నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయకట్టు రైతులు ఆందోళన బాట పట్టారు. పరిస్థితి చేయిదాటిపోకుండా ముందస్తు జాగ్రత్తగా అధికారులు ప్రాజెక్టు ప్రాంగణంలో భారీగా పోలీసులను మోహరించారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు మొత్తం పోలీసుల కట్టుదిట్టమైన పహారాలోకి వెళ్లిపోయింది.



### అసలేం జరిగింది?

ఎగువ నుంచి తగినంత నీటి ప్రవాహం లేక, తీవ్ర నిరీక్షణ మధ్య పంటలు ఎండిపోతుండటంతో ఆవేదన చెందిన ఆయకట్టు రైతులు శనివారం రోజు స్వయంగా ముందుకు వచ్చి జూరాల ఎడమ కాలువ గేట్లను ఎత్తారు. కాలువలోకి నీటిని విడుదల చేసుకుని తమ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయితే. పరిస్థితులను గమనించిన నీటిపారుదల శాఖ అధికారులు అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ఎడమ కాలువ గేట్లను తిరిగి బంద్ చేశారు. కాలువకు నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు.

### రైతుల ఆగ్రహం.. భారీ ధర్నా

ఉదయాన్నే కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోవడాన్ని గమనించిన రైతులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. అధికారులు నీటి విడుదల నిలిపివేయడంతో ప్రాజెక్టు వద్దకు భారీగా చేరుకున్న రైతులు ధర్నాకు దిగారు. 'నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో కళ్లముందే ఎండిపోతున్నాయి. తక్షణమే ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి మా పంటలను, మమ్మల్ని ఆదుకోవాలి,' అని రైతులు కన్నీటిపర్యంతమవుతూ నినాదాలు చేశారు.

### ప్రాజెక్టు వద్ద గట్టి పోలీసు భద్రత

రైతుల నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ప్రాజెక్టు వద్ద భారీగా పోలీసు బలగాలను దించారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. ఎడమ కాలువ గేట్ల వద్దకు ఎవరూ రాకుండా బలగాలు కాపలా కాస్తున్నాయి. అధికారులు మాత్రం నీటి లభ్యత, సాంకేతిక అంశాలను బట్టే కాలువలకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. పంటలు ఎండిపోతున్న తరుణంలో నీరు అందకపోతే తమకు భారీ నష్టం తప్పదని ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఏపీకి ఎలా వెళ్తున్నాయి..? కేటీఆర్

జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లాలో మీడియాతో మాట్లాడిన ఆయన. జూరాలకు ఎగువ నుండి నీళ్లు లేవని.. కాలువకు నీటి విడుదల ఆపామని అధికారులు చెప్తున్నారని కానీ ఏపీకి నీళ్ళు ఎలా పోతున్నాయని ప్రశ్నించారు. కర్ణాటక, ఏపీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాయి. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రం ప్రణాళికతో లేదు. ఆల్మట్టి ఎత్తు పెంచే యోచనలో కర్ణాటక రాష్ట్రం ఉంది. దీంతో పాలమూరుకు భవిష్యత్తులో నీళ్ళు రావు. ఈ విషయం మీద పక్కనే ఉన్న కర్ణాటకను ఎందుకు నిలదీయట్లేదు కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కేవరకు ఊరుకోం అని హెచ్చరించారు.

# కష్టకాలంలో కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ అండ

- అనారోగ్యంతో కోలుకున్న కార్యకర్త తల్లికి పరామర్శ
- రూ.15 వేల ఆర్థిక సాయం



ఏటూర్ నాగారం, సెప్టెంబర్ 20,మనం ప్రతినిధి: కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్కుమార్ అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర యువజన కార్యదర్శి కుంజా సూర్య సహకారంతో, విజయ్కుమార్ నేతృత్వంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు యూత్ సోషల్ మీడియా ప్రతినిధి వడ్డేపల్లి నవీన్ తల్లిని ఆదివారం పరామర్శించారు. ఆకస్మిక అనారోగ్యానికి గురై వారం రోజులపాటు వెంటిలేటర్ చికిత్స పొందిన ఆమె ఇటీవల డిశ్చార్జి అయి ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా దేవులపల్లి విజయ్కుమార్ మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలమని, వారి కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యకర్తల కుటుంబాలను ఎల్లవేళలా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా కార్యదర్శి ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, ఏటూరునాగారం డివిజన్ ఆత్మ చైర్మన్ కర్ల అరుణ, ఆర్టీఏ సభ్యుడు వసంత శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు కె.రంజిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు సర్వ అక్షిత్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గద్దల నవీన్, యూత్ మండల అధ్యక్షుడు గంట ఠాగూర్, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వ సాయి తేజ, నాయకులు పోలేబోయిన గోపాల్, కె.వేణు, ఈసం హరికృష్ణ, టౌన్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ల తరుణ్, వావిలాల శంభశివరావు, చెన్నెం ఎల్లయ్యతో పాటు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటికుంటలో పడి అక్కాచెల్లెళ్ల మృతి

- ములుగు మండలం ఖాసిందేపేటలో విషాద ఘటన



ములుగు ,సెప్టెంబర్ 20, మనం ప్రతినిధి: ములుగు మండలం ఖాసిందేపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నీటికుంటలో ప్రమాదవశాత్తు పడి అక్కాచెల్లెళ్లు మృతి చెందారు.

గ్రామానికి చెందిన అమ్జద్ పాషా తన కుటుంబ సభ్యులతో కలిసి పత్తి చేనుకు వెళ్లారు. ఆయన వెంట వెళ్లిన కుమార్తెలు సమ్యాన్ (19), ఆసియా (10) చేను పక్కనే ఉన్న నీటికుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇద్దరూ కుంటలో పడిపోయారు.

కొంతసేపటి తర్వాత తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనతో ఖాసిందేపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ములుగు అభివృద్ధిని అడ్డుకోలేరు

- మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య



మంగపేట,సెప్టెంబర్ 20, మనం ప్రతినిధి: ములుగు నియోజకవర్గ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. ఆదివారం కమలాపురంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసినంత మాత్రాన అభివృద్ధి పనులు ఆగవని పేర్కొన్నారు. ఏటూరునాగారం-బూర్గంపహాడ్ జాతీయ రహదారి నిర్మాణానికి రూ.44 కోట్లు మంజూరయ్యాయని, పనులు దసరా నాటికి ప్రారంభమవుతాయని తెలిపారు.

మంత్రి సీతక్క చొరవతో గిరిజన సంక్షేమ శాఖ జీఓ నంబర్ 124 ద్వారా ములుగు నియోజకవర్గంలో సుమారు 927 అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు సోమయ్య తెలిపారు. ఒక్కో పనికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని, మంగపేట మండలానికి రూ.6.80 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్రెడ్డి, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి ధనసరి అనసూయ సీతక్క చిత్రపటానికి సోమయ్య పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఎస్టీ సెల్ నాయకులు, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోలేరు



- సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

మంగపేట, సెప్టెంబర్ 20, మనం ప్రతినిధి: ములుగు నియోజకవర్గ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. ఆదివారం కమలాపురం గ్రామంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2023 డిసెంబరు 9న ప్రజా ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అనేక సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సోమయ్య తెలిపారు. ప్రభుత్వంపై కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేసినా ములుగు నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. ఏటూరునాగారం-బూర్గంపహాడ్ జాతీయ రహదారి పనులకు రూ.44 కోట్లు కేటాయించారని, దసరా నాటికి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. మంత్రి సీతక్క చొరవతో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ములుగు నియోజకవర్గానికి జీఓ నంబర్ 124 కింద సుమారు 927 పనులకు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఒక్కో పనికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని, మంగపేట మండలానికి రూ.6.80 కోట్ల కేటాయింపులు జరిగాయని వివరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డికి సోమయ్య కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, ఎస్టీ సెల్ నాయకులతో పాటు మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వీడన్ ఎంపీగా నీలా విఖే పాటిల్

ముంబయి, సెప్టెంబర్ 20 : మహారాష్ట్రకు చెందిన ప్రముఖ విద్యావేత్త నీలా విఖే పాటిల్ స్వీడన్ పార్లమెంటు సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 41 సంవత్సరాల నీలా స్టాక్హోమ్ నగర నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారని, ఎన్నిక ఈ నెల 13న జరిగిందని అధికారిక ప్రకటన తెలియజేసింది. ''349 మంది సభ్యులున్న స్వీడన్ పార్లమెంటులో సభ్యురాలిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉంది'' అని ఆమె ఒక వార్తా సంస్థకు తెలియజేశారు. ఓటు



వేయలేని వారి వాణిని పార్లమెంటులో వినిపిస్తానని ఆమె పేర్కొన్నారు. నీలా ముత్తాత విఠల్రావ్ విఖే పాటిల్ మహారాష్ట్రలో తొలి సహకార చక్కెర కర్మాగారం స్థాపించారు. ఆమె తాత బాలాసాహెబ్ విఖే పాటిల్ కేంద్ర మంత్రిగా పని చేశారు. ''మా తాత నేను 15 సంవత్సరాల వయసులో ఉండగా నాతో రాష్ట్ర బడ్జెట్ చదివించారు. నా ఎన్నిక ఆయనకు గర్వకారణమని భావిస్తున్నాను'' అని నీలా పేర్కొన్నారు. ఆమె గ్రీన్ పార్టీలో చాలా ఏళ్లుగా క్రియాశీలంగా ఉన్నారు.

మానవ మెదడు ఒకటి కాదు..

# రెండు వేర్వేరు అవయవాలు

## స్టాన్ఫర్డ్ యూనివర్సిటీ సైంటిస్టుల తాజా అంచనాలు

వాషింగ్టన్ ,సెప్టెంబర్ 20 : మెదడును ఒకే, ఏకీకృత అవయవంగా నిపుణులు శతాబ్దాలుగా పరిగణించేవారు. అయితే అమెరికాలోని స్టాన్ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల తాజా పరిశీలనలో కొత్త విషయం వెలుగు చూసింది. అది వాస్తవానికి రెండు విభిన్న అవయవాల సమాహారమని వారు పేర్కొన్నారు. లక్షల సంవత్సరాలపాటు అవి



వేర్వేరుగా రూపాంతరం చెందాయని తెలిపారు. మెదడు అభివృద్ధికి సంబంధించి ఇప్పటివరకూ వ్యాప్తిలో ఉన్న సిద్ధాంతాన్ని తాజా ఆవిష్కారం ప్రశ్నార్థకం చేసింది. ఒకే బీజకణం నుంచే మెదడు మొత్తం వృద్ధి చెందిందని నాటి సిద్ధాంతం చెబుతోంది. అలాగే ఆ అవయవంలోని అన్ని భాగాలకూ ఒకే మూలం ఉందని వివరిస్తోంది. అయితే మానవ మెదడులో రెండు పురాతన నాడీ వ్యవస్థలు ఉన్నాయని, ప్రకృతి వాటిని తెలివిగా కలిపేసిందని తాజా పరిశోధన చెబుతోంది. అందులో అత్యంత పురాతనమైన వ్యవస్థ.. గుండె కొట్టుకోవడం, శ్వాస, ఇతర ముఖ్య విధులను నియంత్రిస్తోంది. రెండో భాగం మానవులకే ప్రత్యేకమైన లక్షణాలను సమకూరుస్తోంది. మెదడులో కొన్ని రకాల కణాలను వృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా ఎందుకు ఇబ్బంది పడుతున్నారో ఈ ఆవిష్కారం తేటతెల్లం చేస్తోంది. మెదడులోని ముందు భాగం భిన్నమైన బీజకణం నుంచి వృద్ధి చెందినట్లు తాము తొలిసారిగా రుజువు చేశామని వివరించారు. ఇప్పుడు.. మెదడులోని వెనుక భాగం నుంచి న్యూరాన్లను ల్యాబ్లో వృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ), ఏఎల్ఎస్ వంటి రుగ్మతల గురించి అధ్యయనం చేయడానికి కొత్త మార్గం దొరికినట్లయిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

# అమెరికా నుంచి ఎలాంటి ప్రతిపాదనలను నఖ్వీ తీసుకురాలేదు

## ఇరాన్ విదేశాంగశాఖ వెల్లడి

టెహ్రాన్ ,సెప్టెంబర్ 20 : అమెరికా నుంచి తమకు ఎటువంటి సందేశం లేదా ప్రతిపాదనలు రాలేదని ఇరాన్ విదేశాంగశాఖ స్పష్టతనిచ్చింది. పాకిస్థాన్ ఇంటీరియర్ మంత్రి మోహసీన్ నఖ్వీ ఇరాన్ రాజధాని టెహ్రాన్ చేరుకొన్న వేళ ఈ వివరణ రావడం గమనార్హం. నఖ్వీ కేవలం ద్వైపాక్షిక సంబంధాలపై చర్చల నిమిత్తమే వచ్చినట్లు వెల్లడించింది.

మరోవైపు ఇరాన్ నుంచి అమెరికాకు మొత్తం ఏడు షరతులు వెళ్లాయి. ఇందుకోసం ఖతార్ మధ్యవర్తులను వాడుకుంది. డిమాండ్లను తిరస్కరిస్తే తాము నిర్ణయాత్మక యుద్ధానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు దీనిలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ సుప్రీం నేషనల్ కౌన్సిల్ చీఫ్ మోహసీన్ రెజాయి స్పందిస్తూ ఖతార్ ఇప్పటికే అమెరికాకు వీటిని చేరవేసిందని.. అధ్యక్షుడు ట్రంప్ స్పందన కోసం ఇరాన్ ఎదురు చూస్తున్నామని తెలిపారు. యుద్ధాన్ని ముగించడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడం వంటివి ఈ డిమాండ్లలో ఉన్నాయి.

మరోవైపు క్యాంప్డేవిడ్ తన వారాంతపు విడిదిని కుదించుకొని ట్రంప్ శ్వేతసౌధానికి హడావుడిగా తిరిగి వచ్చారు. శాంతి చర్చల పునః



ప్రారంభానికి ఇరాన్ ఏడు నిబంధనలు విధించిన తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకొన్నాయి. ఇక యెమెన్లో హూతీ రెబల్స్ కూడా సౌదీ రాజధాని రియాద్పై దాడి చేయడంతో అమెరికా కూడా పరిమిత స్థాయి సైనిక చర్యకు సిద్ధమవుతున్నట్లు వార్తొలొస్తున్నాయి

# 'ఐ లవ్ యూ' పలికించిన న్యూరాలింక్ చిప్

వాషింగ్టన్, సెప్టెంబర్ 20 : బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్ఫేస్ (బీసీఐ) అనే ఇంప్లాంట్పై క్లినికల్ ప్రయోగాలు చేపట్టిన న్యూరాలింక్.. పరీక్షార్థుల అనుభవాలతో తాజాగా ఒక వీడియోను విడుదల చేసింది. నాడీ సంబంధ వ్యాధి కారణంగా



మాట్లాడలేని ఒక వ్యక్తి.. తన జీవిత భాగస్వామికి 'ఐ లవ్ యూ' చెబుతున్న దృశ్యం ఇందులో ఉంది. ఈ మాటలు ఆయన నోటిద్వారా కాకుండా కంప్యూటర్ వ్యవస్థ ద్వారా వెలువడ్డాయి. ఆయన మెదడులోని ఆలోచనలను చదివిన బీసీఐ సాధనం వాటిని కృత్రిమ మాటల రూపంలో తెలియజేస్తుంది. మెదడు సంకేతాలను ఉపయోగించి కంప్యూటర్ కర్సర్ను నియంత్రించడం, డిజిటల్ సాధనాలతో సంధానం కావడం వంటివి చేయవచ్చని న్యూరాలింక్ ఇప్పటికే రుజువు చేసింది. నాడీ సంబంధ రుగ్మతలతో మాట్లాడలేనివారు ఇదే రీతిలో టెక్స్టలు, మాటల రూపంలో కమ్యూనికేషన్ సాగించగలరా అన్నది పరిశీలించేందుకు 'వాయిస్' అనే ప్రాజెక్టును చేపట్టింది. న్యూరాలింక్ను ఎలాన్ మస్క్ స్థాపించారు.

# రియాద్పై హూతీల దాడి?



- విమానాశ్రయం వద్ద భారీ పేలుడు
- ఐరాస భద్రతా మండలి ఆందోళన

దుబాయ్,సెప్టెంబర్ 20 : యెమెన్లోని హూతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను ఉద్ధృతం చేశారు. ఈ దాడులతో రాజధాని రియాద్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో దట్టమైన పొగ, మంటలు చెలరేగుతున్న దృశ్యం కనిపించిందని స్థానికులు తెలిపారు. సౌదీలో మీడియాపై ఆంక్షలు ఉన్నందున అక్కడి సమాచారం బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేదు. మరోవైపు ఆ దేశం నుంచి విమాన రాకపోకలు బాగా ఆలస్యమవుతున్నాయని అంతర్జాతీయ విమాన రాకపోకల వివరాలు తెలిపే యాప్ 'ఫ్లైట్ రాడార్ 24' తెలియజేసింది. హూతీలు సౌదీపై దాడులు ఉద్ధృతం చేయడాన్ని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఖండించింది. ఈ దాడులు వివాదాన్ని మరింత విస్తృతం చేయడంతోపాటు సముద్రయాన, అంతర్జాతీయ వాణిజ్య భద్రతకు పెనుముప్పుగా పరిణమిస్తాయని పేర్కొంది. హూతీలకు ఆయుధాల అందజేతపై మండలి ప్రకటించిన నిషేధాన్ని అన్ని దేశాలూ అమలు చేయాలని స్పష్టం చేసింది.

### అమెరికాకు షరతులు తెలిపాం: ఇరాన్

యుద్ధాన్ని అంతం చేసేందుకు ఇరాన్ కొన్ని షరతులు విధించింది. దేశ జాతీయ భద్రతా మండలి ఖతార్ సాయంతో అమెరికాకు ఆ షరతులను చేరవేసిందని మధ్యవర్తి ఒకరు వెల్లడించారు.తమ షరతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందన కోసం ఎదురు చూస్తున్నామని ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి అధినేత మొహిసిన్ రెజాయి ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.




క్విక్-కామర్స్ కిరాణా డెలివరీ సేవలు నగర జీవితాన్ని సులభతరం చేశాయన్నది కాదనలేని వాస్తవం. నిత్యావసరాల కోసం ప్రతిదీ ముందుగానే ప్లాన్ చేసుకుని, మీ వంటగదిని నింపుకోవాల్సిన రోజులు పోయాయి. ఈ రోజుల్లో ఒక్క క్లిక్‌తో కేవలం 10 నిమిషాల్లో వస్తువులు మీ ఇంటి గుమ్మం ముందు వచ్చి వాలిపోతున్నాయి. అంతమాత్రం చేత 'హమ్మయ్య' అంటూ గుండె మీద చేయి వేసుకుని, సంబర పడిపోవడం కుదురుతుందా? ఆధునిక మానవుడు సుఖ జీవనం కోసం తెచ్చిపెట్టుకున్న ప్రతి సౌకర్యం కొన్ని మంచి, చెడులతో కూడినదే అయి ఉంటోంది. క్విక్-కామర్స్ కిరాణా డెలివరీ కూడా దీనికి మినహాయింపు కాదు. దీనిలోని చీకటి కోణం ఏమిటి?

# ఆత్రుతతో ఆపదే!

## ఆహార భద్రతకు సవాలుగా 'క్విక్ కామర్స్ కిరాణా డెలివరీ'

వీక్షణం

క్విక్-కామర్స్ డెలివరీ సేవలు జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, ఇవి వినియోగదారుల్లో చాలా ఆందోళనలకు కూడా తెరతీశాయి. గడువు ముగిసిన ప్యాకెట్లు, కుళ్ళిపోయిన ఆహారం, భారీ స్థాయిలో కల్తీ, ఇంకా మరెన్నో! దీని తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (**FSSAI**) ఇటీవల కొన్ని ప్రముఖ క్విక్-కామర్స్ కిరాణా డెలివరీ ప్లాట్‌ఫామ్‌లకు తొమ్మిది నోటీసులను జారీ చేసింది. వీటి ద్వారా గడువు ముగిసిన, పాడైపోయిన, కలుషితమైన, సురక్షితం కాని ఆహార ఉత్పత్తులను డెలివరీ చేస్తున్నారని ఆరోపిస్తూ వచ్చిన అనేక వినియోగదారుల ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాల అమ్మకం, సక్రమంగా నిల్వ చేయకపోవడం, నిర్వహించకపోవడం, తప్పుదారి పట్టించే లైసెన్సింగ్ సమాచారం, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం సరిగా లేకపోవడం వంటి ఆహార భద్రత ప్రమాణాల చట్టం, 2006 తాలూకు ఉల్లంఘనలను ఈ ఫిర్యాదులు సూచిస్తున్నాయని నియంత్రణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా 'క్విక్ కామర్స్, డార్క్ స్టోర్లు, 10-15 నిమిషాల డెలివరీ సంస్కృతి' పెరిగిన నేపథ్యంలో వినియోగదారుడు ఆర్డర్ చేసే సమయంలో ఉత్పత్తి గడువు తేదీని పరిశీలించే అవకాశం తగ్గుతోంది. 2026లో వచ్చిన వినియోగదారుల సర్వేలు, **FSSAI** చర్యలు ఈ సమస్యపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

### పది నిమిషాల డెలివరీ... వెనుక ఏం జరుగుతోంది?

క్విక్ కామర్స్ సంస్థలు నగరాల్లో చిన్న చిన్న 'డార్క్ స్టోర్లు, మైక్రో ఫుల్ఫిల్మెంట్ కేంద్రాల'ను ఏర్పాటు చేసి వేల రకాల వస్తువులను నిల్వ చేస్తున్నాయి. వినియోగదారుడు యాప్‌లో ఆర్డర్ చేసిన వెంటనే సమీప కేంద్రంలో ఉన్న వస్తువును సిబ్బంది తీసి ప్యాక్ చేస్తారు. డెలివరీ సిబ్బంది దాన్ని కొన్ని నిమిషాల్లో వినియోగదారుడి ఇంటికి చేరుస్తారు. ఇక్కడే అసలు సవాలు మొదలవుతుంది. సాధారణ సూపర్ మార్కెట్‌లో వినియోగదారుడు షెల్ఫ్ ముందు నిలబడి ప్యాకెట్ తీసుకుని 'తయారీ తేదీ, గడువు తేదీ, ప్యాకింగ్ వివరాలు' చూసే అవకాశం ఉంటుంది. క్విక్ కామర్స్‌లో ఆ అవకాశం చాలా సందర్భాల్లో తగ్గిపోతుంది. యాప్‌లో ఫొటో కనిపిస్తుంది. ధర కనిపిస్తుంది. ఆఫర్ కనిపిస్తుంది. డెలివరీ సమయం కనిపిస్తుంది. కానీ... 'ఈ ప్యాకెట్‌కు ఇంకా ఎన్ని రోజులు గడువు ఉంది?' అన్న సమాచారం స్పష్టంగా కనిపిస్తుందా? ఇదే పెద్ద ప్రశ్న.

### సర్వే ఏం చెబుతోంది?

2026లో **LocalCircles** నిర్వహించిన ఒక సర్వేలో 17,000 మందికి పైగా వినియోగదారుల అభిప్రాయాలను 164 జిల్లాల నుంచి సేకరించారు. దాదాపు 48 శాతం మంది వినియోగదారులు ఆన్‌లైన్ గ్రోసరీ కొనుగోలు సమయంలో ప్యాక్ చేసిన ఆహార పదార్థాల **Best Before** సమాచారం కనిపించడం లేదని చెప్పారు. 35 శాతం మంది ఏ ప్లాట్‌ఫామ్‌లోనూ ఈ సమాచారం కనిపించలేదని తెలిపారు. సర్వేలో కొన్ని ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో **Best Before** సమాచారం నిరంతరం స్పష్టంగా కనిపించకపోవడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ఇది కేవలం ఒక యాప్ సమస్యగా చూడాల్సిన విషయం కాదు. వినియోగదారుడికి సమాచారం ఎంత స్పష్టంగా అందుతోంది? డార్క్ స్టోర్లలో నిల్వ నిర్వహణ ఎలా ఉంది? పాత స్టాక్ ముందుగా బయటకు వెళ్తుందా? గడువు దగ్గరపడిన వస్తువులను ఎలా నిర్వహిస్తున్నారు? ఇవి మొత్తం ఆహార భద్రతకు సంబంధించిన ప్రశ్నలు.

### ఎక్స్‌పైరీ డేట్‌పై FSSAI నియమం ఏమిటి?

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం వినియోగదారులు తెలుసుకోవాలి. **Food Safety and Standards Authority of India - FSSAI** - ఈ-కామర్స్ ద్వారా విక్రయించే ఆహార పదార్థాలపై ప్రత్యేక నిబంధనల్ని విధించింది. **FSSAI** 2024లో ఇచ్చిన ఆదేశం ప్రకారం, వినియోగదారుడికి ఆహార పదార్థం డెలివరీ చేసే సమయంలో దానికి 'కనీసం 30 శాతం షెల్ఫ్ లైఫ్ లేదా 45 రోజులు మిగిలి ఉండాలి'. అంటే ఆన్‌లైన్‌లో ఆహార పదార్థాన్ని కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు 'కేవలం వస్తువు చేతికి వచ్చింది' అని సంతృప్తి చెందకూడదు. 'దానికి తగినంత మిగిలిన షెల్ఫ్ లైఫ్ ఉందా?' అన్నది కూడా చూడాలి.

### అసలు ప్రమాదం ఎక్కడ ఉంది?

క్విక్ కామర్స్‌తో ఒక ప్రత్యేక సమస్య ఉంది. దాని 'వేగం'. ఒక డార్క్ స్టోర్‌లో వందలు, వేల రకాల వస్తువులు ఉండవచ్చు. అందులో: పాలు, పెరుగు, బ్రెడ్, గుడ్లు, మాంసం, చీజ్, బటర్, జ్యూస్, స్నాక్స్, బిస్కెట్లు, రెడీ-టు-ఈట్ ఆహారం, ప్రోటీన్ ఉత్పత్తులు, పిల్లల ఆహారం, సాస్‌లు, ప్యాకేజ్డ్ ఫుడ్ వంటి అనేక రకాల పదార్థాలు ఉంటాయి. ప్రతి వస్తువు గడువు తేదీని నిరంతరం పర్యవేక్షించడం పెద్ద సవాలు. అందుకే 'స్టాక్ రొటేషన్, బ్యాచ్ ట్రాకింగ్, ఉష్ణోగ్రత నియంత్రణ, గడువు తేదీ పర్యవేక్షణ' అనేవి కీలకం.

### 'ముందుగా వచ్చినది, ముందుగా అమ్మాలి... సరైనదేనా?'



ఆహార నిల్వల్లో సాధారణంగా '**FIFO, First In, First Out** విధానం గురించి మాట్లాడుతారు. అంటే ముందుగా వచ్చిన స్టాక్ ముందుగా బయటకు వెళ్లాలి. కానీ గడువు తేదీ విషయంలో '**FEFO , First Expire, First Out** విధానం మరింత ప్రధానమైంది. అంటే ముందుగా గడువు ముగిసే ఉత్పత్తిని ముందుగా పంపాలి. క్విక్ కామర్స్‌లో ఇది చాలా కీలకం. ఎందుకంటే ఒకే బ్రాండ్‌కు చెందిన రెండు ప్యాకెట్లు ఉండవచ్చు. ఒకదానికి ఇంకా రెండు నెలల గడువు ఉండొచ్చు. మరోదానికి కేవలం మూడు రోజులు మాత్రమే ఉండొచ్చు. పాత తేదీ ఉన్న ప్యాకెట్‌ను గుర్తించి ముందుగా బయటకు పంపకపోతే సమస్య మొదలవుతుంది.

### ఫిర్యాదులు ఎందుకు పెరుగుతున్నాయి?

2026లో కొన్ని క్విక్-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించి వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో **FSSAI** తొమ్మిది నోటీసులు జారీ చేసింది. గడువు ముగిసిన, పాడైన, కలుషితమైన ఆహార పదార్థాలపై ఫిర్యాదులు వచ్చినట్టు కొన్ని పత్రికలు నివేదించాయి. మరో ఘటనలో హైదరాబాద్‌లో ఒక వినియోగదారురాలికి గడువు ముగిసిన చికెన్ ఉత్పత్తి డెలివరీ అయిన కేసులో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆ ఉత్పత్తి గడువు కొనుగోలు తేదీకి రెండు నెలల ముందే ముగిసినట్లు కేసు వివరాలు చెబుతున్నాయి. ఇలాంటి ఘటనలు 'క్విక్ డెలివరీ అంటే కేవలం వేగం కాదు... నాణ్యత కూడా అంతే ముఖ్యం' అనే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి.

### డెలివరీ తీసుకున్న తర్వాతే తేదీ కనిపిస్తోంది

ఇది మరో ముఖ్యమైన సమస్య. **FSSAI** నిబంధనల ప్రకారం ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు వినియోగదారుడికి అవసరమైన ఆహార సమాచారాన్ని కొనుగోలు పూర్తయ్యే ముందే అందుబాటులో ఉంచాలి. 2024 ఆదేశాల్లో ఉత్పత్తి సమాచారం స్పష్టంగా అందుబాటులో ఉండాలని, డెలివరీ సమయంలో తగినంత షెల్ఫ్ లైఫ్ ఉండాలని స్పష్టం చేశారు. 2026 సర్వేలో దాదాపు సగం మంది వినియోగదారులకు **Best Before** సమాచారం సులభంగా కనిపించకపోవడం ఈ నిబంధనల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

### డెలివరీ ఏజెంట్ బాధ్యుడా?

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చూడాలి. డెలివరీ సిబ్బంది ప్రధానంగా 'చివరి దశ రవాణా' చేస్తారు. ఉత్పత్తిని ఎంచుకోవడం, స్టాక్ నిర్వహణ, గడువు తేదీ పర్యవేక్షణ, సరైన నిల్వ వంటి బాధ్యతల్ని కేవలం డెలివరీ ఏజెంట్లపై వేయలేం. **FSSAI** ఈ-కామర్స్ సంస్థలు చివరి దశ డెలివరీ చేసే సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రతపై శిక్షణ ఇవ్వాలని సూచించింది. ఆహారం, ఇతర వస్తువులను వేర్వేరుగా నిర్వహించడం ద్వారా కలుషితం కాకుండా చూడాలని కూడా సూచించింది. అందువల్ల సమస్యను 'డెలివరీ ఏజెంట్ తప్పు'గా మాత్రమే చూడటం సరైనది కాదు. ఇది మొత్తం సరఫరా వ్యవస్థకు సంబంధించిన అంశం.

### వినియోగదారుడు తిరస్కరించవచ్చా?

గడువు ముగిసిన ఉత్పత్తి డెలివరీ అయితే, 'వాడకండి.' యాప్‌లో వెంటనే ఫిర్యాదు చేయండి. సాధ్యమైనంత స్పష్టంగా: '**Expired product delivered**' లేదా '**Insufficient shelf life**' అని నమోదు చేయండి. ఫొటోలు, బిల్, ఆర్డర్ నంబర్, డెలివరీ సమయం వంటి ఆధారాల్ని జతపరచండి. కంపెనీ రిఫండ్ ఇవ్వగానే విషయం ముగిసిపోయిందని భావించకూడదు. గడువు ముగిసిన ఆహార పదార్థం డెలివరీ అయితే అది 'ఆహార భద్రత సమస్య' కూడా కావచ్చు. **FSSAI**కి చెందిన '**Food Safety Connet**' పోర్టల్లో **Packaged Food, Food Premises, Online Aggregator / Food Delivery Platforms** పై ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఫిర్యాదుతో పాటు ఉత్పత్తి ఫొటో, బిల్ వంటి ఆధారాలు జతచేయాలని **FSSAI** సూచిస్తోంది. ఫిర్యాదుకు ప్రత్యేక నంబర్ లభిస్తుంది; దాని స్థితిని ట్రాక్ చేయవచ్చు.

### ప్లాట్‌ఫామ్‌లు ఏం చేయాలి?

క్విక్ కామర్స్ సంస్థలకు ఇది కేవలం వినియోగదారుడి సంతృప్తి సమస్య కాదు. ఇది '**Food Safety Management**' సమస్య. ప్రతి డార్క్ స్టోర్‌లో ముందుగా గడువు ముగిసే ఉత్పత్తి ముందుగా బయటకు వెళ్లేలా సాఫ్ట్‌వేర్ వ్యవస్థ ఉండాలి. **Expiry Alerts** గడువు దగ్గరపడుతున్న ఉత్పత్తులకు ఆటోమేటిక్ అలర్ట్ రావాలి. ప్రతి బ్యాచ్‌కు సంబంధించిన తేదీ సిస్టమ్‌లో ఉండాలి. **"Automatic Blocking"**. గడువు ముగిసిన ఉత్పత్తి ఆర్డర్‌లో కనిపించకుండా సిస్టమ్ ఆటోమేటిక్‌గా బ్లాక్ చేయాలి.

- పసుపులేటి గీత
(అసిస్టెంట్ ఎడిటర్)




## Expiry Date... Best Before... రెండూ ఒకటేనా?

చాలామంది వినియోగదారులకు ఇక్కడే గందరగోళం. '**Expiry / Use By**'... ఇది అత్యంత ముఖ్యమైన తేదీ. **Use By** లేదా **Expiry** తేదీ దాటిన ఆహారాన్ని వినియోగించడం సురక్షితం కాదనే హెచ్చరికగా చూడాలి.

### Best Before

**Best Before** అంటే ఆ తేదీ వరకు ఉత్పత్తి తన నాణ్యత, రుచి, లక్షణాలను ఉత్తమ స్థాయిలో కలిగి ఉండే కాలాన్ని సూచిస్తుంది. అయితే వినియోగదారుడు తేదీ దాటితే దీన్ని తప్పకుండా సురక్షితమే అని అర్థం చేసుకోకూడదు. ఉత్పత్తి రకం, నిల్వ విధానం, ప్యాకేజింగ్, ఉష్ణోగ్రత వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. **FSSAI** లేబెలింగ్ నిబంధనల్లో తయారీ లేదా ప్యాకింగ్ తేదీ, **Expiry/Use By** తేదీ వంటి వివరాలు ప్రకటించాల్సి ఉంటుంది.

### ఎక్కడ ఫిర్యాదు చేయాలి?

**FSSAI Food Safety Connect**కి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, ప్యాకేజ్డ్ ఫుడ్, ఆహార భద్రత సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఉత్పత్తి ఫొటో, బిల్, ఇతర ఆధారాలు జతచేయడం ఉపయోగకరం.

**FSSAI** హెల్ప్‌లైన్: **1800 -11 - 2100**

జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్: **1915**

క్విక్ కామర్స్ మన జీవితాన్ని సులభం చేసింది. వర్షం పడుతున్నప్పుడు వస్తువుల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేదు. రాత్రి ఇంట్లో సరుకు అయిపోయినా ఇబ్బంది లేదు. వృద్ధులకు, ఒంటరిగా జీవించే వారికి, అనారోగ్యంతో ఉన్నవారికి, చిన్న పిల్లలున్న కుటుంబాలకు ఈ సేవలు ఉపయోగకరంగా ఉంటాయి.

## ఒక్క క్షణం...

కిటికీ

*కానీ 'సౌకర్యం పెరిగిన కొద్దీ వినియోగదారుడి పరిశీలన తగ్గకూడదు'. ఒక సూపర్ మార్కెట్‌లో ప్యాకెట్ తీసుకున్నప్పుడు మనం తేదీ చూస్తాం. అదే అలవాటు ఆన్‌లైన్ వ్యవహారాల్లో కూడా ఉండాలి. 'డెలివరీ అయింది అంటే కొనుగోలు ప్రక్రియ ముగిసినట్టు కాదు, ఉత్పత్తి సురక్షితంగా ఉంది' అని నిర్ధారించుకున్నప్పుడే అది పూర్తవుతుంది.*

### వినియోగదారుడి 30 సెకన్ల చెక్‌లిస్ట్

*డెలివరీ వచ్చిన వెంటనే:*
***"Expiry / Use By Date"*** *చూడండి.*
***"Best Before Date"*** *చూడండి.*
***"Manufacturing / Packing Date"*** *చూడండి.*
***"Batch Number"*** *చూడండి.*
***"FSSAI License Number"*** *చూడండి.*

*ప్యాకెట్ సీల్ పరిశీలించండి. ప్యాకెట్ ఉబ్బిందా, లీక్ అవుతోందా చూడండి. చల్లగా ఉంచాల్సిన పదార్థాలు సరైన స్థితిలో ఉన్నాయా చూడండి. అనుమానం ఉంటే 'తినకండి'. ఫొటోలు తీసి ఉంచండి. యాప్‌లో ఫిర్యాదు చేయండి. అవసరమైతే '**Food Safety Connect**'లో ఫిర్యాదు చేయండి. క్విక్ కామర్స్‌లో వేగం వినియోగదారుడికి సౌకర్యం. సౌకర్యం కోసం ఆహార భద్రతలో మాత్రం రాజీపడకూడదు. పది నిమిషాల్లో సరుకు ఇంటికి రావడం గొప్ప సాంకేతిక సౌకర్యం కావచ్చు. కానీ ఆ పది నిమిషాల డెలివరీ వెనుక... 'పది రోజుల గడువు ఉందా? పది గంటల గడువు ఉందా? లేదా గడువు ఇప్పటికే ముగిసిపోయిందా? అన్నది వినియోగదారుడికి తెలియాలి. '**FSSAI** ప్రకారం ఈ-కామర్స్ ద్వారా డెలివరీ చేసే ఆహార ఉత్పత్తికి డెలివరీ సమయానికి కనీసం 30% షెల్ఫ్ లైఫ్ లేదా 45 రోజులు మిగిలి ఉండేలా చూడాలి.'*

– కల్కి

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR, RNI Reg No.TELTEL/2016/72952.